



www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 12 మంగళవారం | ఆగస్టు 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 327

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur








## అత్తను చంపి 19 ముక్కలుగా కోసిన డెంటిస్ట్..

- కోలాల గ్రామంలో కలకలం రేపిన హత్య
- రోడ్డు పక్కన 14 ప్లాస్టిక్ వర్లలో అవయవాలు
- తల ఆధారంగా మృతురాలి గుర్తింపు
- అత్త ప్రవర్తనపై అసహనం
- అల్లుడు దారుణం

2



## 2.17 లక్షల నకిలీ కరెన్సీ నోట్ల గుర్తింపు

- అత్యధికంగా కొత్త రూ.500 నోట్లు
- మొత్తం 1.17 లక్షలు
- రూ.100 నోట్లు 51 వేలకుపైగా, రూ.200 నోట్లు 32 వేలకుపైగా
- నోట్ల భద్రతపై ఆర్బీఐతో కేంద్రం సమీక్ష

2

# రాహుల్ గాంధీ అరెస్ట్





- పార్లమెంట్ హౌజ్ నుంచి ఎన్నికల సంఘం ఆఫీసు దాకా ర్యాలీ ప్రణాళిక
- మార్గమధ్యంలో బారికేడ్ల వద్ద నేతల అరెస్ట్
- మల్లికార్జున్ ఖర్గే, జైరాం రమేష్‌ను పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు తరలింపు
- బీహార్ ఓటర్ల జాబితా సవరణపై విపక్షాల తీవ్ర వ్యతిరేకం
- బీహార్‌లో ఓట్ల సవరణ ఆపాలని ప్రతిపక్ష పార్టీల డిమాండ్
- ఎస్ఐఆర్, ఓటు చోరీ నినాదాలతో తెల్ల క్యాప్‌లు, ప్లకార్డులు
- టీఎంసీ ఎంపీలు బారికేడ్లపై ఎక్కి నిరసన
- విపక్ష ఆరోపణ -ఎన్నికల సంఘం, ప్రభుత్వం కుమ్మక్కు
- 'ప్రజాస్వామ్య హత్య' ఆరోపణలతో బ్యానర్లు, పోస్టర్లు



2

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

పార్లమెంట్ హౌజ్ నుంచి కేంద్ర ఎన్నికల సంఘం ఆఫీసు వరకు ర్యాలీ తీసే ప్రయత్నం చేసిన కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మార్గమధ్యంలో వాళ్లను అడ్డుకుని అరెస్టు చేశారు. వారితో పాటు ఇతర విపక్ష నేతల్ని కూడా ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బస్సుల్లోకి ఎక్కించి పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్‌కు కాంగ్రెస్ చీఫ్ మల్లిఖార్జున్ ఖర్గేతో పాటు జైరాం రమేశ్‌ను తరలించారు. తమ పోరాటం రాజకీయం కోసం కాదు అని, రాజ్యాంగం కోసం అని రాహుల్ గాంధీ రిపోర్టర్లకు తెలిపారు. నిజాలు యావత్ దేశం ముందు ఉన్నాయని అన్నారు.కొందరు ఎంపీలు పార్లమెంట్ స్ట్రీట్‌లో ఉన్న పీటీఐ బిల్డింగ్ వద్ద బైఠాయించారు. ఎన్నికల సంఘం ఆఫీసుకు కిలోమీటరు దూరంలో వాళ్లను అడ్డుకున్నారు. బీహార్ ఓటర్ల జాబితా సవరణ చేపట్టడాన్ని విపక్షాలు వ్యతిరేకించాయి. సిర్‌ను ఆపేయాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఇవాళ ట్రాన్స్‌పోర్టు భవన్ వద్ద పోలీసులు కొందరు ఎంపీలను అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐఆర్, వోట్ చోరీ అని తెల్ల క్యాప్‌లపై రాసి వాటిని విపక్ష ఎంపీలు ధరించారు. సిర్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. పార్లమెంట్ మకర ద్వారం నుంచి నిరసన ర్యాలీ ప్రారంభమైంది. టీఆర్ బాలు, సంజయ్ రౌత్, డెరిక్ ఓబ్రెయిన్, ప్రియాంకా గాంధీ, అఖిలేశ్ యాదవ్‌తో పాటు ఇతర నేతలు ర్యాలీలో పాల్గొన్నారు. ట్రాన్స్‌పోర్ట్ భవన్ వద్ద టీఎంసీ ఎంపీలు మహువా మొయిత్రా, సుస్మితా దేవ్, సంజనా జాతవ్, జ్యోతిమని ఎంపీలు బారికేడ్లను ఎక్కారు. బీహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వెనక్కి తీసుకోవాలని ఎంపీలు డిమాండ్ చేశారు. సిర్ ప్లస్ ఓట్ తెఫ్ట్ ఈక్వల్ టు మర్డర్ ఆఫ్ డెమోక్రసీ అని బ్యానర్లపై రాశారు. ఎన్నికల సంఘం, ప్రభుత్వం కుమ్మక్కై ఓటర్ల జాబితాను సవరిస్తున్నట్లు విపక్షాలు ఆరోపించాయి.

## పాక్ అణు బెదిరింపులపై భారత్ ఫైర్

- అణు బెదిరింపులు పాక్ బాధ్యతారాహిత్యానికి నిదర్శనం
- భారత్-అమెరికా మద్దతు పాక్ సైన్యానికి పెరిగిన ధైర్యం
- అమెరికా నేలపై నుంచి భారత్‌పై అణు బెదిరింపులు
- సింధు జలాల ఒప్పందంపై మునీర్ కఠిన హెచ్చరిక
- భారత్ డ్యామ్‌ను 10 క్షిపణులతో కూల్చేస్తామని మునీర్ ధమ్కీ
- భారత్ మెర్సిడేంజ్ - పాక్ డంప్ ట్రక్కు పోలికనా...
- భారత్‌తో కయ్యానికి వద్దని పాక్‌కు అమెరికా సలహా



2

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

అమెరికా పర్యటనలో ఉన్న పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసీమ్ మునీర్ చేసిన అణ్వాయుధ బెదిరింపు వ్యాఖ్యలపై భారత్ తీవ్రంగా స్పందించింది. మునీర్ వ్యాఖ్యలు అణ్వాయుధ దేశమైన పాకిస్థాన్ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అమెరికా మద్దతు ఇచ్చిన ప్రతి సందర్భంలోనూ పాక్ సైన్యం తన నిజ స్వరూపాన్ని బయటపెడుతుందని మండి పడ్డాయి. "పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ వ్యాఖ్యలు అణ్వాయుధాలు కలిగిన బాధ్యతరాహిత్య దేశానికి నిదర్శనం..అసిమ్ మునీర్ ప్రకటన కవ్వింపు చర్యల్లో భాగం... పాకిస్థాన్ సైన్యానికి అమెరికా మద్దతు ఇచ్చిన ప్రతిసారి తన రంగులను బయటపెడతుంది" అని న్యూఢిల్లీ వర్గాలు ఆరోపించాయి.సైనిక చీఫ్ వ్యాఖ్యలు పాకిస్థాన్‌లోని అణ్వాయుధాలు ప్రయివేటు సంస్థల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని సూచిస్తున్నాయని మండిపడ్డాయి. "పాకిస్థాన్‌లో ప్రజాస్వామ్యం లేదు.. దానిని నియంత్రించేది వారి సైన్యమే' అని పేర్కొన్నాయి. అమెరికా పర్యటనకు వెళ్లిన పాక్ ఆర్మీ చీఫ్ మునీర్.. ఫ్లోరిడాలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అణుయుద్ధం గురించి బహిరంగంగానే బెదిరింపులకు దిగారు. భవిష్యత్తులో భారత్‌తో యుద్ధం జరిగి తమ దేశం ఉనికికి ముప్పు ఎదురైతే 'సగం ప్రపంచాన్ని' నాశనం చేస్తామని హెచ్చరించాడు. అమెరికా భూభాగం నుంచి మూడో పక్షంపై అణు బెదిరింపులకు దిగడం ఇదే మొదటిసారి.అంతేకాదు, పాకిస్థాన్‌కు వచ్చే ప్రవాహాన్ని అడ్డుకునేలా సిందూ నదీ మార్గంలో భారత్ ఏదైనా నిర్మాణం చేపడితే ధ్వంసం చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డాడు. తమ దేశానికి క్షిపణుల కొరత లేదని వ్యాఖ్యానించారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయం 25 కోట్ల మంది ప్రజలను ఆకలిలోకి నెట్టేసే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. 'భారత్ డ్యామ్ పూర్తిచేసే వరకూ వేచిచూసి.. 10 క్షిపణులతో దాన్ని

## ముఖ్యమంత్రి పదవిపై డిప్యూటీ సీఎం భట్టి ఆసక్తికర వ్యాఖ్యలు

- సీఎల్పీనేతగా ఉన్నప్పుడు సీఎం పదవిని ఆశించానన్న భట్టి
- డిప్యూటీ సీఎం పదవితో సంతోషంగా ఉన్నానని వెల్లడి
- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని మాట ఇచ్చింది నిజమేనన్న భట్టి విక్రమార్క మల్లు



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తాను ముఖ్యమంత్రి పదవిని ఆశించిన మాట నిజమే నని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. సీఎల్పీ లీడర్ గా ఉన్న తాను సీఎం పదవిని ఆశించానని చెప్పారు. కానీ, పార్టీ హైకమాండ్ తనకు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చిందని... ఈ పదవితో తాను సంతోషంగానే ఉన్నానని తెలిపారు.
కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చిన మాట కూడా వాస్తవమేనని భట్టి చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుతుందని... కాంగ్రెస్ దరిదాపుల్లోకి కూడా బీజేపీ, బీఆర్ఎస్ లు రాలేవని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ నేతల మధ్య సఖ్యత లేదనే వార్తలపై ఆయన స్పందిస్తూ... పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, రేణుకా చౌదరిలతో తనకు ఎలాంటి విభేదాలు లేవని చెప్పారు.
గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు ఎలా కట్టాలో ఏపీ ప్రభుత్వానికి తెలిస్తే... ఆ ప్రాజెక్టును ఎలా ఆపాలో తమకు తెలుసని భట్టి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై నివేదికను అసెంబ్లీలో పెడతామని... అవినీతికి పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో అసెంబ్లీ నిర్ణయిస్తుందని చెప్పారు.

## మరోసారి సీఎం రేవంత్‌ను టార్గెట్ చేసిన.. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

- సీఎం రేవంత్‌పై మరోసారి రాజగోపాల్‌రెడ్డి విమర్శలు
- మంత్రి పదవి హామీ అమలు కాలేదని ఆరోపణ
- హైకమాండ్ నిర్ణయాన్ని రాష్ట్ర నేతలు అడ్డుకున్నారన్న వ్యాఖ్య
- భట్టి విక్రమార్కకు సోషల్ మీడియా ద్వారా ధన్యవాదాలు
- 'మంత్రి పదవి ముఖ్యం కాదు' -రాజగోపాల్‌రెడ్డి స్పష్టం



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తనకు మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయాన్ని మీడియా ద్వారా ప్రజలకు వివరించినందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు రాజగోపాల్ రెడ్డి 'ఎక్స్' వేదికగా ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్: ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మరోసారి సీఎం రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ.. సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా.. రేవంత్ రెడ్డిపై విరుచకపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తనకు మంత్రి పదవి ఇస్తామన్న హామీని అమలు చేయకుండా రాష్ట్ర ముఖ్య నేతలు అడ్డుకున్నారని మండిపడ్డారు.తనకు మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయాన్ని మీడియా ద్వారా ప్రజలకు వివరించినందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు రాజగోపాల్ రెడ్డి 'ఎక్స్' వేదికగా ధన్యవాదాలు తెలిపారు. తనకు మంత్రి పదవిపై హైకమాండ్ మాట ఇచ్చిన విషయం సహా.. కొందరు అడ్డుకుంటున్నారనే వాస్తవాలను భట్టి బయటపెట్టారని చెప్పారు. తనకు మంత్రి పదవి ముఖ్యం కాదన్నారు. ప్రజలుకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కారు అమలు చేయాలని, అవినీతి రహిత పాలన అందించాలని కోరుతున్నానని పేర్కొన్నారు. తెలంగాణ సమాజ ఆకాంక్షలను నెరవేర్చేలా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఉండాలని ఆశిస్తున్నానట్లు స్పష్టం చేశారు.

## ఏపీలో లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్..

- సీఎం చంద్రబాబు కీలక సమీక్ష
- మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ఏపీ లాజిస్టిక్స్ కార్పొరేషన్‌ను త్వరితగతిన ఏర్పాటు చేయాలని ఆదేశం
- కుప్పం,అమరావతి సహా 4 కొత్త విమానాశ్రయాల పనులు ప్రారంభించాలని సూచన



2


**అమరావతి-నవభూమి ప్రతినిధి**

ఏపీ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని కీలకమైన పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల మొదటి దశ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా ఈ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను వేగవంతం చేయాలని, వాటిని రాష్ట్రానికి ఆర్థిక వనరులుగా మార్చాలని ఆయన సూచించారు.సోమవారం ఉండవల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో పోర్టులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో చంద్రబాబు ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో రవాణా, సరఫరా వ్యవస్థలను మరింత పటిష్ఠం చేసేందుకు ఏపీ లాజిస్టిక్స్ కార్పొరేషన్‌ను త్వరితగతిన ఏర్పాటు చేయాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పోర్టులు, విమానాశ్రయాలు, రహదారులను అనుసంధానిస్తూ సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. దీని ద్వారా లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గించి, ఎగుమతి సామర్థ్యాన్ని పెంచవచ్చని

## ఈడీ విచారణకు హాజరైన రానా

- ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్‌పై ఆరోపణలు
- సినీ సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై ఈడీ ఫోకస్
- 29 మందిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ నమోదు
- రానా దగ్గుబాటి ఐదేళ్ల బ్యాంక్ స్టేట్‌మెంట్ సమర్పణ
- జంగిల్ రమ్మీ యాప్ ప్రమోషన్ ఆరోపణలపై విచారణ
- జాబితాలో విజయ్ దేవరకొండ, ప్రకాశ్ రాజ్, మంచు లక్ష్మి పేర్లు
- మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు కొనసాగింపు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణలో బెట్టింగ్ యాప్స్ కేసు సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసులో తాజాగా టాలీవుడ్ హీరో దగ్గుబాటి రానా హైదరాబాద్ లోని బషీర్‌బాగ్ ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. పలు రకాల ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు రానా ప్రమోట్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ యాప్‌లను ప్రమోట్ చేసిన సినీ సెలబ్రిటీలు, యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఫోకస్ చేసింది. మొత్తం 29 మందిపై ఈడీ.. ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్‌నమోదు చేసింది. ఈ జాబితాలో రానా దగ్గుబాటి, విజయ్ దేవరకొండ, ప్రకాశ్ రాజ్, మంచు లక్ష్మి వంటి స్టార్లు ఉన్నారు.
ఈడీ ముందుకు రానా:కాగా, రానా ఈ రోజు ఈడీ అధికారుల ముందు హాజరై, తన ఐదేళ్ల బ్యాంక్ స్టేట్‌మెంట్‌లను సమర్పించారు. జంగిల్ రమ్మీ అనే బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేసిన ఆరోపణలపై ఈడీ అధికారులు ఆయన స్టేట్‌మెంట్ రికార్డ్ చేస్తున్నారు. గతంలో జులై 23న విచారణకు రావాలని రానాకు నోటీసులు వచ్చాయి.
కానీ షూటింగ్ షెడ్యూల్ కారణంగా ఆయన రాలేకపోయారు. దీంతో ఈడీ

## విలన్లు క్లైమాక్స్‌లోనే అరెస్ట్ అవుతారు

**మంత్రి వెంకట్ రెడ్డి సెటైరికల్ కామెంట్స్**

- జగదీశ్వర్‌రెడ్డి గురువును మించిన శిష్యుడు
- ఇంటర్నేషనల్ లీడర్
- ఎవరు కమిషన్లు ఇస్తే వాళ్ల వెంట తిరిగేవాడు:కోమటిరెడ్డి

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

హైదరాబాద్: మాజీ మంత్రి జగదీష్ రెడ్డి గురువును మించిన శిష్యుడని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. జగదీష్ రెడ్డి ఇంటర్నేషనల్ లీడర్ అని ఎద్దేవా చేశారు. ఆయన సోమవార మీడియాతో మాట్లాడారు. ఆయన మంత్రిగా ఉన్నప్పుడు కమిషన్లు ఎవరు ఇస్తే వాళ్ళ వెంట తిరిగేవారని విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌజ్‌లో ఎకరం రూ.50 లక్షలు ఉంటే.. జగదీష్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో ఎకరం రూ.40 కోట్లు ఉంటుందని చెప్పుకొచ్చారు.

**జగదీష్ రెడ్డి గురువును మించిన శిష్యుడు..**

జగదీష్ రెడ్డి ఫామ్‌హౌస్ 80 ఎకరాలతో కేసీఆర్ జేజమ్మ లెక్క ఉటుందని మంత్రి వెంకట్ రెడ్డి ఆరోపించారు. జగదీష్ రెడ్డి చేసిన అవనీతిపై విచారణ చేపిస్తున్నామని బాంబు పేల్చారు. కేసీఆర్ కంటే ఎక్కువ జగదీష్ రెడ్డి సంపాదించారని దుయ్యబట్టారు. త్వరలో అవినీతికి పాల్పడిన నాయకులు చిట్టా బయటకు తీస్తామని స్పష్టం చేశారు. అవినీతికి పాల్పడిన నాయకులు తప్పకుండా.. రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## పులివెందులలో ఎన్నికల వేళ.. వైసీపీకి హైకోర్టు షాక్

- హైకోర్టులో వైసీపీ పిటిషన్ నిరాకరణ
- బూత్ మార్పుపై అప్పిరెడ్డి యత్నం విఫలం
- ఎన్నికల ప్రక్రియ మొదలైందని వాదన
- మంగళవారం 15 కేంద్రాల్లో పోలింగ్
- 10,601 మంది ఓటర్లు సిద్ధం
- 100 సిబ్బందితో ఏర్పాట్లు పూర్తి



2

**కడప-నవభూమిబ్యూరో**

మరికొన్ని గంటల్లో పులివెందుల జడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. అలాంటి వేళ ఈ ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల మార్పుపై జోక్యం చేసుకోవాలంటూ వైసీపీ నేత, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం ఏపీ హైకోర్టు విచారణకు స్వీకరించింది. ఈ ఉప ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల మార్పులో జోక్యాన్ని ఏపీ హైకోర్టు నిరాకరించింది.ఈ జడ్పీటీసీ ఎన్నికల్లో ఆరు పోలింగ్ బూత్‌లు మార్చాలంటూ లేళ్ల అప్పిరెడ్డి తన పిటిషన్‌లో స్పష్టం చేశారు. అయితే మరికొన్ని గంటల్లో పోలింగ్ జరుగుతుందని హైకోర్టుకు ఎన్నికల సంఘం తరఫున న్యాయవాదులు స్పష్టం చేశారు. అంతేకాదు.. ఎన్నికల ప్రక్రియ సైతం ప్రారంభమైందని కోర్టుకు వారు వివరించారు. ఈ నేపథ్యంలో ఏపీ హైకోర్టు పై విధంగా కీలక నిర్ణయం తీసుకుంది.ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాలోని పులివెందుల్లో జరగనున్న జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు జిల్లా ఉన్నతాధికారులు వెల్లడించారు. సోమవారం పులివెందుల్లో ఉన్నతాధికారులు మాట్లాడుతూ.. మండల కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లుతోపాటు ఇతర పోలింగ్ సామాగ్రి చేరుకున్నాయని వివరించారు. మంగళవారం పులివెందుల

## మరో అల్పపీడనం

- ఏపీలో దంచికొడుతున్న వానలు
- 13న అల్పపీడనం ఏర్పడే అవకాశం
- 18న మరో అల్పపీడనం: వాతావరణ శాఖ
- 6 రోజుల్లో రాష్ట్రంలోని భారీ వర్షాలు
- ఈ జిల్లాలకు తాజా హెచ్చరిక..!!



2

**అమరావతి-నవభూమిబ్యూరో**

ఏపీలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో వరుస అల్ప పీడనాలతో రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కొనసాగుతున్నాయి. 13న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ విభాగం తెలిపింది. దీని ప్రభావంతో రాబోయే ఆరు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు పడతాయని వెల్లడించింది. గురు, శుక్రవారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ నెల 18న మరో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో ఈ నెలాఖరు వరకు రాష్ట్రంలో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఏపీలో పలు ప్రాంతాల్లో వానలు దంచికొడుతున్నాయి. నదులు, వాగులు, వంకలు ఉప్పొంగి ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల పంటలు నీట మునిగాయి. రాయలసీమ జిల్లాల్లో వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. భారీ వర్షాలకు పెన్నా నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. కర్నూలు జిల్లాలో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఆస్పరి మండలంలో పుప్పాలదొడ్డి వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఆదోని మండలంలో వాగులు, వంకలు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. బసాపురం గ్రామంలో మేక దూడ వంక పొంగి పొర్లుతోంది. దీంతో రాకపోకలు

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in






## పార్టీ విలీనంపై కేసీఆర్ అత్యవసర సమావేశం..!

**సంగారెడ్డి-నవభూమి:** ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్ వేదికగా బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తన ముఖ్య అనుచరులతో వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం పార్టీ ముఖ్య నేతలు కేటీఆర్, హరీష్ రావు, మాజీ ఎంపీ వినోద్ కుమార్‌తో ఆయన సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కాళేశ్వరం కమిషన్ రిపోర్టుకు సంబంధించి సుప్రీంకోర్టుకు వెళ్లే విషయంపై వారు కూలంకుషంగా చర్చించారు. అలాగే ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారంపై సైతం సుప్రీంకోర్టుకు వెళ్లాలని వారంతా నిర్ణయించారు. దీంతో పామ్‌హౌస్ సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో పామ్‌హౌస్ సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. అదే విధంగా బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం అంటూ జరుగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఈ సందర్భంగా పార్టీ కీలక నేతలకు అధినేత కేసీఆర్ స్పష్టమైన సూచన ఇచ్చినట్లు సమాచారం.రూ. లక్షల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయాయి. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. దాదాపు 15 నెలల పాటు విచారించిన ఈ కమిషన్.. ఇటీవల ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఈ నివేదికలో ఈ ప్రాజెక్ట్ నిర్మాణంలో అంతా బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ కీలకమని స్పష్టం చేసినట్లు కథనాలు వెల్లువెత్తాయి. దీనిపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ సిట్ నివేదిక ఆధారంగా దోషులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

## నవ వార్త




## 2024-25 ఆర్థిక సంవత్సరంలో.. 2.17 లక్షల నకిలీ కరెన్సీ నోట్లు గుర్తింపు



**న్యూఢిల్లీ-నవభూమి:** 2024-25 ఆర్థిక సంవత్సరంలో వివిధ డినామినేషన్లకు చెందిన 2.17 లక్షలకు పైగా నకిలీ కరెన్సీ నోట్లను గుర్తించారు. ఇందులో 1.17 లక్షలకుపైగా కొత్త రూ.500 నకిలీ నోట్లు ఉన్నాయి. ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 2.23 లక్షలకుపైగా నకిలీ నోట్లను గుర్తించినట్లు తెలిపారు. అయితే 2024-25 ఆర్థిక సంవత్సరంలో వివిధ డినామినేషన్లకు చెందిన 2.17 లక్షలకు పైగా నకిలీ నోట్లు బయటపడినట్లు చెప్పారు. ఇందులో అత్యధికంగా కొత్త రూ.500కు చెందిన 1,17,722 నకిలీ నోట్లు ఉన్నాయని అన్నారు. అలాగే రూ.100 డినామినేషన్లకు చెందిన 51,069 నకిలీ నోట్లు, రూ.200కు చెందిన నకిలీ నోట్లు 32,660 ఉన్నాయని పార్లమెంట్‌కు వెల్లడించారు.కాగా, కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)తో సంప్రదించి కరెన్సీ నోట్ల భద్రతను సమీక్షిస్తున్నది ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. ఆర్బీఐ చట్టం 1934లోని సెక్షన్ 25 ప్రకారం కొత్త భద్రతా ఫీచర్లు, కొత్త డిజైన్లు ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తద్వారా నకిలీ నోట్ల కట్టడికి నిరంతరం ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. ఆర్బీఐకు సంబంధించిన ఇతర ప్రశ్నలకు కూడా కేంద్ర మంత్రి సమాధానమిచ్చారు.

## సీఎం రేవంత్ రెడ్డికి ఊరట.. ఆ కేసును కొట్టేసిన హైకోర్టు..



**హైదరాబాద్-నవభూమి:**సీఎం రేవంత్ రెడ్డికి ఇటీవల చట్టపరమైన అంశాల్లో ఊరట లభిస్తోంది. ఆయనపై నమోదైన పలు రకాల కేసులను న్యాయస్థానాలు కొట్టేస్తున్నాయి. తాజాగా తెలంగాణ హైకోర్టు అతనిపై నమోదైన కేసును కొట్టేస్తూ తీర్పు ఇచ్చింది తెలంగాణ హైకోర్టు. 2019లో జరిగిన ఎన్నికల సమయంలో సూర్యాపేట జిల్లాలోని గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌లో రేవంత్ రెడ్డిపై ఒక కేసు నమోదైంది. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని ఆరోపణలు వచ్చిన ఈ కేసును కొట్టివేయాలని రేవంత్ రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ కె. లక్ష్మణ్, ఈ కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చారు. ఈ నిర్ణయం రేవంత్ రెడ్డికి ఊరట కల్పించింది.గతంలో కూడా సీఎం రేవంత్ రెడ్డిపై నమోదైన రెండు కేసులు న్యాయస్థానం కొట్టి వేసింది. నల్గొండలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు.. కొడిపల్లి పీఎస్‌లలో మరో కేసు నమోదయ్యాయి. వాటిని రద్దు చేస్తూ నెల రోజుల క్రితం కోర్టు తీర్పు ఇచ్చింది. 2021లో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించిన ఆందోళనల్లో ఆయనపై నమోదైన రెండు కేసులను నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు కొట్టివేసింది. జులై 26న స్వయంగా విచారణకు హాజరైన ముఖ్యమంత్రి, తన తరపు న్యాయవాదుల వాదనలతో కోర్టును సంతృప్తి పరిచారు. అన్ని సాక్ష్యాలను పరిశీలించిన తర్వాత, న్యాయస్థానం ఈ కేసులను రద్దు చేస్తూ తీర్పునిచ్చింది. తాజాగా ఈ తీర్పుతో రేవంత్ రెడ్డికి చట్టపరమైన ఇబ్బందులు దాదాపు తొలగిపోయానే చెప్పాలి.

**ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు..**

అదేవిధంగా.. రేవంత్ రెడ్డిపై దాఖలైన మరో కేసులో సుప్రీంకోర్టు ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో రేవంత్ రెడ్డిపై పిటిషన్ వేసిన వ్యక్తి పెద్దిరాజుకు సుప్రీంకోర్టు అక్షింతలు వేసింది. ఈ కేసును గతంలోనే తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. కానీ, పెద్దిరాజు ఈ కేసును నాగ్‌పూర్ బెంచ్‌కు బదిలీ చేయాలని సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసమి భట్టాచార్యపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడంతో, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. న్యాయమూర్తికి క్షమాపణలు చెప్పాలని, వారం రోజుల్లో అఫిడవిట్ సమర్పించాలని పెద్దిరాజును ఆదేశించింది. ఈ పరిణామం రేవంత్ రెడ్డికి పరోక్షంగా సానుకూలంగా మారింది.

మొత్తంగా.. ఈ తీర్పులు, వ్యాఖ్యలు రేవంత్ రెడ్డికి చట్టపరంగా లభించిన విజయాన్ని సూచిస్తున్నాయి. తెలంగాణలో ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యతలను సజావుగా నిర్వహించడానికి ఈ క్లీన్‌చిట్ దోహదపడుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ చట్టపరమైన చిక్కుల నుంచి బయటపడటంతో, రేవంత్ రెడ్డి పూర్తిస్థాయిలో పాలనపై దృష్టి పెట్టే అవకాశం ఉంటుంది.

## మెగా డీఎస్సీ ఫలితాలు విడుదల



**అమరావతి -నవభూమి:** ఏపీ మెగా %DSC% ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాలను %https://apdsc.apcfss.in%లో తెలుసుకోవచ్చు. 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ కోసం రాష్ట్ర ప్రభుత్వం %DSC% నిర్వహించిన సంగతి తెలిసిందే.

ఈ ఫలితాలు విడుదలైన వెంటన ఏం చేయ్యాలంటే..?

అభ్యర్థులు ఫలితాల కోసం అధికారిక వెబ్ సైట్ https://apdsc.apcfss.inను సందర్శించాలి. హోమ్ పేజీలో కనిపించే »»%AP DSC Results% 2025" లింక్‌పై క్లిక్ చేయాలి.మీ రూల్ నెంబర్ లేదా రిజిస్ట్రేషన్ నెంబర్, పుట్టిన తేదీ తదితర వివరాలను నమోదు చేయాలి. వివరాలను సబ్‌మిట్ చేసిన తర్వాత.. మీ ఫలితాలు స్క్రీన్‌పై కనిపిస్తాయి.భవిష్యత్తు అవసరాల కోసం ఫలితాలను డౌన్‌లోడ్ చేసుకుని, ప్రింట్ తీసుకోవడం మంచిది.

జూన్ 6వ తేదీన..ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత.. 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ నియామకానికి మెగా డీఎస్సీ నిర్వహించింది. ఈ పరీక్ష కోసం మొత్తం 3,36,307 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది జూన్ 6 నుంచి జులై 2వ తేదీ వరకు.. అంటే 23 రోజుల పాటు ఈ పరీక్షలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఆ రాష్ట్రానికి సరిహద్దులుగా ఉన్న తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, ఒడిశాల్లో సైతం ఈ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ మెగా డీఎస్సీ పరీక్షలకు 92.90 శాతం మంది హాజరయ్యారు.

## అత్తను చంపి 19 ముక్కలుగా కోసిన డెంటిస్ట్.. ఎందుకంటే..!




**న్యూఢిల్లీ-నవభూమి:** పంటి వైద్యుడుఅయిన ఓ అల్లుడు తన అత్తను చంపి 19 ముక్కలుగా కోశాడు. ఆ తర్వాత తలతో సహా ఇతర దేహభాగాలను 14 ప్లాస్టిక్ కవర్ల (%ాశ్రీుఖరఅఎ ఎశీజవతీం%) లో కుక్కి రోడ్డు పక్కన పడేశాడు. కర్ణాటక రాష్ట్రంలోని తుమకూరు జిల్లా కొరటగెరె పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోలాల గ్రామంలో ఈ దుర్ఘటన జరిగింది.వివరాల్లోకి వెళ్తే.. కోలాల గ్రామంలో ఆగస్టు 7న రోడ్డు వెంట ఏడు ప్లాస్టిక్ కవర్లలో ఓ మహిళ శరీర అవయవాలు కుక్కిపడేసి ఉండటాన్ని బాటసారులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు ఆ ఏడు కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత అక్కడ తనిఖీ చేయగా మరో ఏడు కవర్లలో మహిళా దేహ భాగాలు కనిపించాయి.ఓ చోట తల కూడా లభ్యమైంది. ఆ తల ఆధారంగా మృతురాలు కోలాల గ్రామానికే చెందిన 42 ఏళ్ల లక్ష్మీదేవిగా పోలీసులు గుర్తించారు. ఆమె పిల్లనిచ్చిన అల్లుడు, డెంటల్ డాక్టర్ అయిన రామచంద్రప్ప ఆమెను హత్యచేసినట్లు కనిపెట్టారు. అత్త ప్రవర్తన సరిగా లేకపోవడం, దాంతో తెలిసిన వాళ్లు మీ అత్త అలాంటిది, మీ అత్త ఇలాంటిది అని మాట్లాడటం రామచంద్రప్ప అవమానంగా భావించాడు.ఎంత చెప్పినా అత్త తన ప్రవర్తన మార్చుకోకపోవడంతో విసిగిపోయాడు. తన పరువు తీస్తోందని కుమిలిపోయాడు. చివరికి ఆమెను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. అందుకు తన స్నేహితులైన కేఎన్ సతీశ్, కేఎస్ కిరణ్‌ల సాయం తీసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తు

## తెలంగాణలోని ఐటీ కంపెనీ.. ఆగస్టు 18న శంకుస్థాపన..



**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణలోని ములుగు జిల్లాలో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతోంది. ఈ నెల 18న ములుగులో ఐటీ కంపెనీకి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన చేసి.. శాశ్వత భవనానికి పునాది వేయనున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. దీని ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని.. జిల్లా ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని మంత్రి పేర్కొన్నారు. ఐటీ ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు వెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారు. స్థానికులకు ఇక్కడే మంచి ఉద్యోగం లభించే అవకాశం ఉంటుందన్నారు.తెలంగాణ ప్రభుత్వం ఐటీ రంగాన్ని ఇతర జిల్లాలకు కూడా విస్తరించే అవకాశం ఎక్కువగా ఉంది. గతంలో హైదరాబాద్‌లోనే ఐటీ కంపెనీలు ఉండేవి. ఇప్పుడు వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం వంటి నగరాలకు కూడా వచ్చాయి. ములుగులో ఐటీ కంపెనీ రాకతో ఆ జిల్లా కూడా ఐటీ మ్యాప్‌లో చేరింది. నిర్భయ పథకం కింద దేశంలో ఎంపికైన 10 జిల్లాలలో ములుగు కూడా ఉందన్నారు. ఇప్పటివరకు హైదరాబాద్, వరంగల్ వంటి నగరాలకే పరిమితమైన ఐటీ రంగాన్ని ములుగు వంటి మారుమూల ప్రాంతాలకు విస్తరించడం ఒక గొప్ప చర్యగా చెప్పుకోవచ్చు.

అంతేకాకుండా.. ములుగు జిల్లా మంజీరా ప్రాంతంలో ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్ ఫామ్ సాగుతో రైతులకు మంచి లాభాలు వస్తాయన్నారు. ప్రభుత్వం సబ్సిడీతో ఒక్కో మొక్కను రూ. 25కే అందిస్తోందని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగుకు ఉన్న గ్యారంటీ మరే పంటకు ఉండదని మంత్రి అన్నారు. ఆయిల్ ఫామ్ సాగుకు ఉన్న గ్యారంటీ మరే పంటకు ఉండదని, 10 ఎకరాలు ఉన్న రైతులు కనీసం 5 ఎకరాలలో ఈ పంటను పండించాలని ఆమె అన్నారు.ఇదిలా ఉండగా.. మహిళలకు వడ్డీలేని రుణాలు ఇస్తామని.. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని మంత్రి సీతక్క తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని.. వ్యవసాయ రంగంలో తనకున్న అనుభవాన్ని పంచుకున్నారు. ములుగులో పర్యాటకాభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇస్తామని, కర్రెగుట్టను టూరిజం హబ్‌గా మారుస్తామని చెప్పారు.

## హైదరాబాద్ వాసులకు మరోసారి డేంజర్ బెల్స్.. ఈ ప్రాంత వాసులు జాగ్రత్త..



**హైదరాబాద్-నవభూమి:**గత కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం నాడు కూడా భారీ వర్షం కురిసింది. దీనితో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. వాతావరణ శాఖ మరో రెండు గంటల పాటు వర్షం కురుస్తుందని హెచ్చరించింది. జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ప్రజలను అప్రమత్తం చేశారు. వనస్థలిపురం, ఎల్బీనగర్, అల్వాల్, మల్కాజ్‌గిరి ప్రాంతాల్లో కుండపోతగా వాన పడింది. రాజేంద్రనగర్, అత్తాపూర్, మెహదీపట్నం, మియాపూర్, చందానగర్, లింగంపల్లి వంటి ప్రాంతాల్లో కూడా వర్షం దంచికొట్టింది. ఈ ప్రాంత వాసులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ఈ వర్షాల వల్ల హైదరాబాద్ నగరంలో జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి.

వర్షాలు మరో రెండు గంటలపాటు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీనితో ప్రజలు మరింత ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. వరద పరిస్థితులను ఎదుర్కోవడానికి అత్యవసర బృందాలు రంగంలోకి దిగాయి. రోడ్లపై నిలిచిన నీటిని తొలగించేందుకు కొత్తగా ఏర్పాటు చేసిన హైడ్రా బృందాలు కూడా పనిచేస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. అవసరమైతే తప్ప రాత్రి 9 గంటల వరకు ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు చెప్పారు.

హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కూడా ప్రజలను హెచ్చరించారు. వర్షం కారణంగా ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నిలిచిపోయింది. దీనివల్ల ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను తప్పించి, ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. రోడ్లపై నిలిచిన నీరు, తెరుచుకున్న మ్యాన్‌హోల్స్ కారణంగా వాహనదారులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వాహనదారులు నెమ్మదిగా, జాగ్రత్తగా ప్రయాణించాలని పోలీసులు తెలిపారు. రోడ్డు పక్కన ఉన్న చెట్లు, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## మేము ఇక ఆ పనులు చేయలేం.. హైడ్రాకు షాకిచ్చిన మార్షల్స్..



**హైదరాబాద్-నవభూమి:**జీహెచ్ఎంసీ పరిధిలో ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో రియల్ ఎస్టేట్ రంగానికి కొత్త రూపు తెచ్చిన 'హైదరాబాద్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ అథారిటీ' ప్రస్తుతం తీవ్ర ఆందోళనతో వార్తల్లో నిలిచింది. ఇటీవల భారీ వర్షాల నేపథ్యంలో.. హైడ్రా సిబ్బంది అయిన మార్షల్స్ తమ జీతాలు తగ్గించడంపై నిరసన తెలుపుతున్నారు. దీంతో నగరంలో హైడ్రా అత్యవసర సేవలు నిలిచిపోయాయి.

హైడ్రా మార్షల్స్ సమస్యలు, డిమాండ్లు..

హైడ్రాలో పనిచేసే మార్షల్స్ ఎక్కువగా మాజీ సైనిక ఉద్యోగులు. వీరిని 2020లో జీహెచ్ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో నియమించారు. వీరు ప్రస్తుతం హైడ్రాలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే.. ప్రభుత్వం తమ జీతాలను తగ్గించడంతో వారంతా విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. దీనితో హైడ్రా కంట్రోల్ రూమ్, శిక్షణ, ప్రజావాణి సేవలకు అంతరాయం ఏర్పడింది. గ్రేటర్ హైదరాబాద్‌లోని 150 డివిజన్లలో ఈ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి.

మార్షల్స్ తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కమిషనర్ రంగనాథ్‌ను సంప్రదించనున్నారు. వారి ప్రధాన డిమాండ్లలో.. వేతనాల తగ్గింపుపై వెనక్కి తీసుకోవడం ముఖ్యమైనది. తమ జీతాలు పెంచాలని, లేదా కనీసం గతంలో ఉన్న వేతనాలను కొనసాగించాలని కోరుతున్నారు. ఎమర్జెన్సీ పరిస్థితుల్లో 8 గంటలకు మించి పనిచేస్తే, అదనపు సమయానికి వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. తమ పనికి తగ్గట్టుగా వసతులు కల్పించాలని కోరుతున్నారు.మరోవైపు.. నగరంలో భారీ వర్షాలు కురుస్తున్న తరుణంలో హైడ్రా మార్షల్స్ నిరసన చేపట్టడం ప్రజలందరినీ కలవరపెడుతోంది. ఇలాంటి సమయంలో అత్యవసర సహాయం అవసరమైతే ఎవరు స్పందిస్తారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే జోక్యం చేసుకొని, వారి సమస్యలను పరిష్కరించి, సాధారణ సేవలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు. హైడ్రా మార్షల్స్ తీసుకున్న ఈ సంచలన నిర్ణయం వెనుక లోతైన చర్చలు గత వారం రోజులుగా జరుగుతున్నాయని సమాచారం.హైదరాబాద్‌లోని హైడ్రా మార్షల్స్ జీతాలు తగ్గించారనే వార్తలపై నిరసన వ్యక్తం చేసినప్పటికీ.. ఆ సమస్యకు త్వరగానే పరిష్కారం లభించినట్లు తెలుస్తోంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఈ విషయంలో జోక్యం చేసుకుని.. జీతాల్లో ఎలాంటి కోత ఉండదని, గతంలో అందుకున్న వేతనాలే కొనసాగుతాయని స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ హామీతో మార్షల్స్ తమ ఆందోళనను ఉపసంహరించుకున్నట్లు తెలుస్తోంది.

## ఆడుదాం ఆంధ్రాలో రోజా స్కాం బయటపెట్టిన భూమా అఖిలప్రియ






**అమరావతి -నవభూమి:** టీడీపీ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ వైఎస్సార్సీపీ మాజీ మంత్రి ఆర్కే రోజాపై తీవ్ర ఆరోపణలు చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వ పథకాల పేరుతో రోజా కోట్లాది రూపాయలు దుర్వినియోగం చేశారని అఖిలప్రియ అన్నారు. ఆడుదాం ఆంధ్రాలో భాగంగా పలు టెండర్లలో తేడాలు ఉన్నట్లు గుర్తు చేశారు. ఆ క్రమంలో రోజా ప్రజల నిధులను వ్యాపారం కోసం వాడుకోవడమే కాకుండా, సొంత ప్రయోజనాల కోసం అధికారాన్ని ఉపయోగించుకున్నారని అఖిల ప్రియ ఆరోపించారు.

## పాక్ అణు బెదిరింపులపై భారత్ ఫైర్

**(1వపేజీ తరువాయి)**కూల్చేస్తాం... సిందూ నది భారతీయుల కుటుంబ ఆస్తికాదు.. మాకు క్షిపణుల కొరత లేదు.. అంతా దేవుడే రక్షించాలి' అని భారత్‌పై కవ్వింపులకు పాల్పడ్డాడు. అంతేకాదు, పాకిస్థాన్ డంపింగ్ ట్రక్కు అని.. భారత్ మెర్సిడేంజ్‌తో పోల్చారు.

భారత్‌తో కయ్యానికి కాలు దువ్వితే మీకే నష్టం.. పాక్‌కు అమెరికా సలహా:'మెర్సిడేంజ్ బెంజ్ మాదిరి వేగంగా, సమర్థవంతంగా, సున్నితంగా భారత్ ప్రయాణిస్తుంది. ఆర్థికంగా, సైనికపరంగా పటిష్టంగా, వ్యవస్థీకృతంగా అభివృద్ధి చెందుతోంది.. మా దేశం ఒక డంప్ ట్రక్కులాగా పని చేస్తుంది.. అది సున్నితంగా ఉండకపోవచ్చు కానీ క్లిష్టమైన పనులను సమర్థవంతంగా పూర్తి చేస్తుంది.. ఇలాంటి ఓ ట్రక్కు వచ్చి మెర్సిడేంజ్‌ను ఢీకొంటే నష్టం ఎవరికి ఎక్కువగా జరుగుతుందో ఊహించుకోవాలి' అని అసిమ్ మునీర్ కారుకూతలు కూశారు.

## ఏపీలో లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్..

**(1వపేజీ తరువాయి)**ఆయన అభిప్రాయపడ్డారు.పోర్టులు, పారిశ్రామిక ప్రాంతాలకు అనుసంధానం మెరుగుపరిచేందుకు, ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా పీపీపీ పద్ధతిలో రహదారుల విస్తరణ చేపట్టాలని అధికారులకు తెలిపారు. స్థానిక మత్స్యకారుల ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగకుండా, కొన్ని ఫిషింగ్ హార్బర్లను మైనర్ పోర్టులుగా అప్‌గ్రేడ్ చేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం కోరారు. మచిలీపట్నం, రామాయపట్నం, మూలపేట, కాకినాడ గేట్‌వే పోర్టులతో పాటు, జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ల తొలి దశ పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

## పులివెందులలో ఎన్నికల వేళ.. వైసీపీకి హైకోర్టు షాక్

**(1వపేజీ తరువాయి)**జడ్పీటీసీ పరిధిలోని ఆరు గ్రామ పంచాయతీల పరిధిలోని 15 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరగనుంది.మొత్తం 10,601 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు మొత్తం 100 మంది ఎన్నికల అధికారులు, సిబ్బందిని వినియోగించనున్నారు. ఇక పులివెందుల జడ్పీటీసీ పరిధిలోని గ్రామాలు సమస్యాత్మకం కావడంతో.. దాదాపు 700 మందితో భారీ భద్రతను పోలీస్ శాఖ కసరత్తు చేస్తోంది. మరోవైపు ఈ జడ్పీటీసీ ఎన్నికలను అటు అధికార కూటమితోపాటు ఇటు వైసీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. దీంతో ఈ ఎన్నికలపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠత నెలకొంది.

## ఈడీ విచారణకు హాజరైన రానా

**(1వపేజీ తరువాయి)**మళ్లీ ఆగస్టు 11కి తాజా నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో రానాతో పాటు, ప్రకాశ్ రాజ్ (జూలై 30), విజయ్ దేవరకొండ (ఆగస్టు 6) ఇప్పటికే విచారణకు హాజరయ్యారు. మంచు లక్ష్మి ఆగస్టు 13న హాజరుకానుంది.

**మనీ లాండరింగ్ కోణం**

ఈడీ ఈ కేసులో మనీలాండరింగ్ జరిగిందా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తోంది. బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు హవాలా ద్వారా డబ్బు తరలించారా?, సెలబ్రిటీలకు రెమ్యునరేషన్ ఎలా చెల్లించారనే విషయాలపై ఈడీ లోతుగా విచారణ చేస్తోంది. పంజాగుట్ట, మియాపూర్, సూర్యాపేట, విశాఖలో నమోదైన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈ విచారణ కొనసాగుతోంది. ఈ యాప్‌ల వల్ల అనేక మంది డబ్బు పోగొట్టుకోవడమే కాక, కొందరు ఆత్మహత్యలకూ పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి.

**ఇప్పుడేం జరుగుతుంది?**

తెలంగాణలోనే కాకుండా, దేశవ్యాప్తంగా ఈ బెట్టింగ్ యాప్‌లపై తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ యాప్‌లు యువతకు ఆకట్టుకునేలా ఆఫర్స్ ఇచ్చి, వాటి మాయలో పడేలా చేస్తున్నాయి. దీంతో అనేక మంది వీటి బారిన పడి ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంటున్నారు. ఈ యాప్స్ మీద సరైన నియంత్రణ లేకపోవడం వల్ల మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి. ఈ విచారణల నేపథ్యంలో త్వరలో ఈ కేసు గురించి మరిన్ని విషయాలు వెలుగులోకి రానున్నాయి.

## విలన్లు క్లైమాక్స్‌లోనే అరెస్ట్ అవుతారు

**(1వపేజీ తరువాయి)**కేసీఆర్ అరెస్ట్ ఖాయం..

అనంతరం కేసీఆర్ అరెస్ట్‌పై వెంకట్ రెడ్డి సెటైరికల్‌గా స్పందించారు. సినిమాల్లో విలన్ల అరెస్టు క్లైమాక్స్ వరకు జరగదని తెలిపారు. విలన్లు ఫైనల్లోనే.. అరెస్ట్ అవుతారని గుర్తుచేశారు. అరెస్ట్ అనేది తమ పనికాదని.. పోలీసులు చూసుకుంటారని పేర్కొన్నారు. కేసీఆర్ చేసిన అవినీతి తెలిస్తే గుండె పలిగి చనిపోతారని విమర్శించారు. కాళేశ్వరం నివేదికతో కేసీఆర్ అస్సలు రంగు బయటపడిందని ధ్వజమెత్తారు. కేసీఆర్ ఎప్పుడు అరెస్ట్ అవుతారో చెప్పలేమని కానీ అరెస్ట్ మాత్రం ఖాయమని మంత్రి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.


## మరో అల్పపీడనం

**(1వపేజీ తరువాయి)**నేలిచిపోయాయి. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో రాత్రి కురిసిన భారీ వర్షానికి వీధులన్నీ జలమయమయ్యాయి. శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి శ్రీశైలంలో 1,99,714 క్యూసెక్కులు చేరుతోంది. జలాశయం నుంచి ఔట్ ఫ్లో 1,00,800 క్యూసెక్కులుగా ఉంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 35,000 క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,485 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 881.20 అడుగులకు పెరిగింది. రానున్న వారం రోజుల్లో సీమ జిల్లాలతో పాటుగా కోస్తా ప్రాంతంలోనూ భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ అలర్ట్స్ తో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తం అయింది.


## హైడ్రాకు మార్షల్స్ షాక్.. స్పందించిన రంగనాథ్

**హైదరాబాద్-నవభూమి:**రాష్ట్ర ప్రభుత్వం జీతాలు తగ్గించడంపై హైడ్రా మార్షల్స్ ఆందోళన చేపట్టారు. విధులను బహిష్కరించి తమకు న్యాయం చేయాలని నిరసన వ్యక్తం చేశారు. దీంతో హైడ్రా కంట్రోల్ రూమ్ సేవలతోపాటు ట్రైనింగ్, ప్రజావాణి సేవలు నిలిచిపోయాయి. ఈ విషయంపై తాజాగా.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. హైడ్రా మార్షల్స్ ఆందోళనపై ఆయన ఇవాళ(సోమవారం) మీడియాతో మాట్లాడారు.

## హృదయవిదారకం.. యాక్సిడెంట్ తర్వాత భార్య శవాన్ని బైక్‌కు కట్టి తీసుకెళ్లిన భర్త..



**ముంబై- నవభూమి:**నాగ్‌పూర్‌లో హృదయవిదారక ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన గురించి తెలిస్తే ప్రతి ఒక్కరూ కన్నీళ్లు పెట్టకు మానరు. ఎవరూ సహాయం చేసేందుకు ముందుకు రాకపోవడంతో ఓ వ్యక్తి తన భార్య మృతదేహాన్ని బైక్‌కు కట్టుకుని తీసుకెళ్లిన విషాద ఘటన నాగ్‌పూర్‌లో వెలుగులోకి వచ్చింది. నాగ్‌పూర్-జబల్‌పూర్ జాతీయ రహదారిపై ఈ విషాదకర ఘటన చోటు చేసుకుందినాగ్‌పూర్- జబల్‌పూర్ జాతీయ రహదారిపై అమిత్ తన భార్యతో కలిసి ప్రయాణిస్తున్నాడు. అమిత్ భార్య తన సోదరుడికి రాఖీ కట్టేందుకు వెళ్తోంది. డియోలాపర్ పోలీస్ స్టేషన్ పరిధి మోర్ఫాటా సమీపంలో ఆదివారం



మధ్యాహ్నం వారు ప్రయాణిస్తున్న బైక్‌ను ఓ ట్రక్కు ఢీకొట్టింది. వేగంగా వస్తున్న ట్రక్కు ఢీకొనడంతో అమిత్ భార్య అక్కడికక్కడే మరణించింది. ప్రమాదం తర్వాత అమిత్ ఆ రోడ్డుపై వెళ్తున్న వాహనదారులను సహాయం కోరాడు. కానీ ఎవరూ సహాయం చేయడానికి ముందుకు రాలేదు. దీంతో చేసేదేం లేక భార్య మృతదేహాన్ని తన బైక్‌కు కట్టుకున్నాడు.భార్య మృతదేహాన్ని బైక్‌కు కట్టుకుని హైవే మీద ప్రయాణించాడు. అతడిని చూసి కొందరు వాహనదారులు ఆపేందుకు ప్రయత్నించారు. అయితే ఏ కారణం చేతనో అమిత్ మాత్రం బైక్ ఆపకుండా నేరుగా తన స్వగ్రామానికి వెళ్లిపోయాడు. ఆ ఘటనను కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆ హృదయవిదారక ఘటన చాలా మందికి కన్నీళ్లు తెప్పిస్తోంది.

## డే కేర్ సెంటర్‌లో దారుణం.. చిన్నారిని చిత్ర హింసలు పెట్టిన మహిళా సిబ్బంది..



**న్యూఢిల్లీ-నవభూమి:**ఓ డే కేర్ సెంటర్‌లో అత్యంత అమానవీయమైన సంఘటన ఒకటి చోటుచేసుకుంది. డే కేర్ సెంటర్‌లో పని చేసే మహిళా సిబ్బంది చిన్నారిపై ఘాతుకానికి ఒడిగట్టింది. చిన్నారిని చిత్రహింసలు పెట్టింది. కొట్టి, కొరికి గాయాలపాలు చేసింది. ఈ సంఘటన ఉత్తర ప్రదేశ్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. నోయిడా సెక్టార్ 137లోని పరస్ తీరియా రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లో ఓ డే కేర్ సెంటర్ ఉంది. ఈ డే కేర్ సెంటర్‌ను రెసిడెన్స్ అసోసియేషన్ స్వయంగా నిర్వహిస్తోంది.

ఢిల్లీ ఎన్సీఆర్ ప్రాంతంలోని రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లలో ఇలాంటి డే కేర్ సెంటర్లు చాలానే ఉన్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లల్ని డే కేర్ సెంటర్‌లలో వదిలి ఆఫీస్‌లకు వెళుతూ ఉంటారు. ఆఫీసు అయిపోయిన తర్వాత ఇళ్లకు తీసుకెళుతూ ఉంటారు. ఈ సంఘటన వెలుగులోకి రావటంతో ఒక్కసారిగా కలకలం చెలరేగింది. రెండు రోజుల క్రితం చిన్నారి శరీరంపై తల్లిదండ్రులు గాయాలు గుర్తించారు. అలర్జీ కారణంగా అలా అయిందేమో అని వారు అనుకున్నారు. డే కేర్ సెంటర్‌లోని టీచర్లు ఆ గాయాలపై అనుమానం వ్యక్తం చేశారు.దీంతో తల్లిదండ్రులు చిన్నారిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆ గాయాలను పరీక్షించిన వైద్యులు అవి పంటి గాట్లని తేల్చారు. తల్లిదండ్రులు షాక్ అయ్యారు. చిన్నారిని కొరికింది ఎవరో తెలుసుకోవడానికి డే కేర్ సెంటర్‌లోని సీసీటీవీ కెమెరాలను చెక్ చేశారు. దీంతో భయంకరమైన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సదరు మహిళా సిబ్బందిని అరెస్ట్ చేశారు.ఈ సంఘటనపై చిన్నారి తండ్రి సందీప్ మాట్లాడుతూ...' మేము మా చిన్నారిని కేవలం రెండు గంటలు మాత్రమే డే కేర్ సెంటర్లో ఉంచుతున్నాం. నెలకు 2,500 ఇస్తున్నాం. అక్కడ ముగ్గురు టీచర్లు ఉంటారని డే కేర్ సెంటర్ యజమాని చెప్పాడు. మా చిన్నారి మహిళా సిబ్బంది చేతిలో ఉంటుందని మాకు తెలియదు. యజమాని, మహిళా సిబ్బంది మీద కఠిన చర్యలు తీసుకోవాలి' అని డిమాండ్ చేశాడు.

## ఈ రాష్ట్రాలకు ఐఎండీ అలర్ట్.. ఆగస్టు 17 వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు



**న్యూఢిల్లీ-నవభూమి:**దేశవ్యాప్తంగా వాతావరణం మళ్లీ ఒక్కసారిగా మారిపోతోంది. ఈ క్రమంలోనే భారత వాతావరణ శాఖ దేశంలోని పలు రాష్ట్రాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ-ఉత్తరప్రదేశ్, బీహార్, ఝార్కండ్, హర్యానా, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణలో వచ్చే మూడు నుంచి ఏడు రోజుల వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కాబట్టి ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అనవసర యాత్రలు చేయొద్దని సూచిస్తున్నారు ఐఎండీ అధికారులు.ఢిల్లీ- ప్రాంతంలో వచ్చే మూడు రోజులు (ఆగస్టు 12-14) వర్షాలు కురుస్తాయని చెబుతోంది. ఇక్కడ ఎల్లో అలర్ట్ జారీ అయింది. గరిష్ట ఉష్ణోగ్రత 34-36మధ్య, కనిష్ట ఉష్ణోగ్రత 26-28ళీ%జ% మధ్య ఉంటుందట. ఆగస్టు 13, 14 తేదీల్లో వర్షం కారణంగా చల్లగా అనిపిస్తుంది. అదే సమయంలో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్, లక్నో, గోరఖ్‌పూర్, వారణాసి, మీరట్ వంటి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తూర్పు ఉత్తరప్రదేశ్‌కు ఆరెంజ్ అలర్ట్ జారీ అయింది. ఇక్కడ రోజువారి ఉష్ణోగ్రత 32-35రాత్రి 24-27 మధ్య ఉంటుంది.బీహార్‌లోని దక్షిణ జిల్లాలు గయా, పట్నా, నవాడా, భాగల్పూర్‌లలో ఆగస్టు 12 నుంచి 14 వరకు భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిక జారీ అయింది. నవాడాలో గంగా నది నీటిమట్టం ప్రమాదకర స్థాయిని దాటుతోంది. ఉత్తర బీహార్‌లో మోస్తరు వర్షాలతో పాటు 40-50 కి.మీ/గంట వేగంతో గాలులు, పిడుగులు పడే అవకాశం ఉందని ఎల్లో అలర్ట్ జారీ చేశారు. కాబట్టి, ఈ ప్రాంతాల్లో ఉన్నవాళ్లు జాగ్రత్తగా ఉండాలి.ఉత్తరాఖండ్‌లో ఆగస్టు 12న రెడ్ అలర్ట్ జారీ అయింది. ఉత్తర కాశీ, రుద్ర ప్రయాగ్, చమోలీ, బాగేశ్వర్, పిథోరాగఢ్, ఉధమ్ సింగ్ నగర్ జిల్లాల్లో 13 సెం.మీ. కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందట. ఆగస్టు 13, 14 తేదీలకు ఆరెంజ్ అలర్ట్ కొనసాగుతుంది. డెహ్రాడూన్, బాగేశ్వర్‌లలో భారీ వర్షాల కారణంగా పాఠశాలలు మూసివేశారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున, ఈ ప్రాంతంలో ఉన్నవాళ్లు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు.

హిమాచల్ ప్రదేశ్‌లోని బిలాస్‌పూర్, సోలన్, షిమ్లా, సిర్మౌర్, మండీ, చంబా, కాంగ్రా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ అయింది. ఆగస్టు 12న భారీ వర్షాలు, ఆ తర్వాత 13, 14 తేదీల్లో మోస్తరు వర్షాలతో పాటు 30-40 కి.మీ/గంట వేగంతో గాలులు వీస్తాయని అంచనా.

వారం రోజులు వర్షాలు!మన తెలంగాణలో కూడా ఆగస్టు 17 వరకు భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఆగస్టు 13 నుంచి 17 వరకు కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. కాబట్టి, లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు.

## హ్యాపీ టోల్‌గేట్

**హైదరాబాద్-నవభూమి:** టోల్‌చార్జీల మోతతో తల బొప్పి కట్టినవారికి గొప్ప ఊరట! ఉద్యోగ, వ్యాపారాల కోసం వరుస ప్రయాణాలు చేసే వారికి టోల్ భారం గణనీయంగా తగ్గనుంది. మునుపటి మాదిరిగా నెలకు టోల్‌చార్జీల రూపంలో వేలకు వేలు వదిలించుకోవాల్సిన పనిలేదు. ఈ మేరకు జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారుల కోసం కేంద్ర ప్రభుత్వం తీపికబురు తెచ్చింది. ఒకసారి రూ.3వేలు కడితే చాలు దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై ఉన్న టోల్‌గేట్ల మీదుగా గరిష్ఠంగా 200సార్లు ప్రయాణించే అవకాశం!! 'వార్షిక పాస్' అనే పేరుతో ఈ పథకాన్ని ఫాస్టాగ్ యూజర్ల కోసం ఈనెల 15 నుంచి అమల్లోకి తేనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదారులపై ఉన్న అన్ని టోల్‌గేట్లకు ఈ పథకం వర్తిస్తుంది. ఈ పాస్‌ను 'రాజ్‌మార్గ్‌యాత్ర' అనే మొబైల్ యాప్, లేదా జాతీయ రహదారుల అథారిటీ సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికార వెబ్‌సైట్ నుంచి పొందొచ్చు. దరఖా స్తు చేసుకునేవారి వాహనాల రిజిస్ట్రేషన్ వివరాలు 'వాహన్ డేటాబేస'లో అప్‌డేట్ అయి ఉండాలి. ఆ తర్వాత వాహనానికి అనుసంధానం చేసిన ఫాస్టాగ్ వివరాలు, రిజిస్ట్రేషన్ నంబర్ ఆధారంగా మొబైల్ యాప్ లేదా వైబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. డబ్బులు చెల్లించిన తర్వాత రెండు గంటల్లోగా వార్షిక పాస్ యాక్టివేట్ అవుతుంది. అయితే ఈ పాస్ ప్రైవేటు వాహనాలకే వర్తిస్తుంది. వాణిజ్య(క మర్షియల్) వాహనాలు, ట్యాక్సీలకు వర్తించదు.

## రైతులకు భారీ శుభవార్త.. కొన్ని గంటల్లో అకౌంట్లోకి డబ్బులు జమ.. చెక్ చేసుకోండి..



**న్యూఢిల్లీ-నవభూమి:**రైతులకు ఆర్థికంగా అండగా నిలవడానికి కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టింది. వాటిలో అత్యంత ముఖ్యమైనది ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన . ఈ పథకం ద్వారా ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతిన్నప్పుడు రైతులకు ఆర్థిక సహాయం అందిస్తారు. సోమవారం కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దేశవ్యాప్తంగా దాదాపు 30 లక్షల మంది రైతులకు సంబంధించిన రూ. 3,200 కోట్ల నిధులను విడుదల చేయనున్నారు. ఈ నిధులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయి.ఫసల్ బీమా యోజన ప్రత్యేకతలు..

ఈ పథకం 2016లో ప్రారంభమైంది. దీని ముఖ్య ఉద్దేశం.. వివిధ కారణాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడం. ఈ పథకం కింద నమోదైన రైతులు అతి తక్కువ ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. ఖరీఫ్ పంటలకు 2 శాతం, రబీ పంటలకు 1.5 శాతం, వాణిజ్య పంటలకు 5 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన ప్రీమియం మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా భరిస్తాయి. దీనివల్ల రైతులకు ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతుంది.ఈ పథకం వర్షం లేకపోవడం, వరదలు, తుఫానులు, కరువు, తెగుళ్లు వంటి సహజ విపత్తుల వల్ల జరిగే పంట నష్టాలకు వర్తిస్తుంది. పంట కోసిన తర్వాత పొలంలో ఆరబెట్టడానికి ఉంచినప్పుడు (14 రోజుల వరకు) జరిగే నష్టాలకు కూడా ఈ బీమా కవరేజ్ ఉంటుంది. ఈ పథకం కింద నష్టాన్ని అంచనా వేసి.. 15 రోజుల్లోపు క్లెయిమ్ మొత్తాన్ని రైతులకు చెల్లిస్తారు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కూడా ఈ పథకం ద్వారా రైతులు లబ్ధి పొందుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ పథకం అమలులో ఉంది. ఖరీఫ్ సీజన్‌లో పంటలకు బీమా చేయించుకోవడానికి ఆగస్టు 15 వరకు గడువు ఉంటుంది. రైతులు కేవలం రూ. 76 ప్రీమియం చెల్లిస్తే రూ. 38,000 వరకు బీమా వర్తిస్తుంది. దీనివల్ల రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులు తమ పంటలకు రక్షణ కల్పించుకుంటున్నారు. తెలంగాణ విషయానికి వస్తే.. గతంలో ఈ పథకం అమలులో ఉన్నప్పటికీ, కొంతకాలం ఆగిపోయింది. అయితే.. తాజాగా తెలంగాణ ప్రభుత్వం వచ్చే వానాకాలం సీజన్ నుంచి ఈ పథకాన్ని తిరిగి అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి అనుమతి కోరుతూ లేఖ కూడా పంపింది. ఈ నిర్ణయం వల్ల తెలంగాణలోని రైతులు కూడా ఈ పథకం ప్రయోజనాలను పొందగలరని నిపుణులు భావిస్తున్నారు.ఈసారి విడుదలయ్యే నిధులలో అత్యధికంగా మధ్యప్రదేశ్ (రూ.1,156 కోట్లు), రాజస్థాన్ (రూ.1,121 కోట్లు) రాష్ట్రాలకు దక్కుతుండగా, మిగిలిన రాష్ట్రాలకు రూ. 903 కోట్లు జమ కానున్నాయి. ఈ ఆర్థిక సహాయం రైతులకు కొత్త ఆశలు కల్పించి.. వారి వ్యవసాయ కార్యకలాపాలను కొనసాగించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

## విమానంలో మురికి సీటు..

### ఇండిగోకు భారీ జరిమానా విధించిన ఫోరం



**న్యూఢిల్లీ-నవభూమి:** విమానయానంలో నాణ్యత, పరిశుభ్రత చాలా ముఖ్యమైనవి. అయితే ఇండిగో ఎయిర్ లైన్స్ ఈ విషయంలో నిర్లక్ష్యం వహించినందుకు తీవ్ర పరిణామాలు ఎదుర్కొంది. ఢిల్లీ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార ఫోరం.. ఇండిగో ఎయిర్ లైన్స్‌కు భారీ జరిమానా విధించింది. ఒక ప్రయాణికురాలికి అపరిశుభ్రమైన, మరకలతో ఉన్న సీటు కేటాయించినందుకు గాను రూ.1.5 లక్షల పరిహారం చెల్లించాల్సిందిగా ఫోరం ఆదేశించింది. ఈ తీర్పు విమానయాన సంస్థలకు ఒక హెచ్చరికగా నిలిచింది. తమ సేవల్లో లోపాలు ఉన్నప్పుడు వినియోగదారులకు పరిహారం చెల్లించాల్సి ఉంటుందని ఇది స్పష్టం చేసింది.ఈ ఘటన రెండు సంవత్సరాల క్రితం చోటు చేసుకుంది. ఒక ప్రయాణికురాలు తన కుటుంబంతో కలిసి విమానంలో వెళుండగా.. ఆమెకు కేటాయించిన సీటు అపరిశుభ్రంగా, మరకలతో ఉండటాన్ని గుర్తించింది. దీనిపై వెంటనే విమాన సిబ్బందికి ఫిర్యాదు చేసింది. అయితే వారు ఆమె ఫిర్యాదును సరిగ్గా పట్టించుకోలేదు. దాంతో ఆమె ప్రయాణం మొత్తం అదే అసౌకర్యవంతమైన సీటులో గడపాల్సి వచ్చింది. ఈ అనుభవంతో నిరాశ చెందిన ప్రయాణికురాలు.. ఇండిగో ఎయిర్‌లైన్స్‌పై వినియోగదారుల ఫోరంను ఆశ్రయించింది.ఈ కేసును విచారించిన వినియోగదారుల ఫోరం, ఇండిగో ఎయిర్‌లైన్స్ సేవల్లో స్పష్టమైన లోపం ఉందని నిర్ధారించింది. ప్రయాణికులకు సురక్షితమైన, పరిశుభ్రమైన ప్రయాణాన్ని అందించడం విమానయాన సంస్థల బాధ్యత అని ఫోరం పేర్కొంది. ఇండిగో ఎయిర్ లైన్స్ ఈ బాధ్యతను నిర్వర్తించడంలో విఫలమైందని తీర్పు ఇచ్చింది. దీని ఫలితంగా ఫోరం ఇండిగో ఎయిర్ లైన్స్‌కు రూ.1.5 లక్షల జరిమానా విధించింది. ఈ మొత్తంలో రూ.1 లక్షను ప్రయాణికురాలికి పరిహారంగా.. మిగిలిన రూ.50 వేలను న్యాయ పోరాట ఖర్చులకు చెల్లించాల్సిందిగా ఆదేశించింది.

ఈ తీర్పు విమానయాన రంగంలో ఒక కీలకమైన పరిణామంగా నిలుస్తోంది. ఎయిర్ లైన్స్ కేవలం టికెట్లను విక్రయించడమే కాకుండా.. ప్రయాణీకులకు నాణ్యమైన, సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ఉందని ఈ తీర్పు మరోసారి గుర్తుచేసింది. ఈ తీర్పు ఇతర ప్రయాణీకులకు కూడా స్ఫూర్తినిస్తుంది. ఏదైనా సేవలో లోపం ఉన్నప్పుడు, దానిపై ఫిర్యాదు చేసి న్యాయం పొందవచ్చని ఇది సూచిస్తుంది.

## నరకం అంచుల వరకూ వెళ్లొచ్చాం, గుండె ఆగిపోయినంత పనైంది..:

### విమానం దారిమళ్లింపుపై ఎంపీ పోస్ట్



**న్యూఢిల్లీ-నవభూమి:**ఎయిర్ ఇండియా విమానంలో ప్రయాణించిన కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ సహా వందలాది మంది ప్రయాణికులు పెను ప్రమాదం నుండి తృటిలో తప్పించుకున్నారు. తిరువనంతపురం నుండి ఢిల్లీకి వెళ్తున్న ఈ విమానం సాంకేతిక లోపం, తీవ్ర ప్రకంపనల కారణంగా అత్యవసరంగా చెన్నైలో ల్యాండ్ అయింది. అయితే ఈ ప్రయాణంలో ఎదురైన భయానక అనుభవాన్ని కేసీ వేణుగోపాల్ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. పైలట్ అప్రమత్తత, అదృష్టం వల్ల తాము క్షేమంగా బయటపడ్డామని ఆయన పేర్కొన్నారు. నరకం అంచుల వరకూ వెళ్లొచ్చామని చెబుతూనే.. 2 గంటల పాటు గాల్లోనే విమానం చక్కర్లు కొట్టడంతో గుండె ఆగినంత పనైందన్నారు.మొదట ఆలస్యంగా బయలుదేరిన ఈ విమానం.. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఊహించని విధంగా తీవ్రమైన ప్రకంపనలకు గురైంది. దాదాపు గంటసేపు ఇదే పరిస్థితి కొనసాగడంతో ప్రయాణికులంతా తీవ్ర ఆందోళన చెందారు. ఆ తర్వాత విమానంలో ఒక సిగ్నల్ లోపం ఉందని పైలట్ ప్రకటించి.. అత్యవసరంగా విమానాన్ని చెన్నైకి మళ్లించారు. దాదాపు రెండు గంటల పాటు విమానం చెన్నై విమానాశ్రయం చుట్టూ గాల్లోనే చక్కర్లు కొట్టింది. ఆ తర్వాత ల్యాండ్ అయ్యేందుకు మొదటిసారి ప్రయత్నించినప్పుడు.. గుండె ఆగిపోయినంత పనైందని ఎంపీ కేసీ వేణుగోపాల్ తెలిపారు. ప్రమాదం అంచుల వరకూ వెళ్లొచ్చినట్లు తెలిపారు. ముఖ్యంగా ల్యాండింగ్ కోసం రన్‌వేపైకి విమానం దిగుతుండగా.. అదే సమయంలో మరో విమానం ఆ రన్‌వేపై ఉన్నట్లు గుర్తించారు.

ఆ ఒక్క క్షణంలోనే పైలట్ తీసుకున్న వేగవంతమైన నిర్ణయం వల్ల విమానాన్ని మళ్లీ పైకి తీసుకెళ్లడం సాధ్యమైందన్నారు. దాంతో వందలాది మంది ప్రయాణికుల ప్రాణాలు నిలిచాయని చెప్పుకొచ్చారు. రెండో ప్రయత్నంలో విమానం సురక్షితంగా ల్యాండ్ అయిందని కాంగ్రెస్ ఎంపీ స్పష్టం చేశారు. ఈ ఘటనపై తక్షణమే విచారణ జరిపి బాధ్యులను గుర్తించాలని డీజీసీఏ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్), కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖకు ఆయన విజ్ఞప్తి చేశారు.అయితే ఎయిర్ ఇండియా ఈ ఘటనపై వివరణ ఇచ్చింది. తమ విమానం సాంకేతిక లోపం, వాతావరణం సరిగా లేకపోవడం వల్లనే ముందు జాగ్రత్తగా చెన్నైకి దారి మళ్లిందని పేర్కొంది. రన్‌వేపై మరో విమానం ఉన్న కారణంగా గో-అరౌండ్ చేశామన్న వాదనను ఎయిర్ ఇండియా ఖండించింది. చెన్నై ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) సూచనల మేరకే పైలట్ గో-అరౌండ్ చేశారని స్పష్టం చేసింది. తమ పైలట్లు అత్యుత్తమ శిక్షణ పొందిన వారని, ప్రమాణాలకు అనుగుణంగా వ్యవహరించారని ఎయిర్‌లైన్స్ వివరించింది. ఏదేమైనా ఈ ఘటనలు ప్రయాణికులలో భద్రత పట్ల భయాందోళనలను పెంచుతున్నాయి.

## రతన్ టాటా ఉండి ఉంటే ఇంత ఆలస్యమయ్యేది కాదు..: యూఎస్ లాయర్



**న్యూఢిల్లీ-నవభూమి:** అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా ఏఐ-171 విమాన ప్రమాద బాధితులకు సాయం అందించడంలో జరుగుతున్న ఆలస్యంపై అమెరికాకు చెందిన ప్రముఖ లాయర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసులో 65 కుటుంబాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రముఖ న్యాయవాది మైక్ ఆండ్రూస్.. భారతీయ ప్రముఖ పారిశ్రామికవేత్త, టటా గ్రూప్ మాజీ ఛైర్మన్ రతన్ టాటా బతికి ఉండి ఉంటే ఇలాంటి జాప్యం జరిగేది కాదని వ్యాఖ్యానించారు. రతన్ టాటా మానవత్వం, ఉద్యోగుల పట్ల ఆయన చూపిన ప్రేమ, శ్రద్ధలను ఆండ్రూస్ ఈ సందర్భంగా ప్రశంసించారు. ఆయన ఉన్నప్పుడు ఇలాంటి అధికారిక అడ్డంకులు ఉండేవి కావని పేర్కొన్నారు.అధికార వర్గాల నుంచి ఈ ఆలస్యం జరుగుతోందని మైక్ ఆండ్రూస్ ఆరోపించారు. ప్రమాదంలో తన ఏకైక కుమారుడిని కోల్పోయి.. ఇప్పుడు మంచానికే పరిమితమైన ఒక వృద్ధురాలిని ఆయన ఉదాహరణగా ప్రస్తావించారు. ఆమెకు ఇప్పటికీ పరిహారం అందలేదని, దీని వల్ల ఆమె జీవితం మరింత కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల కుటుంబాలకు న్యాయం అందించడంలో జరుగుతున్న జాప్యం, వారి పట్ల ప్రభుత్వ, సంస్థల నిర్లక్ష్యాన్ని సూచిస్తుందని ఆయన విమర్శించారు.ఈ ప్రమాదంలో బాధితులకు న్యాయం కల్పించేందుకు ఉన్న చట్టపరమైన మార్గాలను కూడా ఆండ్రూస్ వివరించారు. విమానంలోని %ఫీూణజుజ% వ్యవస్థ వంటి సాంకేతిక లోపాల వల్లే ప్రమాదం జరిగిందని విచారణలో తేలితే.. అమెరికాలో తయారీదారుపై ప్రొడక్ట్ లయబిలిటీ క్లెయిమ్ దాఖలు చేయవచ్చని ఆయన తెలిపారు. ఒకవేళ ఈ ప్రమాదానికి ఎయిర్ ఇండియాయే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తే.. మాంట్రియల్ కన్వెన్షన్ నిబంధనల ప్రకారం పరిహారం క్లెయిమ్ చేయవచ్చని వివరించారు.ఎయిర్ ఇండియా ఇప్పటికే 147 మంది బాధితుల కుటుంబాలకు మధ్యంతర పరిహారం కింద రూ.25 లక్షలు విడుదల చేసిందని, అయితే టాటా గ్రూప్ ఏర్పాటు చేసిన 'ది ఏఐ-171 మెమోరియల్ అండ్ వెల్ఫేర్ ట్రస్ట్' ద్వారా ఒక్కో మరణానికి రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు హామీ ఇచ్చిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. లాయర్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా విపత్కర పరిస్థితుల్లో బాధితులకు సరైన సమయంలో న్యాయం, సహాయం అందించడంలో మంచిదని నెటిజన్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. చూడాలి మరి లాయర్ చేసిన ఈ వ్యాఖ్యలపై సదరు సంస్థ స్పందిస్తుందా.. మాటలు చెప్పకుండా వెంటనే సాయిం అందిస్తుందా అనేది.

## శిరోమని అకాలీ దళ్ కొత్త అధ్యక్షుడిగా జ్ఞాని హర్‌ప్రీత్ సింగ్ ఎన్నిక



**అమృత్‌సర్-నవభూమి :** శిరోమనీ అకాలీ దళ్ కొత్త అధ్యక్షుడిగా జ్ఞాని హర్‌ప్రీత్ సింగ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఆయన అకాల్ తక్త్ తాత్కాలిక జతేదార్‌గా ఉన్నారు. అయిదు గురు సభ్యుల అకాల్ తక్త్ కమిటీ ఏకగ్రీవంగా ఈ నిర్ణయంగా తీసుకున్నది. బీబీ సత్వంత్ కౌర్‌ను పంతక్ కౌన్సిల్ చైర్‌పర్సన్‌గా నియమించారు. శిరోమనీ అకాలీ దళ్ పార్టీలో రెబల్ వర్గానికి హర్‌ప్రీత్ సింగ్ అనుకూలంగా ఉన్నారు. తక్త్ నియమిత కమిటీ తీసుకున్న నిర్ణయాన్ని శిరోమనీ అకాలీదళ్ నేతలు తిరస్కరించారు. సుఖ్‌బీర్ నేతృత్వంలోని శిరోమని పార్టీకి ధీటుగా అకాల్ తక్త్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టింది. బుర్జ్ కాలీ బాబా పూలా సింగ్ బిల్డింగ్‌లో ఇవాళ అకాలీ నేతను ఎన్నుకున్నారు.

## కేంద్ర మంత్రి సురేష్ గోపి కనిపించడం లేదు..

### అసలేం జరుగుతోందంటే?



**తిరువనంతపురం-నవభూమి:** కేరళ రాజకీయాల్లో ప్రస్తుతం వింత వివాదం చోటుచేసుకుంది. త్రిస్సూర్ ఎంపీగా ఎన్నికైన కేంద్ర మంత్రి సురేష్ గోపి గత 2 నెలలుగా తమ నియోజకవర్గంలో కనిపించడం లేదంటూ కేరళ విద్యార్థి సంఘం (కేఎస్‌యూ) పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఒక్క ఫిర్యాదు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ప్రజాప్రతినిధిగా ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన వ్యక్తి అదృశ్యమవ్వడంపై కేఎస్?యూ ఆగ్రహం వ్యక్తం చేసింది.కేరళ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు గోకుల్ గురువాయూర్ త్రిస్సూర్ ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఈ మేరకు ఫిర్యాదు చేశారు. గత రెండు నెలలుగా సురేష్ గోపి తన నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేరని.. ఆయన ఎక్కడ ఉన్నారో తెలియడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. త్రిస్సూర్ మేయర్, రాష్ట్ర రెవెన్యూ మంత్రి వంటి కీలక అధికారులు కూడా సురేష్ గోపిని సంప్రదించడానికి చేసిన ప్రయత్నాలు విఫలం అయ్యాయని గురువాయూర్ తెలిపారు. ఈ పరిస్థితి నియోజకవర్గ ప్రజలకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోందని వెల్లడించారు. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్‌లో మలయాళీ సన్యాసినుల అరెస్ట్ కేసు తర్వాత... ఆ ఘటన అవాస్తవమని సురేష్ గోపి వ్యాఖ్యానించినప్పటి నుంచి ఆయన నియోజకవర్గంలో కనిపించడం లేదని కేఎస్‌యూ ఆరోపించింది. ప్రస్తుతం నియోజకవర్గంలో అనేక వివాదాలు, సమస్యలు ఉన్నప్పటికీ, వాటిపై సురేష్ గోపి ఏమాత్రం స్పందించడం లేదని.. ప్రతిపక్షాల డిమాండ్లను పట్టించుకోవడం లేదని విద్యార్థి సంఘం విమర్శించింది. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన పూర్తిగా విఫలం అయ్యారని కేఎస్‌యూ తీవ్రంగా ఖండించింది. అందుకే ఆయన అదృశ్యంపై పోలీసులు విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ.. తమ నిరసనలను మరింత ఉధృతం చేస్తామని కేఎస్‌యూ స్పష్టం చేసింది.

కేరళ నుంచి ఎన్నికైన ఏకైక, మొదటి బీజేపీ ఎంపీగా సురేష్ గోపి విజయం సాధించారు. అయితే ఆయనపై వచ్చిన ఈ ఆరోపణలు, నియోజకవర్గంలో ఆయన ఉనికిపై ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. ప్రజలకు అందుబాటులో లేకపోవడం అనేది ఒక ప్రజాప్రతినిధికి ఉండకూడని లక్షణం. ఈ వ్యవహారం రానున్న రోజుల్లో కేరళ రాజకీయాల్లో మరింత చర్చకు దారితీసే అవకాశం ఉంది.

## వీరయ్య చౌదరి హత్య కేసు..

### నిందితుడి ముందస్తు బెయిల్‌కు సుప్రీం తిరస్కరణ

**ఒంగోలు-నవభూమి:** టీడీపీ నేత వీరయ్య చౌదరి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు సురేశ్ బాబుకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ముందస్తు బెయిల్ కోసం ఆయన పెట్టుకున్న పిటిషన్ ను కోర్టు తోసిపుచ్చింది. సురేశ్ బాబు దాఖలు చేసిన పిటిషన్ ను జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ మన్మోహన్ ల ధర్మాసనం ఈ రోజు ఉదయం విచారించింది. వీరయ్య చౌదరి హత్య కేసులో ఇప్పటికే 9 మందిని అరెస్టు చేశామని, ప్రధాన నిందితుడు సురేశ్ బాబు పరారీలో ఉన్నాడని పోలీసులు వెల్లడించారు.ఈ కేసులో సురేశ్ బాబు ప్రమేయానికి సంబంధించి స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. డబ్బులు చేతులు మారడం, ఫోన్ కాల్స్ వంటి కీలకమైన ఆధారాలు ఉన్న నేపథ్యంలో ముందస్తు బెయిల్ కు సురేశ్ బాబుకు అర్హతలేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అయితే, ఈ కేసులో మిగతా నిందితులకు రెగ్యులర్ బెయిల్ మంజూరైన విషయాన్ని సురేశ్ బాబు తరపు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.

## నిప్పంటించుకుని మరో బాలిక మృతి.. ఒడిశాలో నాలుగో సంఘటన

**భువనేశ్వర్-నవభూమి:** నిప్పంటించుకుని మరో బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. తీవ్ర కాలిన గాయాలతో చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మరణించింది. బీజేపీ పాలిత ఒడిశాలో ఇది నాలుగో సంఘటన. బార్‌గఢ్ జిల్లాకు చెందిన 13 ఏళ్ల బాలిక ఎనిమిదో తరగతి చదువుతున్నది. సోమవారం ఉదయం తన మామ ఇంటికి ఆమె బయలుదేరింది. మార్గమధ్యలో ఫిరింగిమల్ గ్రామంలోని ఫుట్‌బాల్ మైదానంలో తీవ్రంగా కాలిన గాయాలతో అపస్మారక స్థితిలో కనిపించింది. గమనించిన స్థానికులు పోలీసులు, అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. చాలా ఆలస్యంగా రావడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.కాగా, తీవ్ర కాలిన గాయాలైన ఆ బాలికను బుర్లాలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మరణించింది. అయితే ఆ బాలిక ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని పోలీస్ అధికారి తెలిపారు. దీనికి కారణం ఇంకా తెలియలేదని, కుటుంబ సభ్యుల నుంచి వివరాలు తెలుసుకుంటామని చెప్పారు. ఎవరైనా నిప్పంటించారా అన్నది కూడా దర్యాప్తు చేస్తామని వెల్లడించారు.మరోవైపు ఒడిశాలో నెల రోజుల్లో నలుగురు విద్యార్థినులు నిప్పంటించుకుని చనిపోయారు.

## మతం మారాలని ప్రియురాలిపై ప్రియుడి ఒత్తిడి..యువతి ఆత్మహత్య

మంగళారం-నవభూమి: వాళ్లిద్దరూ ప్రేమించుకున్నారు. పెళ్లి కూడా చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే అతడు ముస్లిం, ఆమె క్రిస్టియన్. ఆమెను పెళ్లి చేసుకోవాలంటే ముందుగా ఆమె ముస్లిం మతంలోకి మారాలని అతడు షరతు విధించాడు. అయితే ఆ షరతుకు ఆమె ఒప్పుకోలేదు. దాంతో ఆమెను గదిలో బంధించి అతడు, అతడి కుటుంబం తీవ్రంగా కొట్టారు. అవమాన భారంతో ఆమె ఆత్మహత్య చేసుకుంది. కేరళలోని కొత్త మంగళారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది.
వివరాల్లోకి వెళ్తే.. కొత్త మంగళారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పరవూర్‌కు చెందిన రమీస్, 23 ఏళ్ల సోనా ఎల్డోస్ ఇద్దరూ ప్రేమించుకుంటున్నారు. సోనా టీచర్ ట్రెయినింగ్ కోర్సు చదువుతోంది. ఈ క్రమంలో ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. పెళ్లి చేసుకోవాలంటే ముందుగా ఆమె ముస్లిం మతంలోకి మారాలని షరతు విధించారు. ఆమె అందుకు ఒప్పుకోకపోవడంతో ఒత్తిడి చేశారు.
అయినా మతం మారేందుకు ఆమె ససేమిరా అనడంతో ఓ గదిలో బంధించి రమీస్, అతడి కుటుంబం, బంధువులు తీవ్రంగా కొట్టారు. ఆ తర్వాత రమీస్.. ఎక్కడైనా చావుపో అని తిట్టి పంపించాడు. దాంతో ఆమె తన ఇంటికి చేరుకుని, తాను చచ్చిపోతున్నానని అతడికి మెసేజ్ పెట్టింది. దాంతో సరే మంచిది కానియ్ అని అతడు రిప్లై ఇచ్చాడు. ఆ తర్వాత ఆమె ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి గదిలో లభ్యమైన సూసైడ్ లెటర్‌లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు వారి వాట్సాప్ చాట్‌ను పరిశీలించగా.. ఆమె చనిపోతున్నానని మెసేజ్ చేయడం, అతడు ఓకే కానియ్ అని రిప్లై ఇవ్వడం కనిపించాయి. దాంతో మృతురాలి కుటుంబం ఫిర్యాదు మేరకు ఆత్మహత్యకు పురికొల్పిన నేరం కింది రమీస్‌ను అరెస్ట్ చేశారు. లభ్యమయ్యే సాక్ష్యాధారాల ఆధారంగా ఇతర నిందితులను కూడా అదుపులోకి తీసుకోనున్నట్లు చెప్పారు.

## తెలుగు జాతి వెలుగురేఖ పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు

తెలుగు జాతి చరిత్రలో వెలుగుల రేఖలుగా నిలిచే మహామేధావులు కొద్దిమందే. అందులో పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు గారు అగ్రశ్రేణిలో నిలిచారు. ఒక మనిషి కలం ఏకకాలంలో పత్రికా లోకానికీ, సాహిత్యానికీ, రాజకీయాలకు, సినిమా రంగానికీ, సాంస్కృతిక ఉద్యమాలకు, మానవతా స్ఫూర్తికి అంకితమైతే, అది కాలాన్ని మించే మహత్తరమైన సాక్ష్యం అవుతుంది. తుర్లపాటి గారి జీవితం అలాంటి సాక్ష్యం. ఆయన పేరు వినగానే మనసులో మొదట మోగేది మానవత్వపు ఘంటిక. "అందరినీ ప్రేమించు, అందరినీ పలకరించు, మరల ఈ దారిన వస్తానో రానో తెలియదు" అనే జీవన సందేశం ఆయన హృదయపు లోతుల్లోంచి పుట్టి, ప్రతీ మాటలో, ప్రతీ పనిలో ప్రతిఫలించింది. జాతి, మత, కుల, వర్ణ, వర్గ, స్త్రీ, పురుష విభేదాలకు అతీతంగా, మానవుడు మానవునిపట్ల మానవుడిగానే వ్యవహరించే వ్యవస్థ ఆయన కల. ఈ కలను మాత్రమే కాదు, ఆ దిశగా ప్రయాణాన్ని తన కలం, గళం ద్వారా సాగించిన మహామానవుడు తుర్లపాటి. 1933 ఆగస్టు 10న విజయవాడలో సుందర రామారావు, శేషమాంబ దంపతులకు జన్మించిన ఈ బాలుడు బాల్యం నుంచే చదువు పట్ల, రచన పట్ల, ప్రజా జీవనంపై చర్చల పట్ల మక్కువ కనబరిచాడు. గన్నవరం, విజయవాడలలో విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆయన, నార్ల వేంకటేశ్వరరావు గారిని గురువుగా భావించి ఏకలవ్య శిష్యుడిలా నేర్చుకున్నాడు. కేవలం 14 ఏళ్ల వయసులోనే రచనా వ్యాసంగంలో అడుగుపెట్టి, పాత్రికేయ రంగంలో తన కాంతిని విరజిమ్మడం మొదలుపెట్టాడు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులువారి కార్యదర్శిగా పనిచేయడం ఆయన వ్యక్తిత్వానికి తొలి బలమైన ముద్ర వేసింది. ఆ పరిచయం ఆయనలోని ప్రజాస్వామ్య దృక్పథాన్ని, రాజకీయ అవగాహనను మరింతగా పెంచింది. తుర్లపాటి గారు ఏ రాజకీయ పార్టీకి చెందకుండా, అజాతశత్రువుగా, 20 మంది ముఖ్యమంత్రులతో, అనేక ప్రధాన మంత్రులతో, రాష్ట్రపతులతో సమానమైన సన్నిహిత సంబంధాలను కొనసాగించారు. జవహర్‌లాల్ నెహ్రూ నుంచి సోనియా గాంధీ వరకు నాలుగు తరాలుగా గాంధీ కుటుంబంతో అనుబంధం కొనసాగించడం ఒక చారిత్రక ఘట్టం. బిల్ క్లింటన్‌ను భారతదేశానికి ఆహ్వానించిన ఉత్తరం, మహాత్మా గాంధీ ఆటోగ్రాఫ్ సంపాదించిన తుంటరి తుర్లపాటి, ఆంధ్ర రాష్ట్ర అవతరణలో అమరజీవుల త్యాగాలను రికార్డు చేసిన కలయివన్నీ ఆయన జీవితంలో ఒకో అద్భుతమైన పుట. ఇంగ్లీష్‌లో ప్రధాన నాయకుల ప్రసంగాలను తక్షణం తెలుగులోకి అనువదించి, ఆ గళానికి ఒక ప్రత్యేకమైన శక్తి నింపిన తుర్లపాటి గారు, "ఉపన్యాస కేసరి"గా పేరుపొందారు. స్వాతంత్ర్యానికి ముందు నుంచీ స్వర్ణోత్సవ కాలం దాకా 20 వేల ఉపన్యాసాలు ఇచ్చిన ఘనత ఆయనదే. "వార్తల్లోని వ్యక్తి" అనే శీర్షికలో దాదాపు 50 సంవత్సరాలు నిరంతరంగా రచనలు చేసి, 6,000 మంది జీవితచరిత్రలను రాసి వికీపీడియాను మించే స్థాయిలో ఖచ్చితమైన సమాచారాన్ని అందించారు. ఈ రంగంలో ఆయనను "ఆటో బయోగ్రఫీస్ స్పెషలిస్ట్"గా గుర్తించారు. పాత్రికేయుడిగా ఆయన నిజాయితీ, నిబద్ధత, మంచితనం, మానవత్వం మాత్రమే మూలధనంగా పెట్టుకుని, చివరి వరకూ సొంత ఇల్లు కూడా లేకుండా జీవించడం ఆయనలోని మహత్తు. సినిమా రంగంలో కూడా తుర్లపాటి గారి పాత్ర విశేషమైనది. ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఫ్యాన్స్ అసోసియేషన్‌ను స్థాపించి నటీనటులకు అవార్డులు ఇచ్చి ప్రోత్సహించడం, రాష్ట్ర ప్రభుత్వం నంది అవార్డులు ప్రవేశపెట్టడానికి ప్రేరణ కావడం, అక్కినేని నాగేశ్వరరావుకు "నటసామ్రాట్", హీరో కృష్ణకు "సూపర్ స్టార్" బిరుదులు ఇవ్వడయ%ఖశ్రీశ్రీ తీవటశ్రీవష్ ష్ట్రఅం అఅటశ్రీబవఅఎవ అఅ ఎబశ్రీబతీఖశ్రీ శ్రీఅటవ%. నేషనల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ మెంబర్‌గా, నంది అవార్డ్స్ కమిటీ సభ్యుడిగా, జ్యోతిచిత్ర ఎడిటర్‌గా, నేషనల్ ఫిల్మ్ అడ్వైజర్‌గా పనిచేయడం ద్వారా తెలుగు చలనచిత్ర పరిశ్రమలో విశేష స్థానం సంపాదించారు. తన బహుముఖ ప్రతిభకు ఆయనకు లభించిన బిరుదులు, అవార్డులు అనేకం"ఉపన్యాస కేసరి", "దశ సహస్ర సభా కేసరి", ఆంధ్రా యూనివర్సిటీ కళా ప్రపూర్ణ, పీవీ నరసింహారావు చేతుల మీదుగా అందుకున్న నేషనల్ సిటిజన్స్ అవార్డ్, ముట్నూరి కృష్ణారావు ఉత్తమ జర్నలిస్ట్ అవార్డ్, అమెరికన్ బయోగ్రాఫికల్ ఇన్‌స్టిట్యూట్ ఇంటర్నేషనల్ మాన్ ఆఫ్ ద ఇయర్ అవార్డు, మరియు 2002లో అప్పటి రాష్ట్రపతి కె.ఆర్. నారాయణన్ చేతుల మీదుగా అందుకున్న పద్మశ్రీఇవి అన్నీ ఆయన శ్రమ, ప్రతిభ, సేవలకు గౌరవ సూచకాలు. తుర్లపాటి గారు కేవలం వ్యక్తిగత విజయాలకే పరిమితం కాలేదు. ఆయన కలం ఒక సామాజిక బాధ్యతగా మారింది. ఆయన రాసిన ప్రతి జీవన చరిత్రలో ఒక పాఠం ఉంటుంది. ఆ పాఠం మానవ విలువల పునరుద్ధరణ. ఆయన గళం తెలుగు భాష ఉన్నంతవరకు ప్రతిధ్వనిస్తుంది. ఆయన జననం చారిత్రక సత్యం, కానీ మరణం ఒక భ్రమ మాత్రమేఎందుకంటే ఆయన ఆలోచనలు, రచనలు, స్ఫూర్తి తరతరాలకు సజీవంగా ఉంటాయి. తుర్లపాటి కుటుంబరావు గారి జీవితం భవితరాలకు ఒక దీపస్తంభం. ఆయన జయంతి సందర్భంగా, ఆయన జీవిత చరిత్రను పునర్ముద్రించి, ఆయన పేరుతో ఉత్తమ జర్నలిస్టు అవార్డులు ఇవ్వడం ప్రభుత్వపు నైతిక బాధ్యత. ఎందుకంటే, ఇలాంటి వ్యక్తులు ఒక సమాజానికి కేవలం గర్వకారణం మాత్రమే కాదు, ఆ సమాజానికి ఒక దిక్సూచి.

## ఉద్యోగ జీవితంలో బర్నౌట్: కారణాలు,పరిష్కారాలు





ఉద్యోగంలో ఎక్కువ ఒత్తిడి, అధిక పని గంటలు, ఎక్కువ బాధ్యతలు, లక్ష్యాలను చేరాలన్న ఒత్తిడి, వ్యక్తిగత జీవితానికి సమయం లేకపోవడం వంటివి మనసు, శరీరం, భావోద్వేగాల శక్తిని తగ్గిస్తాయి. పనిపట్ల ఆసక్తి పోవడం, ఉత్సాహం తగ్గిపోవడం వంటి పరిస్థితిని మానసిక శాస్త్రంలో బర్నౌట్ అంటారు. ఈ పదాన్ని 1974లో అమెరికన్ మానసిక శాస్త్రవేత్త హర్బర్ట్ ఫ్రాయిడెన్‌బర్గర్ మొదటగా వాడారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2019లో దీన్ని ఉద్యోగ సంబంధిత దీర్ఘకాలిక ఒత్తిడి వల్ల కలిగే మానసిక అలసటగా గుర్తించి, వృత్తిపరమైన సమస్యగా వర్గీకరించింది.
తాజా నివేదికల ప్రకారం భారతదేశంలో ఈ సమస్య వేగంగా పెరుగుతోంది. 2024లో సీఐఐ-మెడిబడ్డి నివేదిక ప్రకారం, 62% ఉద్యోగులు బర్నౌట్ లక్షణాలు అనుభవిస్తున్నారు. ఇది ప్రపంచ సగటు 20% కంటే మూడు రెట్లు ఎక్కువ.
ఎఫ్ఐసీసీఐ-బీసీజీ నివేదిక ప్రకారం, 58% ఉద్యోగులు బర్నౌట్, పనిస్థల అలసటను చెబుతున్నారు. ముఖ్యంగా ఐటీ రంగం, వైద్యులు, నర్సులు, ఉపాధ్యాయులు, విలేకరులు, కాల్ సెంటర్ ఉద్యోగుల్లో ఇది ఎక్కువగా కనిపిస్తోంది. గాలప్ నివేదిక ప్రకారం, 40% మంది తరచూ బర్నౌట్ అనుభవిస్తున్నారు, 86% మంది మానసిక ఆరోగ్యంలో ఇబ్బందుల్లో ఉన్నారు.
బర్నౌట్‌తో బాధపడుతున్నవారిలో నిద్రలేమి 50 నుండి 60 శాతం, ఆందోళన 40 నుండి 50 శాతం, నిరుత్సాహం 30 నుండి 40 శాతం వరకూ నమోదవుతున్నాయని మెకిన్సీ హెల్త్ ఇన్‌స్టిట్యూట్ పేర్కొంది. అదనంగా, పనితీరు తగ్గిపోవడం, ఉద్యోగ సంతృప్తి కోల్పోవడం, అధిక రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత సమస్యలు పెరిగే ప్రమాదం కూడా ఉంటుందని తెలిపింది.
ఉద్యోగులు మానసికంగా అలసిపోవడానికి ప్రధాన కారణాలుఅధిక పని గంటలు, తగిన విశ్రాంతి లేకపోవడం, పరిమిత వేతనాలు, కఠినమైన లక్ష్యాలు, గుర్తింపు లోపం, నిర్వాహకుల సహకారం తక్కువగా ఉండటం, పని-వ్యక్తిగత జీవిత సమతుల్యత కోల్పోవడం. ఐటీ రంగంలో నిరంతరం జరిగే ఆన్‌లైన్ మీటింగులు, కఠిన గడువులు, సాంకేతిక ఒత్తిడి కూడా ఈ పరిస్థితిని మరింతగా పెంచుతున్నాయి.
బర్నౌట్‌ను తగ్గించడానికి పని, విశ్రాంతి మధ్య సమతుల్యం తప్పనిసరి.
భారతీయులలో 64 శాతం మంది పని భారం తగ్గించుకునేందుకు వేతనం తగ్గించుకోవడానికి సిద్ధంగా ఉన్నారని యూకేజీ నివేదిక వెల్లడించింది. రోజుకు 7%-%8 గంటల నిద్ర, నియమిత వ్యాయామం, యోగా, మైండ్‌ఫుల్‌నెస్ వంటి అలవాట్లు మానసిక ఆరోగ్యానికి అనుకూలం. కౌన్సెలింగ్, థెరపీ వంటి సేవలు కూడా సహాయపడతాయి. సంస్థలు సడలించిన పని సమయాలు, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే కార్యక్రమాలు, చేసిన పనికి తగిన గుర్తింపు ఇచ్చే విధానాలను అమలు చేయాలి.
మనసు అలసిపోతే శరీరం కదలదు, శరీరం క్షీణిస్తే కలలు కదలవు. బర్నౌట్ కేవలం అలసట కాదుఇది మన ఆరోగ్యం, ఉత్సాహం, కలలను దోచే నిశ్శబ్ద శత్రువు. దీన్ని జయించాలి అంటే, పనిలో సమతౌల్యం, మనసులో బలం, జీవితంలో ఆనందం పెంచుకోవాలి.

మహమ్మద్ అక్బర్
జర్నలిస్ట్, నవభూమి ప్రతినిధి
మహబూబాబాద్

## బహుముఖ ప్రజ్ఞాశాలి పిజె సుధాకర్






ప్రముఖ విద్యావేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, విద్యారంగంలో అత్యధిక డిగ్రీలు సాధించి సరికొత్త చరిత్రని సృష్టించిన పట్నాల జాన్ ( పి.జె ) సుధాకర్ ఈ నెల 6 నాడు అనారోగ్యంతో 68 ఏళ్ల వయసులో మరణించడం కడు విషాదకరం. ఆయన సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సి.బి.ఐ), ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పి.ఐ.బి), ఆల్ ఇండియా రేడియో, దూరదర్శన్, పబ్లికేషన్స్ డివిజన్ మరియు రక్షణ మంత్రిత్వ శాఖ వంటి అనేక సంస్థలలో నిరుపమాన సేవలు అందించారు. ఆయన అనేక భారతీయ విశ్వవిద్యాలయాలలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఆయన చదువుపై ఉన్న మక్కువతో 120 డిగ్రీలను సాధించి సరికొత్త చరిత్రని సృష్టించడం అనన్యసామాన్యం.
పి.జె. సుధాకర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలంలో గల పెదగాడి గ్రామంలోని నిరుపేద దళిత వ్యవసాయ కూలీలైన మోషేసు, కాంతమ్మ అనే దంపతులకు 1957 డిసెంబర్ 1 నాడు జన్మించారు. నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన ఆయన అనునిత్యం అనేక కష్టాలని అధిగమించారు. పి.జె. సుధాకర్ ఉన్నత పాఠశాల తర్వాత తీవ్ర పేదరికం కారణంగా తన చదువుకి మధ్యలోనే మంగళం పలికారు. ఆ క్రమంలోనే ఆయన తన బతుకు సమరాన్ని సాగించే నిమిత్తం విశాఖపట్నం జిల్లాలోని రేడగడి అనే మారుమూల గ్రామంలో గల ఒక హోటల్‌లో వెయిటర్ గాను, పొలాల్లో పశువుల కాపరి గాను మరియు వ్యవసాయ కూలీ గాను పని చేశారు. 20 సంవత్సరాల వయస్సులో ఆయన సి.బి.ఐ (సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్) లో జూనియర్ అసిస్టెంట్‌గా చేరాడు. అప్పటి నుండి ఆయన కరస్పాండెన్స్ కోర్సులు మరియు ఓపెన్ విశ్వవిద్యాలయాల ద్వారా సంవత్సరానికిపది డిగ్రీలు పొందాడు. 1980లో ఆయన న్యాయ శాస్త్రంలో మొదటి డిగ్రీని పొందాడు. మొదటగా సి.బి.ఐ లో చిరు ఉద్యోగంలో చేరిన డాక్టర్ పి.జె. సుధాకర్ 1987 లో దేశంలోనే ప్రతిష్టాత్మకమైన సివిల్ సర్వీసెస్‌కు ఎంపికై ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఐ.ఐ.ఎస్) కోసం ఎంపికయ్యారు.
డాక్టర్ పి.జె. సుధాకర్ 2009 లో రాజా రామ్ మోహన్ రాయ్ మిషన్ నేషనల్ అవార్డును అందుకున్నాడు. ఆయన 2010 లో హైదరాబాద్‌లోని చైతన్య ఆర్ట్ థియేటర్స్ నుండి లైఫ్ టర్మ్ అచీవ్‌మెంట్ అవార్డును స్వీకరించారు. రావూరి భరద్వాజ గారికి జ్ఞానపీఠ్ పురస్కారం రావడానికి డాక్టర్ పి.జె. సుధాకర్ అనేక విధాలుగా కృషి చేసి విజయం సాధించారు. భారత రాష్ట్రపతి పదవికి పోటీ చేసే నిమిత్తం ఆయన 2012 జూలై 29 నాడు నామినేషన్ పత్రాలను సమర్పించి అత్యధిక విద్యార్థతా పత్రాలు ఉన్న వ్యక్తిగా ఆయన కొనియాడబడ్డారు.
డాక్టర్ పి.జె. సుధాకర్ ఒకపక్క ఉన్నతస్థాయిలో ఉద్యోగాలు సాధించి సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తూనే మరోపక్క సమాంతరంగా 120 డిగ్రీలను సాధించడం తద్వారా విద్యావ్యవస్థలో నవచరిత్రని సృష్టించారు అని సగర్వంగా చెప్పవచ్చు. ప్రజా సంబంధాలు, సామాజిక సేవ, నేర శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, చట్టం, రాజకీయ శాస్త్రం, చరిత్ర, అంతర్జాతీయ సంబంధాలు, మానవ హక్కుల చట్టం మరియు వైద్య చట్టాలు వంటి అంశాలతో పాటు అనేక ఇతర రంగాలలో 120 డిగ్రీలను సాధించి ప్రపంచంలోనే సరికొత్త చరిత్రని సృష్టించారు. ఒక్క ఇంజనీరింగ్ మినహా దాదాపు మిగిలిన అన్ని విద్యా రంగాలలోను ఆయన డిగ్రీలు సాధించడం గమనార్హం. ఆయన 2014 ఆగస్టు 31 నాడు బెంగళూరులోని నేషనల్ స్కూల్ ఆఫ్ లా నుండి 104 వ డిగ్రీ స్నాతకోత్సవ వేళ సాక్ష్యాత్తు నాటి భారత ప్రధాన న్యాయమూర్తి నుండి పొందడం ఆయన జీవితంలో మరచిపోలేని ఘట్టంగా చెప్పవచ్చు. అనేకంగా రికార్డులు సాధించిన ఆయన అవివాహితుడుగానే ఉండిపోయారు.
గొప్ప సామాజిక సంస్కర్తలు అయిన రాజా రామ్మోహన్ రాయ్ మదర్ థెరిసాలచే ప్రేరణ పొందిన డాక్టర్ పి.జె. సుధాకర్ సామాజిక దురాచారాల నిర్మూలన కోసం కృషిచేశారు. పిల్లలు, మహిళలు, సమాజంలోని బలహీన వర్గాలైన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు మరియు మైనారిటీల సంక్షేమం కోసం ఆయన నిరవధికంగా కృషిచేశారు. గ్రామీణ అక్షరాస్యత కోసం తీవ్రంగా కృషి చేశారు. యువత భవిత కోసం ప్రేరణాత్మక ఉపన్యాసాలు ఇచ్చారు. ఆ రకంగా ఆయన సమాజంలోని వివిధ వర్గాల నుండి లక్షలాది మంది యువతను సామాజిక మార్పు కోసం కృషి చేశారు.
వంద మంది మనస్తత్వవేత్తల బృందంగా కార్యకలాపాలు నిర్వహించే జాతీయ మానసిక ఆరోగ్య ఉద్యమ వ్యవస్థాపక అధ్యక్షుడు గాను డాక్టర్ పి.జె. సుధాకర్ కృషిచేసి సమాజంలో నైతిక విలువలు మరియు నైతిక ప్రమాణాలను ప్రోత్సహించారు. ఆయా సామాజిక సమస్యలపై వర్క్‌షాప్‌లను ఆయన నిర్వహించారు. మానవ హక్కులను పరిరక్షిస్తూనే గొంతులేని వారి గొంతుకగా తన చివరి క్షణం వరకు ఆయన కృషి చేశారు. బాల కార్మికుడి నుండి ఒదిగి ఎదిగి ఉన్నత ఉద్యోగాలతో పాటు అత్యధిక డిగ్రీలను సాధించి గిన్నిస్ రికార్డుని సాధించి అనేక రంగాలలో తనదైన ముద్ర వేసి బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరు గడించిన డాక్టర్ పి.జె. సుధాకర్ జీవితం భావితరాలకు తప్పకుండా ఆదర్శం కాగలదు అని ఘంటాపథంగా చెప్పవచ్చు.


- జె.జె.సి.పి. బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690

## కథ చదువు విలువ




వెలుగుల ముంగిట నిలబడే చీకటి ఎంతకాలం నిలుస్తుంది? జ్ఞానం అనే దీపం వెలిగితే అజ్ఞానం అనే చీకటి క్షణాల్లో చెదిరిపోతుంది. ఇదే సత్యాన్ని తన జీవితంతో నిరూపించినవాడు రాములు. రాములు పుట్టింది ఒక చిన్న పల్లెలో. పల్లె పేరు వెలగపూడి. చుట్టూ పచ్చని పొలాలు, మట్టి రోడ్లు, తాటి చెట్ల కింద ఆడుకుంటున్న పిల్లలు. కానీ ఆ పల్లెలో ఒక లోపం చదువుకి విలువ ఇవ్వని వాతావరణం. పెద్దలు "పుస్తకాలు చదివి కడుపు నిండదురా" అంటారు. రాముల తండ్రి కూలి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పొలంలో పని చేసి వచ్చిన జీతంతో కడుపులు నింపుతాడు. రాములు చిన్నప్పటినుంచే తెలుసుకోవాలనే తపనతో ఉండేవాడు. పాఠశాలకి వెళ్ళాలనే కోరిక బలంగా ఉండేది. కానీ పల్లె స్కూల్ మాస్టారు పట్టించుకోడు. పిల్లలందరూ గజిబిజిగా కూర్చుని పాఠం విన్నా వినకపోయినా ఒకటే. రాములు మాత్రం మాస్టారు పలికే ప్రతి పదాన్ని ఆసక్తిగా వింటాడు. ఇంటికి వచ్చి మట్టిమీద కర్రతో అక్షరాలు రాస్తూ రాస్తూ రాత్రి అవుతుంది. ఒకరోజు పల్లెకి సత్యం అనే యువకుడు వచ్చాడు. పట్టణంలో చదువు పూర్తి చేసి, పల్లెలో చిన్న లైబ్రరీ మొదలుపెట్టాడు. పాతపుస్తకాలు, పత్రికలు, మ్యాగజైన్లు రాములు ఆ లైబ్రరీకి వెళ్ళి పుస్తకాలను తాకి చూసి మైమరచిపోయాడు. మొదట అక్షరాలు బాగా చదవలేక తడబడినా, సత్యం అణుకువగా అక్షరాలు, పదాలు నేర్పాడు. ఆ తర్వాత రాముల జీవితం మారిపోయింది. పుస్తకాల్లోని కథలు అతనికి కొత్త ప్రపంచం చూపించాయి. "మంచి జీవితం సంపాదించాలంటే చదువు తప్పనిసరి" అని అతని మనసులో బలంగా నాటుకుపోయింది. అయితే చదువు సాగించడానికి అడ్డంకులు తక్కువగా లేవు. తండ్రి, "పని చెయ్యి, ఇల్లుకి ఆదుకోవాలి" అని అంటాడు. రాములు పగలు పొలంలో పని చేసి, రాత్రి లైబ్రరీలో చదివే వాడు. అలసట, ఆకలి అతన్ని ఆపలేదు. ఒకసారి పల్లె మేళా సమయంలో పట్టణం నుంచి ఒక పాఠశాల అధికారి వచ్చాడు. రాములు ఇచ్చిన సమాధానాలు విని ఆశ్చర్యపోయాడు. "నువ్వు పట్టణం వెళ్ళి చదువుకుంటే చాలా దూరం వెళ్తావు" అన్నాడు. ఇది రాముల గుండెల్లో మిణుగురులా వెలిగింది. తరువాతి సంవత్సరం రాములు పాఠశాల పరీక్షల్లో మొదటి స్థానం సాధించాడు. ప్రభుత్వం ఇచ్చిన స్కాలర్‌షిప్‌తో పట్టణంలోని హైస్కూల్లో చదువు మొదలుపెట్టాడు. మొదట్లో నగర వాతావరణం కొత్తగా అనిపించింది. కానీ క్రమంగా అలవాటు చేసుకున్నాడు. అక్కడి మంచి మాస్టార్లు, లైబ్రరీలు, సైన్స్ ల్యాబ్ ములు కేవలం పాఠ్యపుస్తకాలు మాత్రమే కాదు, ప్రపంచ చరిత్ర, శాస్త్రం, సాహిత్యం అన్నింటినీ చదివాడు. చదువు వల్ల వచ్చిన ఆత్మవిశ్వాసం అతన్ని మరింత ధైర్యవంతుడిని చేసింది. కాలం గడిచింది. రాములు ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. మంచి ఉద్యోగం సంపాదించాడు. కానీ తన మూలాలను మరువలేదు. పల్లెకి తిరిగి వచ్చి అక్కడి పిల్లలకు లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేశాడు. ఒకరోజు అదే పల్లెలో ఓ చిన్నవాడు అతన్ని అడిగాడు"అన్నా, చదువు వల్ల ఏం లాభం?" రాములు చిరునవ్వుతో అన్నాడు. "చదువు అనేది కడుపు నింపడానికి మాత్రమే కాదు. అది మనసుని వెలిగించడానికి. చదువుతో మనకు కొత్త దారులు కనిపిస్తాయి, మన కళ్ళు తెరుస్తాయి. ఇది కష్టాలను దాటించేది, మనసుకు స్వేచ్ఛనిచ్చేది."అతను చెప్పిన మాటలు ఆ బాలుడి హృదయంలో దీపంలా వెలిగాయి. రాములు చూపించిన మార్గం అనేక పిల్లలకు దిక్సూచిగా మారింది. చీకటి పల్లెలో వెలుగులు రప్పించేది చదువు అని, ఒకరికి వచ్చిన వెలుగు మరొకరికి పంచితేనే సమాజం మారుతుందని ఆయన నిరూపించాడు. చదువు విలువ కేవలం మార్కులు కాదు.

## భక్తి: సత్య ధర్మ స్వరూపుడు శ్రీరాఘవేంద్రుడు



మన దేశంలో సజ్జనులను ఉద్ధరించడానికి అనేకమంది మహనీయులు అవతరించారు. వారిని గురువులుగా... పూజ్యభావంతో మనం ఆరాధిస్తాం. అటువంటి గురువులలో శ్రేష్టుడు మంత్రాలయ ప్రభువైన శ్రీ రాఘవేంద్రస్వామి. స్వార్థ చింతన లేకుండా, సజ్జనులను సరైన మార్గంలో నడిపించడానికి, భగవంతుడిపై భక్తి భావాన్ని పెంపొందించడానికి భగవంతుడు పంపించిన దూత ఆయన. నేటి నుంచి ఈ నెల 12వతేదీ వరకూ 'శ్రీరాఘవేంద్రస్వాముల సప్తరాత్రోత్సవాలు' (ఆరాధనోత్సవాలు) మంత్రాలయంలో జరుగుతాయి. శ్రీరాఘవేంద్రస్వామివారి ఇంటి దైవం లక్ష్మీ వేంకటేశ్వరుడు. సంస్థాన పూజ చేసేది శ్రీరాముడికి. అయినప్పటికీ ఆయనకు శ్రీకృష్ణుడు అంటే అమితమైన ప్రీతి, భక్తి. ఒకసారి సంచారంలో భాగంగా ఆయన ఉడుపికి వెళ్ళారు. అక్కడ శ్రీమధ్వాచార్యులు స్థాపించిన శ్రీకృష్ణ విగ్రహం ముగ్ధ మోహన రూపాన్ని చూసి సంతోష పరవశులయ్యారు. ఉడుపిలోనే కొన్ని రోజులు ఉన్నారు. శ్రీకృష్ణుడి సన్నిధిలో (బ్రహ్మ సూత్రాలకు వ్యాఖ్యానంగా) 'తంత్రదీపిక', 'న్యాయముక్తావళి' అనే గ్రంథాలను రాశారు. 'చంద్రికా ప్రకాశ' అనే అద్భుతమైన టిప్పణి వ్రాశారు. అంతేకాదు.. ద్వైత సిద్ధాంత వ్మాయంలో మేరు కృతి అనిపించుకున్న, శ్రీ మధ్వాచార్యుల వ్యాఖ్యానానికి టీకగా శ్రీజయతీర్థులు రచించిన 'శ్రీమన్యాయసుధ'కు 'పరిమళ' అనే టిప్పణిని రచించి, శ్రీకృష్ణునికి సమర్పించారు. స్వామి కీర్తనకు శ్రీకృష్ణ నర్తనం..ఒకరోజు మధ్యాహ్నం ఉడుపిలోని శ్రీకృష్ణుని గుడిలో శ్రీరాఘవేంద్రులు ధ్యానంలో మునిగి ఉన్నారు. ఉన్నట్టుండి గర్భగుడిలో అపూర్వమైన కాంతి కనిపించింది. మంజులమైన గజ్జెల శబ్దం వినిపించింది. శ్రీకృష్ణపరమాత్మ తనకు దర్శనం ఇవ్వబోతున్నారని శ్రీరాఘవేంద్రులకు అనిపించింది. ఆయన తన పక్కనే ఉన్న వీణను తీసుకొని శ్రావ్యంగా మీటసాగారు. అప్పుడు ఆయన నోటి నుంచి "ఇందు ఎనగె గోవిందా, నిన్నయ పాదారవిందవ తోరో ముకుంద ఇందిరా రమణ"(ఈ రోజు నాకు నీ పాదారవిందములను చూపించు ఇందిరా రమణా, ముకుందా) అనే అద్భుతమైన కృతి వెలువడింది. శ్రీ రాఘవేంద్రులు ఆనందంతో పాడుతూ, మధురంగా వీణ వాయిస్తూ ఉంటే... జగన్మోహనాకారుడైన బాలకృష్ణుడు ఆయనకు తన దివ్య మంగళరూపాన్ని అనుగ్రహించాడు. తను వేణుగానం చేస్తూ, బుడిబుడి అడుగులతో చుట్టూ నర్తించాడు. అనంతరం శ్రీరాఘవేంద్రులకు అభయప్రదానం చేసి అదృశ్యుడయ్యాడు. భగవంతుని దర్శనంతో పులకించిపోయిన ఆయన ఆనందబాష్పాలు రాలుస్తూ... దేవుణ్ణి పలు విధాలుగా స్తుతించారు.
భజతాం కల్పవృక్షాయ...
నమతాం కామధేనువే.."నిస్వార్థమైన జీవనం మానవులను గొప్పవారిగా నిలబెడుతుంది. శ్రీరాఘవేంద్రస్వామిలో ఎటువంటి స్వార్థమూ లేదు. అందుకే వారిని 'భజతాం కల్పవృక్షాయ' అని స్తుతిస్తాం" అని చెప్పారు శ్రీసువిద్యేంద్రతీర్థులు. ఒక వృక్షం రుచికరమైన ఫలాలను ఇతరులకు అందిస్తుంది కానీ తాను వాటిని తినదు. నదిలోని నీరు ఏ విధమైన భేదభావం లేకుండా అన్ని ప్రాణులకూ దాహార్తిని తీరుస్తుంది. అదే విధంగా శ్రీరాఘవేంద్రులు ఎలాంటి ఫలాపేక్ష, ఎటువంటి భేదభావం లేకుండా సకల సజ్జనులను కరుణిస్తారు. ఆవు నీరు, గడ్డి మాత్రమే స్వీకరించి, మనకు అమృతంలాంటి పాలను అందిస్తుంది. మనిషి ఒక వయసు వచ్చాక తల్లి పాలు తీసుకోవడం మానేస్తాడు. కానీ పశువులు ఇచ్చే పాలను జీవితాంతం స్వీకరిస్తూనే ఉంటాడు. శ్రీరాఘవేంద్రులు కూడా ఆయన పట్ల మనం చూపించే భక్తి విశ్వాసాలకు బదులుగా మనల్ని కరుణిస్తారు" అంటారు 'హరికథామృతసారం'లో జగన్నాథదాసులు. అందుకే భక్తుల కష్టాలను కడతేర్చి, సన్మార్గం వైపు నడిపించే కల్పవృక్షంగా, కామధేనువుగా శ్రీరాఘవేంద్రులు పేరు పొందారు.



## బీసీ రిజర్వేషన్లకు బీజేపీ అడ్డంకులు



**న్యూఢిల్లీ-నవభూమి:** తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు బీజేపీ అడ్డంకులు సృష్టిస్తోందని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ జైరాం రమేశ్ ఆరోపించారు. ఎంతో చిత్తశుద్ధితో కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్లు అమలు చేయాలని చూస్తుంటే, కేంద్రంలోని బీజేపీ మాత్రం ఉద్దేశపూర్వకంగానే కొర్రీలు పెడుతోందని ఆదివారం ఎక్స్ వేదికగా మండిపడ్డారు. బిహార్‌లో బీసీ బిల్లు గవర్నర్ సమ్మతితో అధికారికంగా చట్టంగా మారితే.. తెలంగాణలో గవర్నర్ ఆ బిల్లును రాష్ట్రపతి సమ్మతి కోసం పంపారన్నారు. 4 నెలలు గడిచినా రాష్ట్రపతి నుంచి ఎటువంటి సమాధానం లేదని చెప్పారు. బిహార్‌లో బిల్లు విషయంలో ఆలస్యం చేయించడం, అడ్డుకోవడం బీజేపీకి సాధ్యం కాలేదన్నారు. అయితే తెలంగాణ విషయంలో మాత్రం బీజేపీ అడ్డంకులు సృష్టిస్తోందని.. ఆ పార్టీకి సామాజిక న్యాయంపై ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో తేలిపోయిందని విమర్శించారు. బీజేపీ అడ్డుకోకపోతే 4 నెలలుగా రాష్ట్రపతి వద్దే ఆ బిల్లు పెండింగ్‌లో ఎందుకు ఉంటుందని ప్రశ్నించారు.

## కేరళలో ఇంటికే మద్యం డెలివరీ



**తిరువనంతపురం-నవభూమి:** మందుబాబుల ఇంటికే మద్యాన్ని డెలివరీ చేసే దిశగా కేరళలో కొత్త ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే ఇంటికే మద్యాన్ని సరఫరా చేసేందుకు సంబంధించిన ప్రతిపాదనను ఆ రాష్ట్ర బేవరేజెస్ (మార్కెటింగ్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్) కార్పొరేషన్.. రాష్ట్ర ప్రభుత్వం ముందుంచుంది. దీనివల్ల మద్యం అమ్మకాలతో రాబడి పెరగడానికి, మద్యం విక్రయ దుకాణాల వద్ద రద్దీని తగ్గించడానికి అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదన ప్రభుత్వం పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చడానికి రాష్ట్ర ఆబ్కారీ చట్టంలో సవరణలు చేయాల్సి ఉంటుంది.

## ఉన్నత విద్యాసంస్థల్లో నషా ముక్త్ భారత్ అభియాన్



**న్యూఢిల్లీ-నవభూమి:** మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం ప్రారంభించిన నషా ముక్త్ భారత్ అభియాన్(ఎన్ఎంబీఏ) కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఏఐసీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారాం పిలుపునిచ్చారు. క్యాంపస్‌ల్లో ఈ కార్యక్రమం అమలు తీరు, వేగవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నత విద్యాసంస్థల అధినేతలతో ఆయన చర్చించారు. యూజీసీ, ఎన్‌సీటీఈ సహకారంతో జాతీయ స్థాయిలో ఈ ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. ఎన్ఎంబీఏ ప్రచార కార్యక్రమం ఐదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్త డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించారు. ఆగస్టు 1 నుంచి 31 వరకూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నిర్వహించే వివిధ కార్యక్రమాల ద్వారా 3కోట్ల మందికిపైగా అవగాహన కల్పించనున్నారు.

## 9వ తరగతికి ఓపెన్ బుక్ పరీక్షలు




**న్యూఢిల్లీ-నవభూమి:** వచ్చే విద్యాసంవత్సరం నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఓపెన్ బుక్ విధానంలో పరీక్షలు నిర్వహించడానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎసఈ) ఆమోదం తెలిపింది. ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన సమావేశంలో సీబీఎసఈ గవర్నింగ్ బాడీ ఈ ప్రతిపాదనను ఆమోదించింది. దీనిలో భాగంగా 9వ తరగతి భాష, గణితం, సైన్స్, సోషల్ పరీక్షలు ఓపెన్ బుక్ విధానం లో నిర్వహించనున్నారు. సంబంధిత మార్గదర్శకాలను పాఠశాలలకు బోర్డు అందించనుంది. అయితే పాఠశాలల్లో దీన్ని అమలుచేయడం తప్పనిసరి కాదు. కాగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సిబ్బంది కోసం సీబీఎసఈ ప్రత్యేకంగా ఒక కమ్యూనిటీ రేడియో స్టేషన్‌ను ఏర్పాటు చేయనుందని బోర్డు అధికారులు తెలిపారు. 9 నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఆడియో కంటెంట్ అందించడానికి సీబీఎసఈ ఇప్పటికే 'శిక్షా వాణి' పేరిట పాడ్‌కాస్టను నిర్వహిస్తోంది.

## ప్రియుడ్ని ఇంటికి పిలిచి స్క్రూడ్రైవర్‌తో పొడిచి చంపి...



**లఖ్‌నవూ-నవభూమి:** పచ్చటి సంసారాల్లో వివాహేతర సంబంధాలు చిచ్చు రేపుతున్నాయి. ఇటు భర్తో.. అటు భార్యో.. లేదా ప్రియుడో.. ఎవరో చివరికి నమ్మిన వారి చేతిలోనే ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటువంటి ఘటనలు ఇటీవల ఎక్కువయ్యాయి. ప్రియుడిని ఇంటికి పిలిచి భర్తతో కలిసి చిత్రహింసలు పెట్టి ఓ మహిళ చంపగా.. మరో ఘటనలో వివాహేతర సంబంధం విషయమై గొడవపడి భర్త మర్మాంగాన్ని భార్యే కోసేయడంతో చావుబతుకుల్లో అతడు కొట్టుమిట్టాడుతున్నాడు. ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్, అమేథిలో ఈ దారుణాలు చోటు చేసుకున్నాయి. రయీస్, సితార భార్యాభర్తలు.. అయితే పక్కింట్లో ఉండే అనీశ్ (45)తో సితారకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇటీవలే అనీశ్‌కు వివాహం నిశ్చయమవగా.. సితార అతడిని ఇంటికి పిలిచింది. ఈ నేపథ్యంలోనే ఆమె ఇంటికి వెళ్లగా భర్త రయీసతో కలిసి అతడిపై ఆమె దాడి చేసింది. స్క్రూడ్రైవర్‌తో పొడవడంతో పాటు అతడిని చిత్రహింసలకు గురిచేశారు. ఈ క్రమంలోనే అనీశ్ కొన ఊపిరితో బయటికొచ్చి తన ఇంటి సమీపంలో పడి ప్రాణాలు కోల్పోయాడు. అనీశ్ తండ్రి మాట్లాడుతూ.. రయీస్ తమకు రూ.7 లక్షల అప్పు ఇవ్వాల్సి ఉందని.. అది అడిగేందుకే అతడి ఇంటికెళ్లగా అనీశ్‌ను తీవ్రంగా హింసించి కొట్టి చంపారన్నారు. ఫసన్‌గంజ్ కచ్‌నా గ్రామంలో నివసించే అన్సార్ అహ్మద్(38)కు ఇద్దరు భార్యలు.. కానీ పిల్లలు లేరు. అయితే అన్సార్ మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని రెండో భార్య నజ్నీన్ బానోకు తెలిసింది. ఈ నేపథ్యంలోనే శనివారం రాత్రి భోజనంలో అతడికి మత్తు మందు పెట్టింది. అతడు మత్తులోకి జారుకోగానే కత్తితో మర్మాంగాన్ని కోసేసి పారిపోయింది. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉంది.

# ఢిల్లీ వీధుల్లో ఒక్క కుక్క కూడా ఉండకూడదన్న సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీతో పాటు దాని పరిసర ప్రాంతాలైన నేషనల్ క్యాపిటల్ రీజియన్‌లో పెరిగిపోతున్న వీధి కుక్కల సమస్యపై సుప్రీం కోర్టు సంచలన తీర్పును ఇచ్చింది. ఈ సమస్యను తీవ్రంగా పరిగణించిన సర్వోన్నత న్యాయస్థానం.. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో ఉన్న అన్ని వీధి కుక్కలను గుర్తించి, వాటిని షెల్టర్లకు తరలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వును ఎనిమిది వారాల్లోగా అమలు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. ఈ సందర్భంగా కోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రజల ఆందోళనలను ప్రతిబింబించాయి. ముఖ్యంగా రేబిస్‌తో చనిపోయిన వారిని ఎవరు తిరిగి తీసుకు వస్తారని కోర్టు ఘాటుగా ప్రశ్నించింది. వీధి కుక్కల బెడద కేవలం ఒక ఇబ్బందికరమైన అంశం మాత్రమే కాదని.. అది ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే తీవ్రమైన ప్రజా భద్రతా సమస్య అని సుప్రీం కోర్టు పేర్కొంది. వీధి కుక్కలు, వాటిని పెంచుకునే ప్రజల హక్కుల మధ్య సమతుల్యత సాధించాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయ పడింది. కానీ మనుషుల ప్రాణాల కంటే జంతువుల సంక్షేమం ముఖ్యం కాదని కోర్టు స్పష్టం చేసింది. ట్యాక్స్ పేయర్లకు అలర్ట్.. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో వీధి కుక్కల బెడద గత కొంతకాలంగా తీవ్రంగా పెరిగింది. ముఖ్యంగా రాత్రి వేళల్లో, ఉదయం పూట వాకింగ్‌కు వెళ్లేవారు, పిల్లలు వీధి కుక్కల దాడులకు గురవుతున్నారు. అనేక సందర్భాల్లో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా ఉన్నాయి. రేబిస్ వ్యాధి భయం కూడా ప్రజలను తీవ్రంగా వెంటాడుతోంది. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ ఆదేశాలు ప్రజలందరికీ ఊరట కలిగించే అంశంగా పరిణమించింది. ఈ ఆదేశాల అమలుకు ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ ఇతర స్థానిక సంస్థలు చర్యలు తీసుకోవాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. అయితే ఈ ఆదేశాల అమలు అంత సులభం కాదని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. లక్షల సంఖ్యలో ఉన్న వీధి కుక్కలను గుర్తించి, వాటిని తరలించడం ఒక పెద్ద సవాలు అని వివరిస్తున్నారు. వాటిని ఉంచడానికి సరిపడా షెల్టర్లు, సిబ్బంది, వనరులు చాలా అవసరం అని పేర్కొంటున్నారు. అంతేకాకుండా జంతు సంక్షేమ సంస్థల నుంచి వ్యతిరేకత కూడా ఎదురయ్యే అవకాశం ఉందంటున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ వంటి కార్యక్రమాలను కూడా పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ఏదేమైనా, సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ ఆదేశాలు వీధి కుక్కల సమస్యపై ఒక కొత్త చర్చకు దారితీసి, ప్రభుత్వ యంత్రాంగంపై చర్యలు తీసుకోవాల్సిన ఒత్తిడిని పెంచాయి.

# సైన్యంలో పురుషుల కోటా రద్దు

### మెరిట్ ఆధారంగానే నియామకాలు ఉండాలి..: సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత సైన్యంలో నియామకాల విషయంలో సుప్రీంకోర్టు ఒక చారిత్రాత్మకమైన తీర్పును వెలువరించింది. ఇండియన్ ఆర్మీ జడ్జ్ అడ్వకేట్ జనరల్ విభాగంలో పురుషులకు ప్రత్యేకంగా రిజర్వేషన్లు కేటాయించడం రాజ్యాంగ విరుద్ధమని, అది ఏకపక్షం మాత్రమేనని సుప్రీం కోర్టు తేల్చి చెప్పింది. ఈ తీర్పు ప్రకారం.. నియామకాల ప్రక్రియ జెండర్-న్యూట్రల్ (లింగ వివక్ష లేనిది)గా ఉండాలని స్పష్టం చేసింది. అలాగే మెరిట్ ఆధారంగా మాత్రమే అభ్యర్థులను ఎంపిక చేయాలని వివరించింది.

**2:1 నిష్పత్తిలో పురుషులు, స్త్రీల కోటా..**


జస్టిస్ మన్మోహన్, జస్టిస్ దీపాంకర్ దత్త నేతృత్వంలోని ధర్మాసనం ఈ కీలక తీర్పును ఇచ్చింది. ఈ కేసులో సైన్యంలో 2:1 నిష్పత్తిలో పురుషులు, మహిళా అధికారుల కోసం కోటా పద్ధతిని పాటించడాన్ని కోర్టు తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ పద్ధతి రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కు అయిన సమానత్వపు హక్కును ఉల్లంఘిస్తుందని స్పష్టం చేసింది. సైనిక విభాగంలోని నియామకాలలో పురుషుల కోసం ప్రత్యేకంగా సీట్లను రిజర్వ్ చేయడం సమర్థనీయం కాదని కోర్టు పేర్కొంది.

తమ విధానం లింగ సమానంగానే ఉందని సర్కారు వాదన.. ఈ కేసు విచారణలో ప్రభుత్వం తమ విధానం 50:50 నిష్పత్తిలో లింగ-సమానంగానే ఉందని వాదించింది. అయితే ఈ వాదనను కోర్టు తిరస్కరించింది. నియామకాలలో పురుషులకు మాత్రమే రిజర్వేషన్లు కేటాయించడం మహిళల హక్కులకు భంగం కలిగించడమే అవుతుందని కోర్టు బలంగా వాదించింది. ఒకసారి పోస్టులు ఖాళీ అయిన తర్వాత.. అత్యంత ప్రతిభావంతులైన అభ్యర్థులను మాత్రమే ఎంపిక చేయాలని కోర్టు ఆదేశించింది. ఈ తీర్పు భారత సాయుధ దళాలలో మహిళల పాత్రను మరింత విస్తరించడానికి, వారి సమానత్వ హక్కును నిలబెట్టడానికి దోహదపడుతుంది. నీతా అంబానీ సొంతమైన అత్యంత ఖరీదైన 'ఊసరవెల్లి' కారు.. కళ్లు చెదిరే ఫీచర్లు!

**'త్వరగా లాగ్ అవుట్ అయి ఇళ్లకు వెళ్లిపోండి'..** 20 ఏళ్లు జైల్లో పెట్టి.. ఇప్పుడు నిర్దోషిగా తేల్చారు.. ఈ తల్లి కష్టం ఎవరికీ రాకూడదుజడ్జ్ అడ్వకేట్ జనరల్ విభాగం అనేది భారత సైన్యానికి సంబంధించిన చట్టపరమైన విభాగం. ఈ విభాగంలో పనిచేసే అధికారులు న్యాయవాదులుగా వ్యవహరిస్తూ సైన్యానికి న్యాయ సలహాలు, సేవలు అందిస్తారు. అయితే ఈ పోస్టుల కోసం జరిగన పరీక్షల్లో అష్నూర్ కౌర్, ఆస్థ త్యాగీ అనే మహిళా అధికారులు వరుసగా 4, 5వ ర్యాంకులు సాధించారు. అయినప్పటికీ వారిని విధుల్లోకి తీసుకోకపోవడంతో.. సుప్రీం కోర్టును ఆశ్రయించారు. పురుష అభ్యర్థుల కన్నా తమకు ఎక్కువ మార్కులు వచ్చినప్పటికీ.. మహిళల కోటాల్లో ఖాళీలు లేవంటూ తను ఎంపిక చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ తీర్పును ఇచ్చింది.

# దన్కడ్‌ను ఎక్కడున్నారో తెలియట్లేదు

### ప్లీజ్ ఆయన అడ్రెస్ చెప్పండి..: సంజయ్ రౌత్



**ముంబై- నవభూమి:** దేశంలో ఇప్పుడు ఒక రాజకీయ మిస్టరీ చర్చనీయాంశంగా మారింది. భారత మాజీ ఉపరాష్ట్రపతి, రాజ్యసభ మాజీ ఛైర్మన్ జగదీప్ దన?డ్ ఉన్నట్టుండి అదృశ్యమయ్యారన్న ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. అనూహ్యంగా తన పదవికి రాజీనామా చేసినప్పటి నుంచి ఆయన జాడ కనిపించకపో వడంతో.. శివసేన ఎంపీ సంజయ్ రౌత్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఒక లేఖ రాశారు. ఈ లేఖలో ఆయన దన?డ్ ప్రస్తుత పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. ఆయన ఎక్కడ ఉన్నారో, ఎలా ఉన్నారో తెలియజేయాలని కోరారు. జూలై 21న దన?డ్ అనారోగ్య కారణాల వల్ల తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఆ తర్వాత ఆయన బహిరంగంగా ఎక్కడా కనిపించలేదు. ఇది రాజకీయ వర్గాల్లో అనేక ఊహాగానాలకు దారి తీసింది. సంజయ్ రౌత్ తన లేఖలో ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ.. దన?డ్ రాజీనామా చేసిన రోజు ఉదయం రాజ్యసభ సమావేశాలను సాదారణంగానే నిర్వహించారని.. ఆయన అప్పుడు ఆరోగ్యంగానే ఉన్నట్లే కనిపించారని తెలిపారు. రాజీనామా తర్వాత దన?డ్‌ను సంప్రదించడానికి ప్రయత్నించిన ఇతర రాజ్యసభ సభ్యులు కూడా విఫలం అయ్యారని రౌత్ వెల్లడించారు. ఈ అస్పష్టత, గోప్యత కారణంగానే దన?డ్ తన నివాసంలో నిర్బంధంలో ఉన్నారనే పుకార్లు ఢిల్లీలో విస్తృతంగా ప్రచారంలో ఉన్నాయని రౌత్ పేర్కొన్నారు. బస్సు ఆపలేదని ఆర్టీసీ డ్రైవర్‌పై మహిళ దాడి.. ఫ్రీ బస్సు మొదలైతే ఇలాంటివి ఎన్ని చూడాలో! రౌత్ తన లేఖలో ఒక కీలకమైన అంశాన్ని ప్రస్తావించారు. దన?డ్ గురించి వాస్తవ సమాచారం కోసం ముందుగా హోంమంత్రిని సంప్రదిస్తున్నామని, ఒకవేళ సరైన సమాచారం లభించకపోతే.. సుప్రీం కోర్టులో "హెబియస్ కార్పస్" పిటిషన్ దాఖలు చేసేందుకు పరిశీలిస్తామని ఆయన హెచ్చరించారు. ఒక అత్యున్నత రాజ్యాంగ పదవిని నిర్వహించిన వ్యక్తి ఉన్నట్టుండి కనిపించకుండా పోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని ఆయన అభిప్రాయ పడ్డారు. ఈ విషయమై స్వతంత్ర ఎంపీ కపిల్ సిబల్ కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. "గల్లంతైన ఉపరాష్ట్రపతి" గురించి తాను ఎన్నడూ వినలేదని సిబల్ వ్యాఖ్యానించారు. ఈ అంశం అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం ఉంది. దన?డ్ ఆరోగ్య పరిస్థితి, ఆయన ఎక్కడ ఉన్నారనే విషయాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని రాజకీయ పరిశీలకులు సైతం అభిప్రాయ పడుతున్నారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్న వ్యక్తుల భద్రత, శ్రేయస్సుపై ప్రజలకు తెలుసుకునే హక్కు ఉంటుందని, ఈ విషయంలో పారదర్శకత చాలా ముఖ్యమని నొక్కి చెప్పారు. సంజయ్ రౌత్ లేఖకు కేంద్రం ఎలా స్పందిస్తుందోనని ఇప్పుడు అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. చూడాలి మరి అమిత్ షా దీనిపై ఎలా స్పందిస్తారో.

# ఆ విషయాల్లో భర్త భార్యలను ఎంతగా సతాయించినా క్రూరత్వం కిందకు రాదు..: హైకోర్టు సంచలనం



**ముంబై- నవభూమి:** భార్య వస్త్రధారణ, వంట చేసే తీరుపై భర్త చేస వ్యాఖ్యలు తీవ్ర క్రూరత్వం లేదా వేధింపుల కిందకు రావని బాంబే హైకోర్టు ఔరంగాబాద్ బెంచ్ స్పష్టం చేసింది. ఈ కేసులో భర్తకు, అతడి బంధువులకు శుక్రవారం రోజు విముక్తి కల్పించింది. తాను సరైన విధంగా బట్టలు వేసుకోవడం లేదని, ఎప్పుడూ భర్తకు నచ్చినట్లుగా ప్రవర్తించలేదని, అతడికి నచ్చే విధంగా వంట కూడా సరిగ్గా చేయడం భర్త సతాయిస్తున్నట్లు మహిళ పెట్టిన పిటిషన్‌ను కొట్టి వేసింది. ఇది ఏమాత్రం తప్పు కాదని.. క్రూరత్వం లేదా వేధింపులుగా తమకు అనిపించడం లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. భార్యాభర్తలు ఇద్దరి మధ్య సంబంధాలు దెబ్బతిన్నప్పుడు.. చిన్న చిన్న విషయాలను కూడా పెద్దగా చేసి చూసుకుంటున్నారని కోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. దాని వల్లే అన్ని విషయాల్లోనూ గొడవలు పడుతూ.. ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకుని న్యాయ పోరాటానికి దిగుతున్నారని వెల్లడించింది. ముఖ్యంగా భార్య వంట చేసినప్పుడు సరిగ్గా లేదని భర్త వంకలు పెట్టడం, ఆమె తనకు నచ్చినట్లుగా వ్యవహరించ డం లేదని చెప్పడం, ఆమె కూడా అతడి తీరును ఏమాత్రం సహించకపోవడం ఇందులో భాగమేనని చెప్పింది. అయితే ఇవన్నీ పెద్ద విషయాలేమీ కావని.. వీటిని బూతద్దంలో పెట్టి మరీ చూడాల్సిన అవసరం కూడా ఏమీ లేదని తేల్చి చెప్పింది.

భారత శిక్షా స్మృతిలోని సెక్షన్ 498ఏ పరిధిలోని క్రూరత్వం భావనలోకి ఇమిడేంత తీవ్రమైన ఆరోపణలు కానప్పుడు.. విచారణను ఎదుర్కోవాలని భర్తను, అతడి కుటుంబ సభ్యులను కోరడం న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేయడమే అవుతుందని స్పష్టం చేసింది. ఈక్రమంలోనే భార్య వేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ.. ఇకపై భార్యాభర్తలు ఇద్దరూ ప్రేమాభిమానాలు, పరస్పరం గౌరవం ఇచ్చిపుచ్చుకుంటూ సంతోషంగా గడపాలని తెలిపింది. బాంబే హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పుతో అంతా ఆశ్చర్య పోతున్నారు. సాధారణంగా భార్య వేధింపుల కింద కేసు పెడితే.. భర్తలు తప్పించుకోవడం చాలా కష్టం అని, కానీ ఈ కేసులో భర్త తరపు నుంచి న్యాయస్థానం ఆలోచించడం.. అందులోనూ దంపతులను కలిపేందుకు కృషి చేయడం గమనార్హం అని చెప్పుకొస్తున్నారు.

### ప్రాణం తీసిన ట్రాఫిక్ జామ్! మహారాష్ట్రలో ఘటన

**ముంబై- నవభూమి:** బీజేపీ పాలిత మహారాష్ట్ర లో ఒక మహిళ మృతి.. రాష్ట్రంలో వైద్య సదుపాయాల దయనీయ స్థితిని, రవాణా సదుపాయాల లేమిని ఏకకాలంలో బయటపెట్టింది. మహారాష్ట్ర పాల్ఘర్ జిల్లా మధుకర్ నగర్‌కు చెందిన 49 ఏండ్ల ఛాయా పురవ్.. చెట్టు కూలిన ఘటనలో తీవ్రం గా గాయపడింది. స్థానికంగా వైద్య సదుపాయాలు లేకపోవటంతో అంబులెన్స్‌లో ముంబైలోని హిందూజా దవాఖానకు ఆమెను తరలిస్తుండగా.. జాతీయ రహదారిపై భీకరమైన ట్రాఫిక్ జామ్ ఆమె ప్రాణాల్ని బలిగొన్నది. కనీసం 30 నిమిషాల ముందు దవాఖానకు చేరుకుంటే ఆమెను కాపాడగలిగే వాళ్లమంటూ వైద్యులు చెప్పారని..

## భారత సంతతికి చెందిన వినయ్ ప్రసాద్‌కు తిరిగి అమెరికా అందలం



**వాషింగ్టన్-నవభూమి:** అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ లో టాప్ వ్యాక్సిన్, జీన్ థెరపీ నియంత్రణాధికారిగా పనిచేసిన భారతీయ సంతతి పరిశోధకుడు వినయ్ ప్రసాద్ రాజీనామా చేసి తిరిగి తన పదవిలో చేరడం చర్చనీయాంశంగా మారింది. ఆయన కొన్ని రోజుల క్రితం తన పదవికి రాజీనామా చేశారు. కానీ కేవలం కొన్ని రోజుల్లోనే సంస్థ అభ్యర్థన మేరకు మళ్లీ అదే పదవిలోకి తిరిగి వచ్చారు. అమెరికా హెల్త్ అండ్ హ్యూమన్ సర్వీసెస్ ప్రతినిధి ఆండ్రూ నిక్సన్, వినయ్ ప్రసాద్ తిరిగి సెంటర్ ఫర్ బయోలాజిక్స్ ఎవాల్యుయేషన్ అండ్ రీసెర్చ్‌కు నాయకత్వం వహించనున్నట్లు తెలిపారు. "ట్రంప్ ప్రభుత్వం కింద చేస్తున్న ముఖ్యమైన పనిని తప్పుడు వార్తల ద్వారా ఎవరూ దెబ్బతీయనివ్వరు" అని ఆయన స్పష్టం చేశారు. భారతీయ వలస కుటుంబాలకు తీవ్ర ఆర్థిక భారం జూలై 29న ప్రసాద్ ఆకస్మికంగా తన పదవికి రాజీనామా చేశారు. సరెప్టా థెరప్యూటిక్స్ జీన్ థెరపీ సేఫ్టీ ఇష్యూల విషయంలో ఆయన తీసుకున్న నిర్ణయాలపై వచ్చిన కన్సర్వేటివ్ విమర్శలు, అలాగే ట్రంప్ మద్దతుదారైన లారా లూమర్ వంటి వారి నుంచి వ్యతిరేకత ఆయన తిరిగి రాకుండా అడ్డుపడ్డాయి. ఎఫ్‌డీఏలో చేరిన మూడు నెలలకే ప్రసాద్ పై విమర్శలు మొదలయ్యాయి. కోవిడ్ వ్యాక్సిన్లపై మరిన్ని అధ్యయనాలు చేయాలంటూ, తన సొంత శాస్త్రీయ సమీక్ష బృందం అభిప్రాయాన్ని తిరస్కరించి, కఠినమైన వైఖరి తీసుకోవడం శాస్త్రీయ ఆవిష్కరణలకు అడ్డంకిగా మారిందని విమర్శలు వచ్చాయి. గత నెలలో ప్రసాద్, ఎఫ్‌డీఏ కమిషనర్ మార్టీ మాకారీలు సరెప్టా తయారు చేసిన డూషెన్ మస్క్యులర్ డిస్ట్రోఫీ చికిత్స మందు ఎలివిడిస్ పంపిణీని ఆపాలని ఆదేశించారు. ఈ నిర్ణయం, ఆ సంస్థ జీన్ థెరపీ వాడిన రోగుల్లో చోటుచేసుకున్న మూడు మరణాల నేపథ్యంలో తీసుకున్నారు. ప్రసాద్ రాజీనామా వార్త బయటకు వచ్చినప్పుడు సరెప్టా షేర్లు ఒక్కసారిగా పెరిగాయి. అయితే, ఆయన ఎఫ్‌డీఏలో తిరిగి చేరడం, అలాగే మిగతా రెండు పదవులు (చీఫ్ సైన్స్ ఆఫీసర్, చీఫ్ మెడికల్ ఆఫీసర్) కూడా పొందుతారా అన్నది ఇంకా స్పష్టంగా తెలియాల్సి ఉంది.

## వారసుల ఎంట్రీపై ఆసక్తి రేపుతున్న మంత్రుల మాటలు..



**న్యూఢిల్లీ-నవభూమి:** పార్లమెంట్ లో ఎంపీ సుదాన్షు త్రివేది చేసిన ప్రసంగం ఒకటి బాగా వైరల్ గా మారింది. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని దృష్టిలో ఉంచుకొని వారసత్వం గురించి చాలా బాగా వివరించారు. భగవాన్ రాముడి ఆలయాల తర్వాత అంత ఎక్కువ సంఖ్యలో ఉన్న ఆలయాలు హనుమంతుడివి. ద్రోణాచార్య శిష్యులనే ఇప్పటికీ దేశం మరిచిపోలేదు. రాముడికి లవకుశలు, ద్రోణాచార్యుడికి అశ్వత్థామ వారసులైనా వారికి పెద్దగా కీర్తి లేదు. అంటే ఈ దేశం బయలాజికల్ పరంపరను కోరుకోదని, భక్తులు, శిష్యుల పరంపరనే గుర్తిస్తుందని చెప్పారు. ఇది చాలా వైరల్ గా మారింది. నరేంద్ర మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వారసత్వాన్ని పూర్తిగా తగ్గించుకుంటూ వచ్చారు. దేశ వ్యాప్తంగా, బీజేపీ, ఎన్డీయే పాలన రాష్ట్రాల్లో వారసత్వం అనేది కనిపించడం లేదు. రోహిత్ కొత్త లంబోర్గిని కారు నంబరు రాజకీయాలు బాగా లేవంటున్న అమాత్యులు.. ఎన్డీయే పాలనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ లో ఇటీవల మంత్రులు చేసిన వ్యాఖ్యలు నేడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. గతంలో రాజకీయాలు తమతో ఆగిపోకుండా కొడుకులకు, కూతుళ్లకు, మనుమండ్లకు, మనుమరాండ్లకు కొనసాగుతుండేది కానీ సీన్ రివర్స్ అయ్యింది. నేడు రాజకీయాల్లోకి వచ్చేందుకు కొడుకులు ఇంట్రస్ట్ చూపుతున్నా నాయకులు మాత్రం అడ్డుకుంటున్నారు. ప్రస్తుత మంత్రుల నుంచి సీనియర్ నాయకుల వరకు వద్దనుకుంటున్నారు. 'వద్దులే రాజకీయాలు బాగా లేవు' అంటూ ఒక సీమ మంత్రి వ్యాఖ్యానించడం అందరినీ ఆలోచింప చేస్తుంది. సదరు మంత్రి బాబు కేబినేట్ లో కీలకంగా ఉన్నారు. ఆయనే ఇలా వ్యాఖ్యలు చేసే వరకు ప్రతి ఒక్కరి ఆలోచనలు అదేవిధంగా ఉన్నాయి. భారత సంతతికి చెందిన వినయ్ ప్రసాద్ కు తిరిగి అమెరికా అందలం ఇంట్రస్ట్ చూపని సీనియర్ నాయకులు.. గంటా శ్రీనివాస్ రావు, నారాయణ తమ వారసులను రాజకీయాల్లోకి తీసుకురావాలని కోరుకున్నారు. కానీ నేడు కొంచెం ఆలోచిస్తున్నట్లు కనిపిస్తుంది. నారాయణకు ఇద్దరు కుమార్తెలే.. దీంతో తన రాజకీయ వారసులుగా ఆయన సతీమణిని తీసుకచ్చేందుకు ఇంట్రస్ట్ చూపించారు. ఆమెను కూడా కేవలం నియోజకవర్గానికే పరిమితం చేశాడు. ఇక గంట తన కుమారుడితో బిజినెస్ చేయిస్తానని గతంలోనే చెప్పారు. ఒక విజయవాడకు వస్తే బొండా ఉమా తన పిల్లలను తీసుకువద్దాం అనుకున్నారు. కానీ ఇటీవల తమ ప్రచార ఫొటోల్లో పిల్లల ఫొటోలు వేయద్దని పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఆదేశాలిచ్చారు. వైసీపీ విషయానికి వస్తే బొత్స తన కుటుంబాన్ని రాజకీయాల్లోకి తీసుకురావాలనుకున్నారు. కానీ ఆయన కూడా ఇటీవల నా కుటుంబం నుంచి ఒక్కరే పోటీ చేస్తారని చెప్పడం ఆశ్చర్యాన్ని సంతరించుకుంది. ఏది ఏమైనా నాయకుల్లో ఈ హఠాత్ పరిణామానికి కారణం ఏమై ఉంటుందా అని సర్వత్రా చర్చ జరుగుతోంది. ఒకప్పుడు రాజకీయ నాయకులు కోట్లాది రూపాయలు సంపాదించుకునే వారు నేడు ఆ పరిస్థితులు కనిపించడం లేదు. ప్రతీది పారదర్శకంగా జరుగుతోంది. దీంతో డబ్బులు కనిపించడం లేదు. పైగా వారసత్వానికి సీటు ఇచ్చేందుకు పార్టీలు ఇంట్రస్ట్ చూపడం లేదు. కార్యకర్తలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇది కూడా ఒక కారణంగా కనిపిస్తుంది.



## డబుల్ చిన్ తగ్గేదెలా

డబుల్ చిన్ అనేది ముఖం కింద మెడ భాగంలో ఏర్పడుతూ ఉంటుంది. దీనివల్ల ముఖం అందంగా కనిపించదు. చర్మం కింద కొవ్వులు పేరుకోవడం, ఊబకాయం, వయసు పెరగడం, జన్యుపరమైన కారణాల వల్ల ఈ సమస్య వస్తూ ఉంటుంది. చిన్న చిట్కాలతో డబుల్ చిన్‌ను మాయం చేయవచ్చంటున్నారు నిపుణులు...డబుల్ చిన్ ఉన్నవారు ఆహారాన్ని బాగా నమిలి తినాలి. దీనివల్ల ముఖంలోని కండరాలకు వ్యాయామం చేసినట్లవుతుంది. చర్మం కింద పేరుకున్న అదనపు కొవ్వులు కరిగిపోతాయి. క్రమంగా ముఖాకృతి మామూలుగా మారుతుంది. తరచూ చూయింగ్ గమ్ నమలడం వల్ల కూడా ప్రయోజనం లభిస్తుంది.ఒక గిన్నెలో గుడ్డు తెల్ల సొన, ఒక చెంచా పాలు, ఒక చెంచా నిమ్మరసం, కొద్దిగా తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని డబుల్ చిన్ మీద రాసి ఆరనివ్వాలి. అరగంట తరవాత గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే డబుల్ చిన్ తగ్గుతుంది.మెడను గుండ్రంగా తిప్పడం, పైకి కిందికి కదిలించడం లాంటి చిన్న చిన్న వ్యాయామాలు చేసినా ఫలితం ఉంటుంది.రోజూ కాఫీ, టీలకు బదులు తేనె కలిపిన గ్రీన్ టీ తాగడం అలవాటు చేసుకోవాలి. దీనివల్ల శరీరంలో జీవక్రియలు వేగవంతమవు తాయి. చెడు కొవ్వులు కరిగి సమస్య తీరు తుంది.అధిక క్యాలరీలు ఉన్న ఆహారాన్ని తినకూ డదు. ఇ విటమిన్ అధికంగా లభించే ఆకు కూరలు, పాల ఉత్పత్తులు, పప్పు దినుసులు, స్వీట్ కార్న్, సోయా బీన్స్, యాపిల్, బ్రౌన్ రైస్ తరచూ తీసుకోవడం వల్ల ప్రయోజనం ఉంటుంది.



# ఒంటిచేత్తో పతకాలు పట్టేస్తోంది



**ఆమెది సాధారణ వ్యవసాయ కుటుంబం... పుట్టుకతోనే వైకల్యం... ఒకవైపు సమాజం చిన్నచూపు... మరోవైపు లోకుల సానుభూతి... మానసిక స్థైర్యంతో వీటన్నిటినీ అధిగమించి... పారా క్రీడల్లో రాణిస్తోంది హెచ్.శివాని. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఏడు స్వర్ణ పతకాలు సాధించి, ఎందరికో ప్రేరణగా నిలుస్తున్న శివాని కథ ఆమె మాటల్లోనే...**

"మాది కర్నూలు జిల్లా మద్దికెర. ఈరన్న, లలిత నా తల్లిదండ్రులు. మాది వ్యవసాయ కుటుంబం. నాన్న రోజూ గుంతకల్లుకు వెళ్లి... ఆకుకూరలు అమ్మేవారు. పుట్టుకతోనే నా కుడి చెయ్యి మోచేతి వరకూ మాత్రమే ఉంది. అది చూసిన కొందరు బంధువులు, ఇరుగుపొరుగువారు "ఈ అమ్మాయి మీకెందుకు? ఎక్కడైనా బయట పడేయండి. ఇంట్లోకి తెచ్చుకోవద్దు" అని గట్టిగా చెప్పారట. కానీ మా అమ్మ, నాన్న ఆ మాటలేవీ పట్టించుకోలేదు. నా తరువాత పుట్టిన ఇద్దరు తమ్ముళ్లతోపాటు నన్ను ఎంతో ప్రేమగా చూసుకున్నారు. అయితే ఇంటి బయట పరిస్థితి వేరేగా ఉండేది. సగమే ఉన్న నా చెయ్యిని చూసి చాలామంది ఏమైందని అడిగేవాళ్లు. సానుభూతి చూపించేవాళ్లు. అటువంటప్పుడు 'నేను ఏమీ చేయలేనా? ఏమీ సాధించలేనా?' అని ఎంతో బాధ కలిగేది. ఒకప్పుడు నన్ను ఎక్కడైనా పడేయమని చెప్పినవాళ్లు ఆశ్చర్యపడేలా ఏదైనా సాధించాలని అనుకునేదాన్ని. నేను ఐదవ తరగతిలో కొడుమూరులో మా మేనత్త ఇంట్లో ఉండేదాన్ని అక్కడే నవోదయ పరీక్షలకు కోచింగ్ తీసుకున్నాను. కర్నూలు నవోదయ స్కూల్‌లో సీటు వచ్చింది. అక్కడ స్నేహితులు నన్ను చాలా బాగా చూసుకునేవాళ్లు. .

మా స్కూల్ ప్రిన్సిపాల్ (ప్రస్తుతం నవోదయ విద్యాలయ సమితి అసిస్టెంట్ కమిషనర్) సాగరిక మేడమ్ చొరవతో నా జీవితం కొత్త మలుపు తిరిగింది. నేను తొమ్మిదో తరగతి చదువుతున్నప్పుడు.. తెలంగాణలోని రంగారెడ్డి నవోదయ స్కూల్‌లో జరుగుతున్న పారా స్పోర్ట్స్ కు పంపించారు. అక్కడ షాట్‌పుట్, జావెలిన్ త్రోలో నా టాలెంట్‌ను గుర్తించి నన్ను ఎంపిక చేశారు. నాకు చదువుతో పాటు క్రీడల్లో కూడా రోజూ శిక్షణ ఇచ్చారు. శిక్షణకు రోజూ మధ్యాహ్నం వెళ్లి, రాత్రికి వచ్చేవాళ్లం. ఒక వైపు శిక్షణ తీసుకుంటూనే... జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పాల్గొన్నా. మొదట గుజరాత్‌లో జరిగిన ఈవెంట్లలో షాట్‌పుట్‌లో సిల్వర్ మెడల్, జావెలిన్ త్రోలో గోల్డ్ మెడల్ వచ్చింది. దాంతో ఒకప్పుడు మా కుటుంబాన్ని పట్టించుకోనివారు కూడా... మా ఇంటికి వచ్చి, మా అమ్మానాన్నలతో. నా గురించి గొప్పగా మాట్లాడారు. "ఈ అమ్మాయి ఏమీ చేయలేదని అనుకున్నాం.. అయితే చాలా గొప్పగా సాధించింది" అని అభినందించారు.

**అందరిలోనూ నైపుణ్యం ఉంటుంది...**

తమకు వైకల్యం ఉందనీ,. జీవితంలో ఏదీ సాధించలేమని కొందరు నిరుత్సాహపడుతూ ఉంటారు. ఇది సరైన ఆలోచన కాదు. ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక నైపుణ్యం ఉంటుంది. నేను క్రీడల్లో పాల్గొనడానికి బయట రాష్ట్రాలకు వెళ్లినప్పుడు ఎంతోమందిని చూశాను. నాకు చెయ్యి మాత్రమే లేదు. వాళ్లకు ఇంకా చాలా అవయవాలు లేవు. 'వాళ్లకన్నా నేనే అదృష్టవంతురాలిని కదా' అనుకున్నాను. ఇప్పుడు నాకు చెయ్యి లేదన్న విషయమే గుర్తుకు రాదు. భవిష్యత్తులో బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగం చేయాలనేది నా లక్ష్యం. అందుకే మదనపల్లె నవోదయ స్కూల్‌లో ఇంటర్‌లో చేరాను. మా ప్రిన్సిపాల్ గీత మేడమ్ నా సమస్యను కలెక్టర్ శ్రీధర్ చామకూరి గారి దృష్టికి తీసురువెళ్లారు. ఆయన సాయంతో నాకు కృత్రిమమైన కుడి చేతిని అమర్చారు. ఆ చేతికి ఇంకా అలవాటు పడాల్సి ఉంది. మా స్కూల్‌లో నా పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు.. నా డైట్, ప్రాక్టీస్ విషయంలో చాలా జాగ్రత్తగా చూసుకుంటున్నారు. కోచ్ సహకారంతో రోజూ ప్రాక్టీస్ చేస్తున్నాను."

# 'స్కై ఫుడ్ హవా!'

## మబ్బుల మధ్య మజిలీ మెనూ





ఫ్యాషన్‌లోనే కాదు ఫుడ్‌లోనూ ఎప్పటికప్పుడు ట్రెండ్ మారిపోతూనే ఉంటుంది. ఒక్కోసారి ఒక్కోరకం ఆహారం జనాన్ని అమితంగా ఆకట్టుకుంటూ ఉంటుంది. ఇక, ఇప్పుడు స్కై ఫుడ్ ట్రెండ్‌ది హవా! నీలాకాశం, తెల్లటి మబ్బులు, కాస్తంత పచ్చదనం మనం తినే పదార్థాల్లో ప్రతిబింబించడం దీని ప్రత్యేకత. చూసేందుకు విభిన్నంగా కనిపించే స్కై ఫుడ్, నాలుకకీ నచ్చుతున్నదని చెబుతున్నారు కొత్త రుచుల ప్రియులు.

%ఆకాశం మబ్బులు అందానికి వేదికలు. దానికి కాసింత పచ్చదనమూ తోడైతే ఆ దృశ్యం కళ్లకు పండుగే. అంత అందమైన కాంబినేషన్‌ను ఆహారంలో చేర్చి ప్రకృతి ప్రియుల్ని, భోజన ప్రియులుగా మార్చేస్తున్నది స్కై ఫుడ్ లేదా స్కై థీమ్డ్ ఫుడ్. టీ, మిల్క్‌షేక్ మొదలుకుని కేకులు, పేస్ట్రీల దాకా అన్నిటా ఈ ట్రెండ్ ఇప్పుడు సందడి చేస్తున్నది.

**రంగు ఇలా**

మన ఆహారంలో సాధారణంగా పసుపు, తెలుపు, ఎరుపు, గులాబీ, ఆకుపచ్చలాంటి రంగులు, వాటి మిశ్రమ వర్ణాలు కనిపిస్తుంటాయి. కానీ నీలం రంగు కనిపించడం కాస్త అరుదనే చెప్పాలి. అయితే స్కై ఫుడ్ ట్రెండ్‌లో మాత్రం ఆకాశనీలపు వర్ణమే ప్రధానం. అందుకోసం షెఫ్‌లు నీలం రంగులో ఉండే శంఖుపూలను, ఆ పూలపొడిని వాడుతున్నారు. దాన్నే బ్లూ మాచా అనీ బటర్ ఫ్లై పీ ఫ్లవర్ పౌడర్ అనీ పిలుస్తున్నారు. ఇది ఆహారానికి ప్రకృతి సిద్ధమైన నీలం రంగును ఇస్తుంది. అలాగే మనం సూపర్ ఫుడ్‌గా చెప్పుకొనే సముద్రనాచు స్పిరులినాతో కూడా ఈ నీలం మ్యాజిక్‌ను చేస్తున్నారు. వీటిని ఎందులో ఎంత మోతాదులో కలుపుతున్నాం, ఏ పదార్థాల్లో కలిపి వాడుతున్నాం అన్నదాన్ని బట్టి నీలంలో లేత నుంచి ముదురు వర్ణాలు వస్తుంటాయి.

%పాలతో లేదా క్రీమ్‌తో కలిపినప్పుడు ఇది అచ్చంగా ఆకాశనీలంలో ఉంటుంది. ఇక మబ్బుల కోసం క్రీమ్, యోగర్ట్‌లాంటి వాటిని, ఆకుపచ్చ రంగు కోసం బెర్రీలు, అవకాడో తదితరాలనూ వాడుతున్నారు. మిల్క్‌షేక్, లాటె తదితరాల్లో మబ్బులు కనిపించడం కోసం పారదర్శక గ్లాసుకు క్రీమ్‌ను మబ్బుల ఆకృతి వచ్చేలా రాసి లోపల సంబంధించిన ద్రవం పోస్తున్నారు. రకరకాల టెక్నిక్‌ల ద్వారా కేక్, పుడ్డింగ్, పేస్ట్రీ, ఐస్‌క్రీమ్ ఇలా అన్నిటిలోనూ మబ్బుల్ని చేర్చి చప్పరించేస్తున్నారు. ఆకాశాన్ని ఆరగించేయాలన్న సరదా ఆలోచన మీకూ వస్తే నెట్టింట్లో బోలెడు రెసిపీలున్నాయి. ఓసారి ట్రై చేసేయండి!

# అంజలి సూద్‌కి హార్వర్డ్ విశ్వవిద్యాలయం

# ఘన గౌరవం

భారత సంతతికి చెందిన అంజలి సూద్‌ను హార్వర్డ్ విశ్వవిద్యాలయం 'బోర్డ్ ఆఫ్ ఓవర్సీర్స్' సభ్యురాలిగా నియమించడంపై నెటిజన్లు ఆసక్తిగా ఉన్నారు. ట్యూబి సీఈఓగా ఉన్న ఆమె, గతంలో ప్రముఖ కంపెనీల్లో కీలకపాత్రలు నిర్వహించారు.

**ఆమె పయనం సమున్నతం**

అంజలి సూద్... భారత సంతతికి చెందిన ఈ అమెరికన్ గురించి ఇప్పుడు నెటిజన్లు తెగ వెతికేస్తున్నారు.కారణం... ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ విశ్వవిద్యాలయం... 'బోర్డ్ ఆఫ్ ఓవర్సీర్స్' (పర్యవేక్షక మండలి) సభ్యురాలిగా ఆమెను ఎంపిక చేయడం.

అమెరికా ఓటీటీ 'ట్యూబి' సీఈఓగా ఉన్న అంజలి... గతంలో వివియో, అమెజాన్ తదితర



ప్రముఖ కంపెనీల్లో ఉన్నత హోదాల్లో పని చేశారు. వ్యాపారాన్ని కొత్త పుంతలు తొక్కించి... లాభాల బాట పట్టించారు.

'విద్యాశక్తి ద్వారా అమ్మానాన్నలు నా గురించి కన్న కలలను నిజం చేశాను. దాన్ని రేపటి తరానికి అందించాలని కోరుకొంటున్నాను' అంటున్న 41 ఏళ్ల అంజలి విజయ ప్రస్థానం ఇది.

అమెరికాలో ప్రస్తుతం అధ్యక్షుడు ట్రంప్ ప్రభుత్వం... హార్వర్డ్ విశ్వవిద్యాలయం మధ్య వివాదం తీవ్రస్థాయికి వెళ్లింది. ఈ తరుణంలో అంజలి వర్సిటీ 'బోర్డ్ ఆఫ్ ఓవర్సీర్స్' సభ్యురాలిగా ఎంపిక కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పదవిలో ఆమె రెండేళ్లు కొనసాగుతారు. 'బోర్డ్ ఆఫ్ ఓవర్సీర్స్'... హార్వర్డ్ రెండో అత్యున్నత పాలకమండలి. లిబరల్ పార్టీ నాయకుడిగా ఎన్నికైన మార్క్ కార్నే బోర్డులో తన సభ్యత్వానికి రాజీనామా చేయడంతో, ఆ ఖాళీని అంజలితో భర్తీ చేసింది వర్సిటీ. ఆమె హార్వర్డ్ పూర్వ విద్యార్థిని కూడా.

**అదే వర్సిటీలో...**

అంజలిది అమెరికాలో స్థిరపడిన పంజాబీ కుటుంబం. డెట్రాయిట్‌లో పుట్టిన ఆమె... ఫ్లింట్ నగరంలో పెరిగారు. పద్నాలుగేళ్ల వయసులో 'ఫిలిప్స్ అండోవర్ అకాడమీ'లో చదివేందుకు మసాచుసెట్స్ వెళ్లారు. 2005లో పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం నుంచి ఫైనాన్స్ అండ్ మేనేజ్‌మెంట్‌లో బీఎస్సీ పూర్తి చేశారు. 2011లో హార్వర్డ్ వర్సిటీ నుంచి ఎంబీఏ పట్టా పొందారు. ఇప్పుడు అదే వర్సిటీ పాలక మండలిలో కీలక బాధ్యతలు చేపట్టారు.

**ఉన్నత హోదాలు...**

బీఎస్సీ అవ్వగానే ఉద్యోగ జీవితంలోకి ప్రవేశించిన అంజలి కెరీర్ వాయు వేగంతో దూసుకుపోయింది. 2005- 2014 మధ్యకాలంలో ఆమె సాజెంట్ అడ్వైజర్స్, టైమ్ వార్నర్, అమేజాన్‌లలో ఫైనాన్స్, మీడియా విభాగాల్లో పని చేశారు. తరువాత 'వివియో' గ్రూప్‌లో గ్లోబల్ మార్కెటింగ్ హెడ్‌గా బాధ్యతలు చేపట్టారు. మూడేళ్లు తిరక్కుండానే ఆ కంపెనీకి సీఈఓ అయ్యారు. అంజలి సారథ్యంలో కంపెనీ కంటెంట్ ప్రొడక్షన్ నుంచి కంటెంట్ క్రియేటర్లకు సాఫ్ట్‌వేర్ టూల్స్ అందించే స్థాయికి ఎదిగింది. ఎన్నడూ చూడని లాభాలను ఆర్జించింది. ప్రత్యక్ష ప్రసారాలకు ఉద్దేశించిన 'లైవ్‌స్ట్రీమ్', వీడియో ఎడిటింగ్ కోసం తెచ్చిన 'మ్యాజిస్టో' యాప్‌లతో పాటు 'వైర్‌మ్యాక్స్, విబ్బిట్జ్' సాఫ్ట్‌వేర్ స్టార్టప్‌లను 'వివియో' సొంతం చేసుకోవడంలో అంజలిదే ప్రముఖ పాత్ర.

**కొత్త బాధ్యతలు...**

తాజాగా హార్వర్డ్ వర్సిటీ బోర్డ్ ఆఫ్ ఓవర్సీర్స్‌కు ఎంపిక కావడంతో తన కల నెరవేరిందంటారు అంజలి. 'మా అమ్మానాన్న నా గురించి ఎన్నో కలలు కన్నారు. విద్యాశక్తి ద్వారా ఆ కలలను నేను సాకారం చేయగలిగాను. దీన్ని తరువాతి తరాలవారికి అందించాలనేది నా సంకల్పం' అంటున్న అంజలి... హార్వర్డ్ అందుకు సరైన వేదికగా భావిస్తున్నారు. అంతేకాదు... ఆమె ప్రస్తుతం 'సిరియస్ ఎక్స్ఎమ్, డోల్బీ లేబరెటరీస'కు బోర్డు మెంబర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. 'చేంజ్ డాట్ ఓఆర్జీ'కి చైర్మన్‌గా ఉన్నారు.

**అందరిలో ఆసక్తి...**

హార్వర్డ్‌లో జరిగిన నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్న విదేశీ విద్యార్థుల సమాచారం ప్రభుత్వానికి ఇచ్చేందుకు వర్సిటీ నిరాకరించడాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా పరిగణిస్తున్నారు. దీంతో అటు వర్సిటీకి, ఇటు ట్రంప్ ప్రభుత్వానికి మధ్య విభేదాలు తలెత్తాయి. ఇలాంటి క్లిష్ట సమయంలో వర్సిటీ పాలక మండలిలో అంజలి కీలక బాధ్యతలు చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆమె కార్యాచరణ ఎలా ఉంటుందనేదానిపై అందరిలో ఆసక్తి నెలకొంది.

**అవార్డులు ఎన్నో...**

ప్రముఖ బిజినెస్ మ్యాగజైన్ 'ఫార్చ్యూన్ 40 అండర్ 40' జాబితాలో చోటు దక్కించుకున్న అంజలి ఎన్నో అవార్డులు, గౌరవ సత్కారాలు అందుకున్నారు. 2019లో ఆమెకు 'న్యూయార్క్ ఉమెన్ ఇన్ ఫిలిమ్ అండ్ టెలివిజన్' అవార్డు లభించింది. గత సంవత్సరం 'ది హాలీవుడ్ రిపోర్టర్' ప్రకటించిన వినోద రంగంలో అత్యంత శక్తివంతమైన మహిళల జాబితాలో అంజలికి చోటు దక్కింది. అంచెలంచెలుగా ఎదుగుతూ కెరీర్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకున్న ఆమె నికర ఆదాయం దాదాపు రూ.73 కోట్లు. ఇదంతా వివిధ కంపెనీలకు అందించిన సేవల ద్వారా పొందిన ప్రతిఫలం. సాధించాలన్న పట్టుదల, బలమైన సంకల్పం ఉంటే ఏ లక్ష్యం పెద్దది కాదని అంజలి నిరూపించారు. కలలను ఛేదించి... భావితరాలకు స్ఫూర్తిమంత్రం అయ్యారు.

**విజయ పరంపర...**

దాదాపు పదేళ్లపాటు వివియో విజయాల్లో భాగస్వామి అయిన అంజలి... 2023లో కంపెనీ నుంచి తప్పుకున్నారు. ఆ వెంటనే ఫాక్స్ కార్పొరేషన్ నుంచి ఆమెకు పిలుపు వచ్చింది. దాని అనుబంధ సంస్థ అయిన 'ట్యూబి' సీఈఓగా బాధ్యతలు చేపట్టారు. అమెరికాలో ఉచితంగా సినిమాలు, టీవీ షోలు అందించే ఓటీటీ వేదిక ఇది. అంజలి చేరికతో కంపెనీ గ్రాఫ్ అమాంతం పెరిగిపోయింది. నెలకు దాదాపు పది కోట్ల మంది దీన్ని ఉపయోగిస్తున్నారంటే... అందులో ఆమె కృషి గురించి ప్రధానంగా చెప్పుకోవాలి.

– సహాయ

# రుచికి తోడు అందం - శాండ్‌విచ్‌లలో కొత్త శైలి



**మనం సాధారణంగా శాండ్‌విచ్‌లు చేసుకుని తింటూ ఉంటాం. ఇంటికి అతిథులు వచ్చినప్పుడు మాత్రం వాటిని అందంగా రూపొందించి చక్కగా పళ్లెంలో అమర్చాలని అనుకుంటాం. చూడగానే ఆకట్టుకునేలా శాండ్‌విచ్‌లను ఎలా తయారుచేయాలో తెలుసుకుందాం...**


ఒక బ్రెడ్‌ను తీసుకుని రెండు త్రిభుజాకారపు ముక్కలుగా కోయాలి. రెంటినీ ఒకదాని పక్కన మరోదాన్ని కాస్త ఎడంగా పెట్టాలి. వీటిపైన పాలకూర ఆకును పెట్టాలి. దీనిమీద టమాటా ముక్కలు, ఛీజ్ తురుం, కొత్తిమీర చీలికలు, ఇతర కూరగాయల ముక్కలు (కేరట్, కీరా, బీట్‌రూట్ లాంటివి) అమర్చాలి.

ఈ రెండు త్రిభుజాకారపు బ్రెడ్ ముక్కలను ఒకదానితో మరోదాన్ని మూసివేయాలి. లోపల ఉన్న కూరగాయల ముక్కలు పడిపోకుండా జాగ్రత్త తీసుకోవాలి. ఒక పొడవాటి ప్లాస్టిక్ కవర్‌తో ఈ రెండు ముక్కలను కలిపి చుట్టాలి.

ఒక శాండ్‌విచ్ పేపర్‌ను తీసుకుని పొడవాటి దీర్ఘచతురస్రాకారంలో కత్తిరించాలి. ఈ పేపర్‌తో ముందుగా తయారుచేసుకున్న శాండ్‌విచ్‌ను కోన్ మాదిరి చుట్టాలి. తరవాత ఒక పళ్లెంలో జాగ్రత్తగా పెట్టాలి. శాండ్‌విచ్ పేపర్‌మీద సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఏదైనా రాయవచ్చు.పళ్లెంలో ఖాళీ ఉన్నట్లయితే కూరగాయల ముక్కలను అందమైన ఆకృతుల్లో పేర్చవచ్చు. అవసరమైతే మొలకలు, డ్రైఫ్రూట్స్ కూడా చేర్చవచ్చు.



# ఎండుద్రాక్ష నీళ్ల మాయాజాలం





**డ్రైఫ్రూట్స్ ఆరోగ్యానికి చాలా మంచివి. అందుకే చాలామంది ఉదయాన్నే నానబెట్టిన బాదం, ఎండుద్రాక్ష తింటుంటారు. అయితే పరగడుపున నల్ల ఎండుద్రాక్ష నీళ్లను తాగడం వలన కూడా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. అవేంటో తెలుసుకుందాం..**

ఈ నీళ్లలో ఫైబర్ ఉంటుంది. అది అజీర్తి సమస్యలను దూరం చేస్తుంది.

ఈ నీళ్లలోని పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది.

ఈ నీళ్లలో సహజసిద్ధంగా ఉండే చక్కెర, కార్బోహైడ్రేట్లు శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి.

ఈ నీటిలో ఐరన్, విటమిన్ బి కాంప్లెక్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తహీనత దరిచేరకుండా చేస్తాయి.

ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు, పొటాషియం బీపీని నియంత్రిస్తాయి. చెడు కొలెస్ట్రాల్‌ను తగిస్తాయి. దాంతో గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.

ఈ నీళ్లలో ఉండే విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌ను తటస్థీకరించి చర్మ సమస్యలను దూరం చేస్తాయి

10- 15 నల్ల ఎండు ద్రాక్షలను తీసుకుని నీళ్లతో బాగా కడిగాలి. ఇప్పుడు వాటిని ఓ గ్లాసుడు మంచి నీళ్లలో వేసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయం పరగడుపున ఆ నీటిని తాగేయాలి. నానబెట్టిన ఎండుద్రాక్షలను కూడా తినేయవచ్చు.

# నవ బిజినెస్




## లాభాల్లో స్టాక్ మార్కెట్లు.. ఈ రోజు టాప్ స్టాక్స్ ఇవే..



**ముంబై-నవభూమి:** గత వారం భారీ నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు ఈ వారాన్ని సానుకూలంగా ప్రారంభించాయి. గత వారం వరుస నష్టాలతో 80 వేల దిగువకు పడిపోయిన సెన్సెక్స్ ఈ రోజు మళ్లీ కోలుకుంది. కనిష్టాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో సెన్సెక్స్ మళ్లీ 80 వేల మార్క్‌ను దాటింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపు విషయంలో గుడ్ న్యూస్ వచ్చే అవకాశం ఉందన్న వార్తలు వస్తుండడం కాస్త సానుకాలాంశంగా కనిపిస్తోంది. దీంతో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ లాభాల బాటలో ఉన్నాయిగత శుక్రవారం ముగింపు (79, 857)తో పోల్చుకుంటే సోమవారంవారం ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింత పైకి ఎగబాకింది. పలు రంగాలు లాభాల్లో సాగుతున్నాయి. ప్రస్తుతం ఉదయం 10:150 గంటల సమయంలో సెన్సెక్స్ 196 పాయింట్ల లాభంతో 80, 054 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 61 పాయింట్ల లాభంతో 24, 425 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్‌లో భారత్ డైనమిక్స్, సోలార్ ఇండస్ట్రీస్, అశోక్ లేలాండ్, మాజగాన్ డాక్, టాటా మోటార్స్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. పీజీ ఎలక్ట్రోప్లాస్ట్, అంబర్ ఎంటర్‌ప్రైజెస్, వోల్టాస్, పీఐ ఇండస్ట్రీస్, ఎల్ఐసీ ఇండియా షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 210 పాయింట్ల లాభంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 265 పాయింట్ల లాభంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 87.52గా

## ఈ తేదీకి ముందే ఐటీఆర్ దాఖలు చేయండి- ఆలస్య రుసుం తప్పించుకోండి




**న్యూఢిల్లీ-నవభూమి:** మళ్లీ ఆగస్టు నెల వచ్చేసింది. అంటే ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేసే సమయం మళ్లీ వచ్చేసినట్లే. ప్రతి పన్ను చెల్లించే వ్యక్తి తన ఆదాయం, పెట్టుబడులు, మినహాయింపులు, ఖర్చులు మొదలైనవి సరిగ్గా చూపిస్తూ, పన్ను విభాగానికి నివేదిక ఇవ్వాల్సిన బాధ్యత ఉంది. ఇది కేవలం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాదు, భవిష్యత్తులో అనేక ఆర్థిక ప్రయోజనాలను పొందేందుకు కీలకమైనది. అయితే ఈసారి దాఖలులో కొన్ని ముఖ్యమైన మార్పులు, శ్రద్ధ వహించాల్సిన అంశాలు ఉన్నాయి. వాటిని పట్టించుకోకపోతే జరిమానాలు, జాప్యాలు ఎదురయ్యే అవకాశం ఉంది. ఆ విశేషాలేంటో ఇక్కడ చూద్దాం.

మీ ఆదాయం లేదా జీతం నిర్దేశిత పరిమితిని మించితే.
భారత్‌లో లేదా విదేశాల్లో ఆస్తులు కలిగి ఉంటే.
షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు ఉంటే.
బ్యాంక్ డిపాజిట్లు రూ . 50 లక్షలకు మించితే.
సేవింగ్స్ లేదా కరెంట్ ఖాతాల్లో రూ.1 కోటి కంటే ఎక్కువ ఉంటే.
ఏడాదిలో విద్యుత్ బిల్లు రూ. 1 లక్షకు మించితే.
విదేశీ పర్యటనలకు రూ.2 లక్షలకు మించి ఖర్చు చేసి ఉంటే.
ఆదాయంతో సంబంధం లేకుండా విక్రయాల విలువ రూ.60 లక్షలకు మించితే

**ముందుగా ఏం సిద్ధం చేసుకోవాలి?**

దాఖలు చేయడానికి ముందు కొన్ని పత్రాలు సిద్ధంగా ఉంచుకోండి:
ఫారం 16: ఈ ఏడాది లేదా గతంలో ఉద్యోగం మారినట్లయితే రెండు కంపెనీల నుంచి సేకరించుకోవాలి
పాన్ కార్డ్, ఆధార్ కార్డ్: ఈ రెండూ లింక్ అయి ఉండాలి.
పెట్టుబడి రుజువులు: బ్యాంక్ డిపాజిట్లు, , ఇన్సూరెన్స్ ప్రీమియం రసీదులు, హెూమ్ లోన్ ఇంటరెస్ట్ సర్టిఫికేట్ వంటివి.
ఈ-వెరిఫికేషన్: రిటర్న్ దాఖలు చేసిన తర్వాత 30 రోజుల్లో ఈ-వెరిఫికేషన్ పూర్తి చేయాలి. లేకపోతే, రిఫండ్ ఆలస్యం కావచ్చు.
ఈ-వెరిఫికేషన్ కోసం ఆధార్ , నెట్ బ్యాంకింగ్, లేదా ప్రీ-వాలిడేటెడ్ బ్యాంక్/డీమ్యాట్ ఖాతా ద్వారా ఉపయోగించవచ్చు.
2024-25 ఆర్థిక సంవత్సరం (అసెస్‌మెంట్ ఇయర్ 2025-26) కోసం %ఋ=% దాఖలు చేయడానికి ఆఖరి తేదీ సెప్టెంబర్ 15, 2025. ఇది జులై 31, 2025 నుంచి పొడిగించబడింది. కాబట్టి, ఈ తేదీని గుర్తుంచుకోండి.

**గడువు తేదీ మిస్ అయితే ఏం చేయాలి?**

సెప్టెంబర్ 15 గడువు మిస్ అయినా, డిసెంబర్ 31, 2025 వరకు ఆలస్య రిటర్న్ దాఖలు చేయవచ్చు. కానీ, ఆలస్య రుసుమును చెల్లించాల్సి ఉంటుంది. మీ ఆదాయం రూ. 5 లక్షలకు మించితే, గరిష్టంగా రూ.5,000 వరకు జరిమానా విధిస్తారు. ఆదాయం రూ. 5 లక్షలు లేదా అంతకంటే తక్కువ ఉంటే, గరిష్టంగా రూ. 1,000 జరిమానా ఉంటుంది. ఆలస్య రిటర్న్‌లు కొన్ని పన్ను మినహాయింపులను కోల్పోవచ్చు. ఆదాయపు పన్ను శాఖ నుంచి ఎక్కువ పరిశీలనకు గురవుతాయి. కాబట్టి, సమయానికి దాఖలు చేయడం బెస్ట్.


## బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..

**న్యూఢిల్లీ-నవభూమి:** అంతర్జాతీయంగా నెలకొన్ని అనిశ్చితుల కారణంగా పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గ చూపుతుండడం బంగారం ధరల పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (ఆగస్టు 11న) ఉదయం 6.30 గంటల సమయానికి పలు నగరాల్లో బంగారం ధర ఎలా ఉందో తెలుసుకుందాం..

భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గ చూపుతుండడంతో బంగారం ధరలు మళ్లీ ఆల్‌టైమ్ గరిష్టం వద్ద ట్రేడ్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ రోజు (ఆగస్ట్ 11న) 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 03, 030కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 94, 440కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే బంగారం ధర స్వల్పంగా తగ్గింది.

ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 03, 180కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 94, 590కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 03, 030కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 94, 440కి చేరింది. వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే వంద రూపాయల మేర తగ్గాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు (10 గ్రాములకు) (24 క్యారెట్, 22 క్యారెట్)
హైదరాబాద్‌లో రూ. 1, 03, 030, రూ. 94, 440
విజయవాడలో రూ. 1, 03, 030, రూ. 94, 440
ఢిల్లీలో రూ. 1, 03, 180, రూ. 94, 590
ముంబైలో రూ. 1, 03, 030, రూ. 94, 440
వడోదరలో రూ. 1, 03, 080, రూ. 94, 490
కోల్‌కతాలో రూ. 1, 03, 030, రూ. 94, 440
చెన్నైలో రూ. 1, 03, 030, రూ. 94, 440
బెంగళూరులో రూ. 1, 03, 030, రూ. 94, 440
కేరళలో రూ. 1, 03, 030, రూ. 94, 440
పుణెలో రూ. 1, 03, 030, రూ. 94, 440
ప్రధాన నగరాల్లో వెండి ధరలు (కేజీకి)
హైదరాబాద్‌లో రూ. 1, 26, 900
విజయవాడలో రూ. 1, 26, 900
ఢిల్లీలో రూ. 1, 16, 900
చెన్నైలో రూ. 1, 26, 900
కోల్‌కతాలో రూ. 1, 16, 900
కేరళలో రూ. 1, 26, 900
ముంబైలో రూ. 1, 16, 900



## ఎయిరిండియా బంపరాఫర్.. రూ. 1499 కే ఫ్లైట్ టికెట్.. ఆఫర్ మరో 5 రోజులే!





**ముంబై-నవభూమి:** జీవితంలో ఒక్కసారైనా విమానం ఎక్కాలని.. అలా గాల్లో విహరించాలని కలలు గనేవారు ఎందరో. కానీ టికెట్ ధరల్ని చూసి ఆదిలోనే ఆగిపోతుంటారు. అంటే విమాన ప్రయాణం ధనవంతులకే అన్నట్లు మారిపోయింది. అంత ఖర్చు పెట్టి విమానంలో పోయే బదులు.. ఏ బస్సో, ట్రైనో ఎక్కితే చాలా మిగులుతుందని భావించే వారు చాలా మందే ఉంటారు. అందుకే.. ఇలాంటి వారిని దృష్టిలో పెట్టుకొని ఇటీవల పలు విమానయాన సంస్థలు.. ముఖ్యంగా న్యూ ఇయర్, రిపబ్లిక్ డే, ఇండిపెండెన్స్ డే, క్రిస్మస్, హెూలీ ఇలా ప్రత్యేక సందర్భాల్లో తక్కువ ధరలకే విమాన టికెట్లను ఆఫర్ చేస్తున్నాయి. పరిమితి కాలం మాత్రమే అందుబాటులో ఉండే ఈ ఆఫర్‌తో సామాన్యులకు కూడా విమానయానం అందిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఇప్పుడు భారత స్వాతంత్ర్య దినోత్సవం వేళ.. దిగ్గజ ఎయిర్‌లైన్స్‌లో ఒకటైన ఎయిరిండియా.. బంపర్ ఆఫర్ ప్రకటించింది. నమస్తే వరల్డ్ ప్రమోషనల్ సేల్ తీసుకొచ్చింది. దీని కింద దేశీయంగా, అంతర్జాతీయంగా చాలా తక్కువ ధరలకే విమాన ప్రయాణం కల్పిస్తోంది. దీని కింద దేశీయ రూట్లలో వన్ వే ఫేర్స్ కనీసం రూ. 1499 నుంచే ప్రారంభం అవుతున్నాయి. చాలా వరకు కాస్త దూర ప్రాంతాలకు, అంటే రాజధానుల మధ్య కూడా బస్ టికెట్ ధరలు ఇదే స్థాయిలో ఉంటాయని చెప్పొచ్చు. కొన్ని బస్సుల్లో ఇది ఇంకాస్త ఎక్కువే ఉంటుంది. ఇక ఇంటర్నేషనల్ రూట్లలో రౌండ్ ట్రిప్ ఫేర్స్ రూ. 12,310 నుంచి ప్రారంభమవుతున్నట్లు పేర్కొంది.

ట్యాక్స్ పేయర్లకు అలర్ట్.. ఈ తేదీలోపుఫైల్ చేయకపోతే ఫైన్.. ఈ విషయాలు తెలుసుకోండి

2025, ఆగస్ట్ 10 నుంచే ఈ ఆఫర్ ఎయిరిండియా వెబ్‌సైట్, యాప్‌లోకి అందుబాటులోకి రానుందని స్పష్టం చేసింది. సేల్ పీరియడ్ విషయానికి వస్తే ఆగస్ట్ 10 నుంచి 15 లోపల టికెట్లు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడు టికెట్లు బుక్ చేసుకున్న వారు 2025, ఆగస్ట్ 10 నుంచి 2026 మార్చి 31 వరకు ఎప్పుడైనా ప్రయాణం చేయొచ్చు. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ బేసిస్‌ను టికెట్లు కేటాయిస్తారు. ఎంపిక చేసిన రూట్లకు ఈ ఆఫర్ వర్తిస్తుంది. అంటే ఇప్పుడు దసరా, దీపావళి, క్రిస్మస్ పండగలు సహా ఇయర్ ఎండ్, న్యూ ఇయర్ ఇలాంటి సమయాల్లో దూర ప్రాంతాలకు వెళ్లాలనుకునే వారికి ఇది బెటర్ అని చెప్పొచ్చు.౧౧ ముఖ్యంగా ఎయిరిండియా వెబ్‌సైట్, యాప్ ద్వారా టికెట్లు బుక్ చేసుకున్న వారికి ఎలాంటి కన్వీనియెన్స్ ఫీజు ఉండదు. ఇంకా ఇక్కడ ప్రత్యేకంగా బ్యాంక్ ఆఫర్స్ కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పొచ్చు.

వీసా కార్డు ఉన్న వారు.. ప్రోమో కోడ్ అప్లై చేయడం ద్వారా దేశీయ రూట్లలో వన్ వే కోసం ఫ్లాట్ రూ. 250 తగ్గింపు పొందొచ్చు. ఇంకా రౌండ్ ట్రిప్ కోసం రూ. 500 డిస్కౌంట్ పొందొచ్చు. ఇంటర్నేషనల్ వన్ వే లో రూ. 1500 వరకు డిస్కౌంట్ ఉంది. ఇక్కడ రౌండ్ ట్రిప్ కోసం అయితే రూ. 2500 వరకు డిస్కౌంట్ అందుబాటులో ఉంది. పూర్తి వివరాల కోసం ఎయిరిండియా అధికారిక వెబ్‌సైట్ చూడొచ్చు.

## ధర 2 రూపాయల్లోపే.. వరుసగా 20వ సెషన్‌లోనూ అప్పర్ సర్క్యూటే.. కాసుల పంట!



**ముంబై-నవభూమి:** స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవని చెప్పొచ్చు. ఏ స్టాక్ ఎప్పుడు పెరుగుతుందో ముందుగానే ఊహించడం కష్టమే. ఆయా కంపెనీల పనితీరు, ఫలితాలు, పెట్టుబడి వ్యూహాలు, ఇతర ఎన్నో అంశాలు స్టాక్ కదలికలో దోహదం చేస్తుందని చెప్పొచ్చు. ఇక స్టాక్ మార్కెట్లు కూడా గత కొంత కాలంగా తీవ్ర ఒడుదొడుకుల్లో ట్రేడవుతున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న దిగుమతి సుంకాలే మార్కెట్లో అనిశ్చితికి కారణంగా తెలుస్తోంది. దీంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తూ పెద్ద మొత్తంలో షేర్లను విక్రయిస్తున్నారు. గత కొద్ది రోజులుగా తీవ్ర ఒడుదొడుకుల్లో ట్రేడైన స్టాక్ మార్కెట్లు ఎట్టకేలకు సోమవారం సెషన్‌లో పుంజుకున్నాయి. ప్రస్తుతం లాభాల్లో కొనసాగుతున్నాయి. వార్త రాసే సమయంలో మధ్యాహ్నం ఒంటి గంటకు బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ సెన్సెక్స్ 300 పాయింట్లకుపైగా పెరిగి 80,170 మార్కు వద్ద కదలాడుతోంది. ఇదే సమయంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ నిఫ్టీ చూస్తే 100 పాయింట్ల లాభంతో 24,450 మార్కు వద్ద ట్రేడవుతోంది. ఇక్కడ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్న క్రమంలో మనం ఒక పెన్నీ స్టాక్ గురించి చూద్దాం. ఇది వరుసగా పెరుగుతూ ఇన్వెస్టర్లకు అదిరిపోయే లాభాల్ని అందిస్తోంది. ఏకంగా వరుసగా 20వ సెషన్‌లోనూ ఇది అప్పర్ సర్క్యూట్ కొట్టిందంటనే అర్థం చేసుకోవచ్చు. అదే అవాన్స్ టెక్నాలజీస్ లిమిటెడ్ స్టాక్. ఈ పెన్నీ స్టాక్ ధర 2 రూపాయల్లోపే ఉండటం గమనార్హం. కిందటి సెషన్‌లో ఇది రూ. 1.53 వద్ద క్లోజ్ కాగా.. ఇవాళ (సోమవారం) నేరుగా 2 శాతం అప్పర్ సర్క్యూట్‌తో రూ. 1.56 వద్ద ఓపెన్ అయింది. అక్కడే స్థిరపడింది. ఇక ఇదే ఈ స్టాక్ 52 వారాల గరిష్ట ధర కావడం విశేషం. స్టాక్ 52 వారాల కనిష్ట ధర చూస్తే రూ. 0.52 గానే ఉంది. కంపెనీ మార్కెట్ విలువ ప్రస్తుతం రూ. 309.18 కోట్లుగా ఉంది. ఈ స్టాక్ గత 20 రోజులుగా రోజూ 2 శాతం చొప్పున అప్పర్ సర్క్యూట్ కొడుతూ వచ్చింది. ఇక గత 30 ట్రేడింగ్ సెషన్లలో చూస్తే ఏకంగా 81 శాతం పెరగడం విశేషం. ఇక ఇటీవలే ఈ కంపెనీ తొలి త్రైమాసిక ఫలితాల్ని ప్రకటించేందుకు బోర్డ్ మీటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. ఆగస్ట్ 14న ఫలితాలు వెల్లడికానుండగా.. మంచి లాభాల్ని నమోదు చేస్తుందని ఆశిస్తున్నారు. దీనికి తోడు ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా నిధుల్ని సమీకరించేందుకు కూడా ప్లాన్ చేయనున్నట్లు కంపెనీ ఎక్స్ఛేంజి ఫైలింగ్‌లో వెల్లడించింది. దీంతో ఈ షేర్లు కొనుగోలు చేసేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపిస్తున్నారు. గత 6 నెలల్లో చూస్తే ఈ స్టాక్ 113 శాతం పెరిగింది. ఐదేళ్లలో ఏకంగా 3 వేల శాతానికిపైగా రిటర్న్స్ అందించింది.

### నీతా అంబానీ సొంతమైన అత్యంత ఖరీదైన

## 'ఊసరవెల్లి' కారు.. కళ్లు చెదిరే ఫీచర్లు!




**న్యూఢిల్లీ-నవభూమి:** రిలయన్స్ ఇండస్ట్రీ అధినేత ముకేశ్ అంబానీ ఆసియాలోకెల్లా అత్యంత సంపన్నుడిగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ముకేశ్ అంబానీ కుటుంబం దగ్గర ఇప్పటికే బోలెడన్ని ఖరీదైన కార్లు ఉన్నాయి. తాజాగా ముకేశ్ సతీమణి నీతా అంబానీ దేశంలోనే అత్యంత ఖరీదైన కారును కొనుగోలు చేశారు. రూ.100 కోట్ల విలువైన ఆడి 9 కమీలియన్ కారును నీతా సొంతం చేసుకున్నారు. ఆడి 9 కమీలియన్ మోడల్ కార్లు ప్రపంచంలో 11 మాత్రమే ఉండటం విశేషం. అంటే ప్రపంచంలోని అత్యంత ఎలైట్ క్లబ్‌లో నీతా అంబానీ చోటు దక్కించుకున్నారు. ఈ కారుకు బోలెడన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. పేరుకు తగ్గట్టుగానే ఈ కారు ఊసరవెల్లిలా రంగులు మార్చగలదు. సింగిల్ బటన్ క్లిక్‌తో ఈ కారు రంగు మారిపోతుంది. సింగిల్ పీస్ రూఫ్, విండ్ స్క్రీన్ కారణంగా ఈ కారు స్పేస్ షిప్ తరహాలో కనిపిస్తుంది. ఆడి ఏ9 కమీలియన్ కారులోని 4.0 లీటర్ వీ8 ఇంజిన్ 600 హార్స్‌పవర్‌ను ప్రొడ్యూస్ చేస్తుంది. ఈ వాహనంలో కటింగ్ ఎడ్జ్ ఫీచర్లు ఉన్నాయి. ఆడి ఏ9 కారు గరిష్టంగా గంటకు 250 కి.మీ. వేగంతో ప్రయాణించగలదు. స్టార్ట్ చేసిన మూడున్నర సెకన్లలోనే వంద కి.మీ. వేగాన్ని అందుకోగలదు. దీనికి పూర్తి ఎలక్ట్రానిక్‌గానే పెయింట్ వేశారు. కొడుకు ఎంగేజ్‌మెంట్ పార్టీలో డ్యాన్స్‌తో అదరగొట్టిన నీతా అంబానీనీతా అంబానీ దగ్గర ఇప్పటికే బోలెడన్ని లగ్జరీ కార్లు ఉన్నాయి. అంబానీ ఫ్యామిలీకి రోల్స్ రాయిస్ బ్రాండ్ అంటే చాలా ఇష్టం. రూల్స్ రాయిస్ ఫాంటమ్, కల్లినన్, ఘోస్ట్ మోడల్స్ వారి దగ్గర ఉన్నాయి. కల్లినన్ కారు పెయింటింగ్ కోసమే అంబానీ ఫ్యామిలీ గతంలో కోటి రూపాయలు ఖర్చు చేసినట్లు సమాచారం. మెర్సిడెస్ మేబాచ్ ఎస్600 గార్డ్, ఫెరారీ 812 సూపర్ ఫాస్ట్, బెంట్లీ కాంటినెంటల్ ఫ్లయింగ్ స్పర్, బీఎండబ్ల్యూ 7 సిరీస్ 760లి సెక్యూరిటీ తదితర ఖరీదైన కార్లు సైతం నీతా అంబానీ దగ్గర ఉన్నాయి. ముంబైలోని ముకేశ్ అంబానీ నివాసమైన యాంటిలియాలో.. ఆరు అంతస్తుల్లో కార్లను పార్కింగ్ చేస్తారు. యాంటిలియాలో ఒకేసారి 168 కార్లను పార్కింగ్ చేసే సౌలభ్యం ఉంది. ముకేశ్ ఫ్యామిలీ దగ్గర ఖరీదైన కార్లతోపాటు వారి సెక్యూరిటీ సిబ్బంది కోసం కూడా హై ఎండ్ ఎస్‌యూవీలను ఉపయోగిస్తుంటారు. నీతా అంబానీ పుట్టిన రోజు సందర్భంగా.. 2007లోనే ముకేశ్ అంబానీ ఆమెకు దాదాపు రూ.240 కోట్ల విలువైన ప్రయివేట్ జెట్‌ను బహుమతిగా ఇచ్చారు. ఆమె ఒక సందర్భంలో రూ.40 లక్షల విలువైన చీర ధరించారు. వజ్రాలు, రత్నాలు పొదిగి ఉన్న ఈ చీరకు బంగారు జరీ అంచు ఉండటం విశేషం. ఆమె దగ్గర లూయిస్ విట్టన్, సెలైన్, ఎర్మెస్ బిర్కిన్ లాంటి లగ్జరీ బ్రాండ్ల హ్యాండ్ బ్యాగ్‌లు ఉన్నాయి. బిర్కిన్ హ్యాండ్ బ్యాగ్ విలువే రూ.2.6 కోట్లు కావడం గమనార్హం. నీతా అంబానీ దగ్గర ఖరీదైన పర్సనలైజ్డ్ లిప్‌స్టిక్‌లు, లగ్జరీ గడియాలు, ఆభరణాలు ఎన్నో ఉన్నాయి. ఎంతో మందికి ఆమె ఉచితంగా వైద్య సేవలు అందిస్తోన్న సంగతి తెలిసిందే.

## హైదరాబాద్‌లో జెడ్‌ఎస్ కార్యాలయం ఏర్పాటు

■ భారతదేశంలో కార్యకలాపాల విస్తరణను బలోపేతం చేసుకున్న జెడ్‌ఎస్

**హైదరాబాద్-నవభూమి:** 2025- గ్లోబల్ మేనేజ్‌మెం ట్ కన్సల్టింగ్, టెక్నాలజీ సంస్థ నేడు హైదరాబాద్‌లో తన నూతన కార్యాలయాన్ని ప్రారంభించామని ప్రకటించింది. ఇది సుమారు 50,000 చ.అడుగుల విస్తీర్ణంలోని సదుపాయాలతో 550-600 మందికి వసతి కల్పిస్తుంది. ఇది వినియోగదారులకు ఎక్కువ సామర్థ్యాన్ని, ఎండ్-టు-ఎండ్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఆఫర్లను అందించేందుకు, తన నిబద్ధతలో భాగంగా విస్తృత వ్యూహంతో దీన్ని ప్రారంభించింది. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల కోసం రూపొందించిన ప్యాకేజ్డ్ ఆఫర్‌లు, ఎంబెడెడ్ ఫంక్షనల్ నైపుణ్యం, పూర్తిగా నిర్వహించే సర్వీస్ మోడళ్లతో సహా పలు రకాల సౌకర్యవంతమైన ఎంగేజ్‌మెంట్ మోడల్‌ళ్లను ఈ కేంద్రం అందిస్తూనే ఉంటుంది.

భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ హబ్‌లలో ఒకటిగా, ముఖ్యంగా ఆరోగ్య సంరక్షణ, లైఫ్ సైన్సెస్‌లో హైదరాబాద్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. అభివృద్ధి చెందుతున్న తన నాలెడ్జ్ హబ్, సాంకేతిక పర్యావరణ వ్యవస్థ, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ కార్యకలాపాలకు, అభివృద్ధి చెందుతున్న వారి అవసరాలకు మద్దతు ఇవ్వడానికి, సాంకేతిక కార్యకలాపాలు, విశ్లేషణలు డేటా ఇంజనీరింగ్‌లో అత్యంత ప్రత్యేకత కలిగిన నాణ్యమైన ప్రతిభను అందిస్తుంది. ఈ నూతన కార్యాలయం వారి కార్యకలాపాల లైఫ్ సైకిల్ వ్యాప్తంగా గ్లోబల్ భాగస్వాములకు అనుకూలీకరించిన, విభిన్నమైన, అధిక-ప్రభావాన్ని




చూపించే పరిష్కారాలను అందించేందుకు మెరుగైన అవకాశాలను కల్పిస్తుంది.

"గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌లు జారీ కేంద్రాల నుంచి ఆవిష్కరణ, సాంకేతిక కేంద్రాలుగా అభివృద్ధి చెందుతున్నాయి. తాజాగా ఈ పరిశ్రమల వ్యాప్తంగా మార్పుకు మద్దతు ఇవ్వడానికి సుస్థితిలో ఉందని ప్రాంతీయ, ప్రధాన మేనేజింగ్ అధికారి మోహిత్ సూద్ తెలిపారు. దీర్ఘకాలిక, సంస్థల వ్యాప్తంగా ప్రభావం కోసం దృఢమైన పునాది, వృద్ధి చేసిన కార్యకలాపాలు, భవిష్యత్తుకు అవసరమైన నిరూపిత సామర్థ్యాలను నెలకొల్పేందుకు మేము గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌లతో భాగస్వామ్యం కలిగి ఉన్నాము. కొత్త కార్యాలయం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ వినియోగదారులకు ప్రత్యేక విలువ, ఆవిష్కరణ, ఎండ్-టు-ఎండ్ సేవా సమర్పణలకు అందిస్తుంది. ఈ అంశాలన్నీ హైదరాబాద్‌లో మా ఉనికిని ఒక ఏడాది లోపు, మా వ్యూహాత్మక విస్తరణకు బాటలు వేయనున్నాయి. ఈ ప్రయత్నం బలమైన, దీర్ఘకాలిక క్లయింట్ భాగస్వామ్యాలను నిర్మించడం, స్థానిక ప్రతిభను ఉపయోగించడం, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ పర్యావరణ వ్యవస్థకు దోహదపడటంలో మా వృద్ధిని, నిబద్ధతను నొక్కి చెబుతుంది" అని వివరించారు.

మేము 40 ఏళ్లకు సుదీర్ఘ పరిశ్రమ అనుభవం, డేటా, కృత్రిమ మేధస్సులో దృఢమైన నైపుణ్యంతో, ఆరోగ్య సంరక్షణ, లైఫ్ సైన్సెస్‌లో పోటీతత్వాన్ని కలిగి ఉంది. అదే విధంగా బలమైన పునాదులను నిర్మించడం, ఆపరేటింగ్ నమూనాలను రూపొందించడం, సాంకేతికత-ఆధారిత పరివర్తనను ప్రారంభించడం ద్వారా కొత్త, నెలకొల్పిన మద్దతు ఇస్తుంది. కొత్త కేంద్రాల కోసం, వ్యాపార కేసులు, విజయ కొలమానాలు, పరివర్తన రోడ్‌మ్యాప్‌లను నిర్వచించడం ద్వారా విలువను వేగవంతం చేస్తుంది.


## 6 సెషన్లలో రూ.18000 కోట్లు



**న్యూఢిల్లీ-నవభూమి:** అమెరికా-ఇండియా వాణిజ్య ఉద్రిక్తతలు ఈక్విటీ మార్కెట్‌పై తీవ్ర ప్రభా వం చూపుతున్నాయి. వర్తమాన ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో కార్పొరేట్ కంపెనీల ఫలితాలు కూడా నిరాశావహంగా ఉండ డం, ఫారెక్స్ మార్కెట్లో రూపాయి బలహీనత వంటి పరిణామాలు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లను (ఎఫ్‌పీఐ) నిధుల ఉపసంహరణకు పురి గొల్పుతున్నాయి. ఫలితంగా ఎఫ్‌పీఐలు ఆగస్టు నెలలో ఇంతవరకు అంటే కేవ లం ఆరు ట్రేడింగ్ సెషన్లలో రూ.18,000 కోట్ల మేరకు ఈక్విటీలను విక్రయించారు. దీంతో 2025 సంవత్సరంలో ఇప్పటివరకు వారు తరలించుకుపోయిన నిధుల పరిమాణం రూ.1.13 లక్షల కోట్లకు చేరింది. డిపాజిటరీల వద్ద ఉన్న సమాచారం ప్రకారం జూలై నెలలో వారు నికరంగా రూ.17,741 కోట్లు తరలించుకుపోగా ఈ నెల 8వ తేదీ నాటికే నికరంగా రూ.17,924 కోట్లు ఉపసంహరించారు. మార్చి నుంచి జూన్ నెలల మధ్య కాలంలో వారు రూ.38,673 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. అయితే ప్రస్తుతం ఎఫ్‌పీఐల సెంటిమెంట్ చాలా బలహీనంగా ఉన్నదని, వారు ఏ మాత్రం రిస్క్ భరించే స్థితిలో లేరని ఏంజెల్‌వన్ సీనియర్ ఫండమెంటల్ అనలిస్ట్ వకర్ జావేద్ ఖాన్ అన్నారు. ప్రధానంగా భారతీయ ఉత్పత్తులపై అమెరికా రెండు దశల్లో 50్ణ సుంకాలు విధించడం సెంటిమెంట్‌పై అధిక ప్రభావం చూపిందని అంటున్నారు. అమెరికన్ ట్రెజరీ రాబడులు మెరుగ్గా ఉండడం విదేశీ ఇన్వెస్టర్లను ఆకర్షిస్తున్న అంశమని ఖాన్ చెప్పారు. పబ్లిక్ ఇష్యూకి రావాలన్న ఆలోచనను భారత్ పే ప్రస్తుతానికి వాయిదా వేసుకుంది. మార్కెట్ పరిస్థితులు చక్కబడిన తర్వాత మాత్రమే లిస్టింగ్ చేయాలనుకుంటున్నట్టు తెలిపింది. ఈ లోగా అవసరం మేరకు ఇతర మార్గాల ద్వారా నిధులు సమీకరించాలని భావిస్తున్నట్టు కంపెనీ సీఈఓ నళిన్ నేగి చెప్పారు. తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను నిర్దేశిత సమయం కన్నా ముందుగానే సాధించామని ఆయన అన్నారు.

19న రెండు ఐపీఓలు..షిప్పింగ్, లాజిస్టిక్ సొల్యూషన్లు అందించే శ్రీజి షిప్పింగ్ గ్లోబల్, సూపర్ మార్కెట్ చెయిన్ పటేల్ రిటైల్ ఈ నెల 19న (వచ్చే మంగళవారం) పబ్లిక్ ఇష్యూలు జారీ చేయనున్నాయి. 21న రెండు ఇష్యూలు ముగుస్తాయి. ఇష్యూలో షేర్ల ధర శ్రేణిని రెండు కంపెనీలు సోమవారం ప్రకటించనున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 44 పబ్లిక్ ఇష్యూలు జారీ అయ్యాయి. బ్లూస్టోన్ జువెలరీ, లైఫ్‌స్టైల్ ఇష్యూలు సోమవారం, ఆగ్రో ఆధారిత సంస్థ రీగల్ రీసోర్సెస్ ఇష్యూ మంగళవారం ప్రారంభం కానున్నాయి.

## నెక్సాకు పదేళ్లు ప్రారంభ ధర రూ.11.42 లక్షలు





**న్యూఢిల్లీ-నవభూమి:** మారుతి నెక్సా షోరూమ్‌ల నెట్‌వర్క్ ప్రారంభమై పదేళ్లు పూర్తయింది. పదో వార్షికోత్సవ సందర్భంగా కంపెనీ బహుళ జనాదరణ పొందిన ప్రీమియం ఎస్‌యూవీ గ్రాండ్ విటారాకు స్పెషల్ ఎడిషన్ 'ఫాంటమ్ బ్లాక్'ను మార్కెట్లోకి తెచ్చింది. ఈ కారు ఎక్స్ షోరూమ్ ప్రారం భ ధర రూ.11.42 లక్షలు. ఈ కారు ప్రత్యేకమైన మ్యాట్ బ్లాక్ కలర్ ర్యాప్‌లో, స్ట్రాంగ్ హైబ్రిడ్ ఆల్ఫాం వేరియంట్లలో అందుబాటులోకి వచ్చింది. పనోరమిక్ సన్‌రూఫ, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, అధునాతన స్మార్ట్‌ప్లే ప్రోం ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, ఆపిల్ కార్‌ప్లే, కారియన్ ప్రీమియం సౌండ్ సిస్టమ్ వంటి ఆధునిక ఫీచర్లు ఈ కారులో ఉన్నాయి. 6 ఎయిర్ బ్యాగులు, ఎలక్టానిక్ స్టెబిలిటీ ప్రోగ్రామ్, ఏబీఎసంఈబీడీ, హిల్ హెూల్డ్ కంట్రోల్, 360 డిగ్రీ వ్యూ కెమెరా వంటివి దీని ప్రత్యేక ఆకర్షణలు.

## ఢిల్లీలో టెస్లా సెకెండ్ షోరూం ప్రారంభం




**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా అధికారికంగా భారత విపణిలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. గత నెల 15న ఆర్థిక రాజధాని ముంబైలో తొలి షోరూంను ప్రారంభించింది. ఇప్పుడు రెండో షోరూంను కూడా తెరిచింది. దేశ రాజధాని ఢిల్లీ లో తన సెకెండ్ షోరూంను సోమవారం అధికారికంగా ఓపెన్ చేసింది. ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో గల ఏరోసిటీ లో ఓపెన్ చేసింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in

# టోన్డ్ అందాలతో గుబులు పుట్టించిన మలైకా

మలైకా అరోరా పరిచయం అవసరం లేదు. పవన్ కల్యాణ్ గబ్బర్ సింగ్‌లో కెవ్వు కేక సాంగ్ తో అలరించిన ఈ బ్యూటీ ఐటమ్ భామగా బాలీవుడ్ లోను ఫేమస్. ముఖ్యంగా సల్మాన్ సోదరుడు అర్భాజ్ ఖాన్ నుంచి విడిపోయాక యువహీరో అర్జున్ కపూర్ తో ప్రేమాయణం సాగించిన మలైకా నిరంతరం వార్తల్లో నిలిచింది. ప్రస్తుతం అర్జున్ నుంచి బ్రేకప్ అయిన మలైకా ఒంటరిగా ఉంది. ఇటీవల పూర్తిగా తన కెరీర్ పైనే ఫోకస్ చేసింది.కొద్దిరోజుల క్రితం కుమారుడు అర్హాన్ ఖాన్ తో కలిసి విదేశీ విహార యాత్ర నుంచి ఫోటోలు, వీడియోలను షేర్ చేసింది మలైకా. ఈ యాత్రలోను మలైకా ఎక్కడా తగ్గలేదు. వరుసగా బికినీ ఫోటోలను షేర్ చేసి ఆశ్చర్యపరిచింది. మలైకా బీచ్ షికార్లు ఎల్లపుడూ చర్చగా మారుతున్నాయి.తాజాగా ముంబైలో గౌరవ్ గుప్తా బ్రైడల్ కాంటూర్ కలెక్షన్ లాంచ్ ఈవెంట్‌లో మలైకా అరోరా గుబులు రేపే రూపంతో కవ్వించింది. ఏజ్ లెస్ బ్యూటీకి 50 వయసు అంటే నమ్మశక్యం కాదు. వైట్ హాఫ్ షోల్డర్ కటౌట్ గౌన్ లో మలైకా దివ్యమైన రూపం యువహృదయాలను కదిలించింది. ముఖ్యంగా మలైకా టోన్డ్ దేహశిరులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేదిక ఏదైనా కచ్చితంగా మలైకా ఆ వేదికకు కేంద్రక ఆకర్షణగా మారుతోంది. ఇప్పుడు కూడా తన దివ్యమైన రూపంతో మతులు చెడగొట్టింది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది.కెరీర్ మ్యాటర్ కి వస్తే..మలైకా అరోరా ఇటీవల బుల్లితెరపై రియాలిటీ షోల జడ్జిగా కొనసాగుతోంది. ముఖ్యంగా డ్యాన్స్ రియాలిటీ షోల జడ్జిగా బాగానే ఆర్జిస్తోంది. మరోవైపు ముంబైలో ఫ్యాషన్ ఈవెంట్లలోను మలైకా షో స్టాపర్ గా నిలుస్తోంది.

నవచిత్ర



# స్టార్ హీరోయిన్ మూడేళ్ల కష్టం



ఎంత పెద్ద హీరోయిన్స్ అయినా ప్రెగ్నెన్సీ తర్వాత సినిమాలను తగ్గిస్తారు, అందుకు కారణం వారి ఫిజికల్ ఫిట్ కారణం అంటూ చాలా మంది అంటూ ఉంటారు. గర్భం దాల్చి, బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత ఎవరైనా మునుపటి శక్తిని పుంజుకోవడానికి, అంతకు ముందు మాదిరిగా రూపంలోకి మారడానికి చాలా సమయం పడుతుంది. కొందరు హీరోయిన్స్ ప్రెగ్నెన్సీ తర్వాత సినిమాలకు పూర్తిగా దూరం అయిన సందర్భాలు ఉన్నాయి. తల్లి అయిన తర్వాత చాలా మంది బరువు విపరీతంగా పెరగడం మనం చూస్తూ ఉంటాం. పెగ్నెన్సీ సమయంలో వెయిట్ పెరిగిన వారు కొందరు తిరిగి తగ్గడం జరగదు. ఒకవేళ బరువు తగ్గినా పూర్తి స్థాయిలో బరువు తగ్గడం జరగదు. కానీ ఆలియా భట్ ఆ రూల్‌ను బ్రేక్ చేసింది. ఆలియా ప్రెగ్నెన్సీ టైమ్‌లో..! సాధారణంగా కెరీర్ పీక్స్‌లో ఉన్న సమయంలో హీరోయిన్స్ పెళ్లి చేసుకునేందుకు ఆసక్తి చూపించరు. కానీ ఆలియా భట్ పెళ్లి చేసుకోవడంతో పాటు, వరుసగా సినిమాలు చేస్తున్న సమయంలోనే బిడ్డకు జన్మనిచ్చింది. ఆలియా భట్ వరుసగా సినిమాలు చేస్తూ మునుపటి ఉత్సాహంతో దూసుకు పోతుంది. ఇండస్ట్రీలో ఎంతో మంది హీరోయిన్స్ ఉంటే ఆలియా భట్ మాత్రమే ప్రెగ్నెన్సీ తర్వాత ఈ స్థాయిలో అందంగా కనిపిస్తుందని ఆమె ఫ్యాన్స్‌తో పాటు అంతా కూడా మాట్లాడుకుంటున్నారు. ఆలియా భట్ అందంతో పాటు తన ఫిజిక్‌తో ఎక్కువగా జనాలకు నచ్చుతుంది. అందుకే ఆమె తన ఫిజిక్ విషయంలో ప్రెగ్నెంట్ సమయంలో, ఆ తర్వాత కూడా చాలా జాగ్రత్తలు తీసుకుంటూ వచ్చిందట. అందుకే ఇప్పుడు మునుపటి అందంతో ఆలియా చాలా చక్కగా కనిపిస్తుంది. కఠినమైన వర్కౌట్స్, డైట్‌తోనే సాధ్యం ఆలియా భట్ గర్భం దాల్చిన సమయంలో అందరి మాదిరిగానే చాలా వెయిట్ పెరిగింది. అప్పటి ఫోటో షూట్‌లను చూస్తే ఆ విషయం గమనించవచ్చు. జాతీయ మీడియా కథనాల అనుసారం ఆలియా గర్భం దాల్చిన తర్వాత దాదాపుగా 30 కేజీలకు పైగానే వెయిట్ పెరిగింది. ఆ మొత్తం వెయిట్ ను పూర్తిగా తగ్గించుకోవడం అంత సులభమైన విషయం కాదని అంతా అనుకున్నారు. కానీ ఆలియా కఠినమైన వర్కౌట్స్, డైట్ కారణంగా ఆ వెయిట్ తగ్గింది. బిడ్డకు జన్మనిచ్చిన కొన్ని వారాల్లోనే ఆలియా కఠినమైన వర్కౌట్స్ మొదలు పెట్టింది అని ఆమె సన్నిహితులు చెబుతూ ఉంటారు. అందుకే ఆమె ఇన్నాళ్లకు తన పూర్వపు రూపం కు వచ్చిందని ఆమె సన్నిహితులతో పాటు, ఆమెకు వ్యక్తిగతంగా జిమ్ లో ట్రైనింగ్ ఇచ్చే సోహ్రాబ్ ఖుష్రుషాహి చెప్పుకొచ్చాడు. %యాశ్రీంశీ =ముఁ% - కొత్త ట్రెండ్ కోసం రాజమౌళి అదిరిపోయే ప్లాన్ %యాఁజవతీఅంవఎవత్% సోహ్రాబ్ ఖుష్రుషాహి మాట్లాడుతూ.. ఇటీవల సోహ్రాబ్ ఖుష్రుషాహి ఒక సందర్భంగా మాట్లాడుతూ... ఆలియా పోస్ట్ ప్రెగ్నెన్సీ వర్కౌట్స్ గురించి, ఆమె తీసుకున్న ఫుడ్ గురించి చెప్పుకొచ్చాడు. డెలివరీ అయిన వెంటనే ఆలియా రోజు 15 నిమిషాల నడక మొదలు పెట్టింది. అలాగే శ్వాసకు సంబంధించిన ఆసనాలు చేసింది, యోగా చేయడం ద్వారా కూడా ఆలియా ఫిజికల్‌గా ఫిట్‌గా ఉండేందుకు ప్రయత్నం చేసింది. ఆలియా వ్యాయామాలతోనే తన పూర్వపు రూపంకు రాలేదు. ఆమె రెగ్యులర్‌గా తీసుకునే ఫుడ్‌లో తాజా పండ్లు, కూరగాయలు, మిల్లెట్స్ ఉండేలా చూసుకుంది. వాటిని రెగ్యులర్‌గా ఫాలో అవ్వడం వల్ల పోస్ట్ ప్రెగ్నెన్సీ లో ఈ ఫిజిక్ సాధించగలిగింది. ఆలియా భట్ దాదాపుగా మూడు ఏళ్ల పాటు కష్టపడటం వల్లే బిడ్డ జన్మించిన తర్వాత పూర్వ స్థితికి ఆలియా వచ్చిందని ఆమె జిమ్ ట్రైనర్ పేర్కొన్నాడు.

# వార్-2 ప్రీ రిలీజ్ ఈవెంట్..ఎన్టీఆర్ ధరించిన వాచ్ ఖరీదు ఎంతంటే?




ఎన్టీఆర్.. 'ఆర్ఆర్ఆర్' ముందు వరకు టాలీవుడ్ స్టార్ హీరోగా పేరు సొంతం చేసుకున్న ఈయన.. రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన ఆర్ఆర్ఆర్ సినిమాతో ఏకంగా గ్లోబల్ స్టార్ అయిపోయారు. ముఖ్యంగా జపాన్ దేశంలో ప్రత్యేకమైన ఫ్యాన్ ఫాలోయింగ్ సొంతం చేసుకున్నారు ఎన్టీఆర్. ఇకపోతే తన ఉనికిని విస్తరించుకోవడానికి ఇప్పుడు పలు భాషలలో నేరుగా సినిమాలు చేస్తూ అభిమానులను పెంచుకుంటున్నారు. అందులో భాగంగానే ఎన్టీఆర్ చేస్తున్న తొలి హిందీ చిత్రం వార్ 2. హృతిక్ రోషన్ కథానాయకగా.. కియారా అద్వానీ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం ద్వారా ఎన్టీఆర్ తొలిసారి బాలీవుడ్ రంగ ప్రవేశం చేస్తున్నారు.ఈ సినిమాలో ఎన్టీఆర్ విలన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ సినిమా నుండి టీజర్, ట్రైలర్, పాటలు విడుదలయ్యాయి. ఈ సినిమాపై మరింత బజ్ పెంచడానికి నిన్న హైదరాబాదులోని యూసఫ్ గూడా వేదికగా ఘనంగా ప్రీ రిలీజ్ ఈవెంట్ ను నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన ఈవెంట్ రాత్రి సుమారుగా 11 గంటల వరకు సాగింది. ఇక ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్ లో ఎన్టీఆర్ స్పీచ్ హైలెట్గా నిలిచింది అని చెప్పవచ్చు. ముఖ్యంగా త్రివిక్రమ్ శ్రీనివాస్ కూడా ఎన్టీఆర్ , హృతిక్ రోషన్ కాంబినేషన్ పై ప్రశంసలు కురిపిస్తూ అందరిని ఆశ్చర్యపరిచారు. అలా ఈ ఈవెంట్లో ఎవరికి వారు హైలైట్ అయ్యే ప్రయత్నం చేశారని చెప్పవచ్చు. ఇకపోతే ఈ ఈవెంట్లో ఎన్టీఆర్ మరొకసారి తన లగ్జరీని చూపించి స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచారు. ఇకపోతే ఈ ఈవెంట్ కి బ్లాక్ అండ్ బ్లాక్ స్టైలిష్ లుక్ లో వచ్చిన ఎన్టీఆర్.. తన లుక్ ను మరింత హైలెట్ చేస్తూ బ్లాక్ కలర్ రిస్ట్ వాచ్ తో అందరి దృష్టిని ఆకర్షించారు. బ్లాక్ కలర్ బెల్ట్.. గోల్డెన్ కలర్ డయల్ తో చాలా స్టైలిష్ గా కనిపించిన ఈ వాచ్ అందరి దృష్టిని ఆకర్షించింది. అంతేకాదు దాని ధర ఎంత అని తెలుసుకోవడానికి అభిమానులు కూడా తెగ గూగుల్ సర్చ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఇకపోతే ఈ వాచ్ ఖరీదు తెలిసి ఇప్పుడు అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.ఈ వాచ్ ఆడమర్స్ పిగెట్ రాయల్ ఓక్ డబుల్ బ్యాలెన్స్ వీల్ బ్లాక్ సిరామిక్ ఓపెన్ వర్క్ డయల్ లిమిటెడ్ ఎడిషన్ కి సంబంధించిన వాచ్.. దీని ఖరీదు మార్కెట్ ప్రకారం అక్షరాల రూ.3.37 కోట్లు. ఈ విషయం తెలిసి అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే ఎన్టీఆర్ కి వాచ్ లు అంటే చాలా ఇష్టం అన్న విషయం అందరికీ తెలిసిందే. ఇటీవల ముంబై ఎయిర్పోర్ట్లో కనిపించిన ఈయన తన చేతికి రిచర్డ్ మిల్లే మెక్ లారెన్ స్పీడ్ టెయిల్ వాచ్ ధరించారు. దీని ఖరీదు అక్షరాల 8 కోట్ల 60 లక్షలు పైగానే ఉంటుంది. ఇలా ఎప్పటికప్పుడు కోట్లు విలువ చేసే వాచ్లు ధరిస్తూ అందరిని ఆశ్చర్యపరుస్తూ ఉంటారు.

# బ్రహ్మానందం ఇంటికి చరణ్, ఉప్సీ.. స్పెషల్ ఏంటంటే?




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, ఆయన సతీమణి ఉపాసన ఎప్పుడూ బిజీ బిజీగా ఉంటారన్న విషయం తెలిసిందే. అటు హీరోగా షూటింగ్స్ లో చరణ్.. ఇటు బిజినెస్ పనుల్లో ఉప్సీ మునిగితేలుతుంటారు. ఇప్పుడు వారిద్దరూ ఫ్రీ టైమ్ చూసుకుని హాస్యబ్రహ్మ బ్రహ్మానందం ఇంటికి వెళ్లారు. అక్కడ ఆయన కుటుంబసభ్యులతో గడిపారు.అందుకు సంబంధించిన పిక్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. అందులో బ్రహ్మానందం కుటుంబ సభ్యులతో చరణ్, ఉపాసన ఆనందకరమైన క్షణాలను పంచుకున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. సరదాగా గడిపినట్లు అర్థమవుతోంది. ముఖ్యంగా చరణ్, బ్రహ్మానందం చాలా క్లోజ్ గా ఉన్న పిక్స్ తెగ చక్కర్లు కొడుతున్నాయి.తమ ఇంటికి విచ్చేసిన వేళ రామ్ చరణ్,ఉపాసన దంపతులకు వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని బ్రహ్మానందం బహూకరించారు. గోల్డెన్ కలర్ లో విగ్రహం అద్భుతంగా ఉందని చెప్పాలి. అయితే రామ్ చరణ్ దంపతులతో బ్రహ్మానందం తన సతీమణి, కుమారులు, కోడళ్లు సహా మనవడు, మనవరాలుతో కలిసి గ్రూప్ ఫోటో కూడా దిగారు.అదే సమయంలో పిక్స్ సూపర్ గా ఉన్నాయని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. బ్రహ్మీ, చరణ్ క్లోజ్ గా ఉన్న ఫోటోలు అయితే అదిరిపోయాయని చెబుతున్నారు. హ్యాపీ మూమెంట్స్ అంటూ హ్యాష్ ట్యాగ్స్ కూడా ఇస్తున్నారు. అయితే రామ్ చరణ్, ఉపాసన దంపతులు.. బ్రహ్మానందం ఇంటికి ఎందుకు వెళ్లారో మాత్రం తెలియదు.సాధారణంగా మీట్ అవ్వడానికి వెళ్లి ఉంటారని నెటిజన్లు అంటున్నారు. కాగా.. ఇప్పుడు చరణ్.. తన అప్ కమింగ్ మూవీ పెద్దితో బిజీగా ఉన్నారు. ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సనా దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఉత్తరాంధ్ర బ్యాక్ డ్రాప్ లో స్పోర్ట్స్ జోనర్ లో గ్రాండ్ గా రూపొందిద్దుకుంటోంది.సినిమాలో నెవ్వర్ బిఫోర్ లుక్ లో చరణ్ కనపడనున్నారని ఇప్పటికే అందరికీ క్లారిటీ వచ్చేసింది. రీసెంట్ గా జిమ్ లో పిక్ ను వరుణ్ షేర్ చేయగా.. అందులో చరణ్ వేరే లెవెల్ లో ఉన్నారు.

# ఆలియా, దీపికా లిస్ట్‌లోకి కియారా కూడా!



అమ్మతనం లైఫ్ మొత్తాన్ని మార్చేస్తుంది. అప్పటివరకు ఒకలా ఉంటే ఓ బిడ్డకు జన్మనిచ్చి తల్లిగా మారాక తమ జీవితం మొత్తం మారిపోతుంది. ప్రతీ విషయాన్ని చాలా క్షుణ్ణంగా ఆలోచించి, ఎంతో జాగ్రత్తలుగా నిర్ణయాలు తీసుకుంటూ ఉంటారు. సెలబ్రిటీలు కూడా అందుకు అతీతులు కాదు. ఈ విషయాన్ని ఇప్పటికే పలువురు స్టార్ హీరోయిన్లు బహిరం గంగా వెల్లడించిన విషయం తెలిసిందే. కూతురు పుట్టాక చాలా మార్పులొచ్చాయని ఆలియా భట్ చెప్తే, కూతురు పుట్టిందనే కారణంతో పర్సనల్ లైఫ్ కు మరింత టైమ్ కేటాయించాలని దీపికా పడుకొణె ఆలోచించి, తన కూతురు కోసం సినిమాల ఎంపిక విషయంలో కూడా ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు ఆ లిస్ట్‌లోకి బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ కూడా వచ్చింది. కియారా అద్వానీ-సిద్ధార్థ్ మల్హోత్రా జులైలో ఓ ఆడబిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం మదర్‌హుడ్‌ను ఎంజాయ్ చేస్తున్న కియారా కూతురు పుట్టాక తన జీవితమే మారిపోయినట్టు రీసెంట్‌గా ఓ పోస్ట్ చేశారు. కూతురితో ఎంతో విలువైన సమయాన్ని గడుపుతున్న కియారా తన కూతురి గురించి చేసిన పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. నేను నీ డైపర్లు మారుస్తున్నాను. నువ్వేమో నా ప్రపంచాన్నే మార్చేశావ్.. ఈ డీల్ చాలా బావుందంటూ ఓ కొటేషన్ ఉన్న ఫోటోని తన ఇన్‌స్టా స్టోరీలో షేర్ చేయడమే కాకుండా హ్యాండ్స్ తో హార్ట్ సింబల్, కళ్లలో నీళ్లు తిరిగే ఎమోజీలను షేర్ చేశారు. షేర్షా సినిమా టైమ్ లో బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రాతో ఏర్పడిన పరిచయం ఆ తర్వాత ప్రేమగా మారగా 2023లో వీరిద్దరూ పెళ్లితో ఒక్కటయ్యారు.

# అందరూ మర్చిపోయిన బ్యూటీ పబ్లిసిటీ స్టంట్!



తెలుగులో గుండె జారి గల్లంతయ్యిందే, రాజా చెయ్యి వేస్తే లాంటి చిత్రాల్లో నటించింది ఇషా తల్వార్. నితిన్ సరసన నటించిన గుండె జారి గల్లంతయ్యిందేబ్లాక్ బస్టర్ విజయం సాధించగా, రెండోది యావరేజ్ గా ఆడింది. అయితే ఇషాను ఆల్మోస్ట్ టాలీవుడ్ లో మర్చిపోయారు. ఈ బ్యూటీ తెలుగు సినిమాల్లో సరైన ఆఫర్లు లేక ఇతర పరిశ్రమల్లోను అదృష్టం పరీక్షించుకుంది. ఒకే భాషలో ఆటాడటం ఇప్పుడున్న పోటీలో చాలా కష్టం. కథానాయికలకు మైలేజ్ కూడా చాలా తక్కువ. అందుకే తమిళం, హిందీ, పంజాబీ, మలయాళంలోను తనవంతు ప్రయత్నాలు చేసింది. కానీ అక్కడా ఇషా తన ప్రతిభతో నిరూపించుకుని ఆశించిన రేంజుకు చేరుకోలేకపోయింది. మహావతార్ కి భయపడుతున్న సూపర్ స్టార్స్ రంగుల ప్రపంచంలో స్టార్ హీరోయిన్ హోదా అందుకోవడం అంటే అంత సులువు కాదు. అది అతి కొద్ది మందికి మాత్రమే రాసి పెట్టి ఉంటుంది. ఇషా లాంటి టూటైర్ నటీమణులకు ఆ అవకాశం ఎప్పటికీ ఉండదని కూడా ప్రూవ్ అయింది. అయితే కొంత గ్యాప్ తర్వాత ఇషా తల్వార్ వెబ్ సిరీస్ లలో ది బెస్ట్ ఇచ్చేందుకు ప్రయత్నించింది. మీర్జాపూర్, సాస్ బహు ఔర్ ఫ్లెమింగో, ఆర్టికల్ 15 లాంటి చిత్రాల్లో అద్భుత నట ప్రతిభతో ఆకర్షించింది. ఈ ఏడాది అంతగా గుర్తుంచుకోతగని ఓ రెండు సినిమాల్లో ఇషా తల్వార్ నటించింది. వీటిలో తమిళంలో ఒకటి, హిందీలో ఒకటి ఇప్పటికే విడుదలై వెళ్లాయి. ఇషా తల్వార్ కి అటు నార్త్ లో కానీ, ఇటు సౌత్ లో కానీ ఆశించినంత పెద్ద అవకాశాలు ఇచ్చేవాళ్లు ఎవరూ లేరు. అదే క్రమంలో తన పీఆర్ స్కిల్‌ని యాక్టివేట్ చేసినట్టే కనిపిస్తోంది. ఉన్నట్టుండి ఇప్పుడు ఒక అసందర్భపు విషయాన్ని మీడియా ఎదుట గుర్తు చేసి దానిని వివాదాస్పదం చేయాలని ప్రయత్నిస్తోంది. తనను తొలిసారి ఆడిషన్ చేసిన కాస్టింగ్ ఏజెంట్ షానూ శర్మపై ఇషా తల్వార్ ఊహించని ఆరోపణలు చేసింది. షానూ బాలీవుడ్ లో టాప్ క్లాస్ కాస్టింగ్ ఏజెంట్. ఇటీవల బ్లాక్ బస్టర్ విజయం సాధించిన సయ్యారాకాస్టింగ్ అనీత్ పద్దా, అహాన్ పాండేలను ఆడిషన్ చేసి పరిశ్రమకు అందించిన ప్రతిభావని. అంతకుముందు పరిణీతి చోప్రా, అనుష్క శర్మ లాంటి ప్రతిభావంతులను, హిడెన్ జెమ్స్ ని కూడా షానూ వెతికి పట్టుకుంది. అసలింతకీ ఇషా తల్వార్ ఆరోపణ ఏమిటి? అంటే..... తనను ఆడిషన్ కి పిలిచిన షానూ జనం గుమిగూడిన ఒక బిజీ రెస్టారెంట్ లో ఒక ఏడుపు గొట్టు సీన్ లో నటించమని కోరిందని, దానికి తాను నో చెప్పానని ఇషా చెప్పింది. రెస్టారెంట్ లో అంతమంది ముందు ఆ సీన్ చేయాలా? ఒక టేబుల్ వద్ద కూచుని ఎవరికోసమో ఎదురు చూస్తూ ఏడ్వాలి. కానీ ఇషా దానిని చేసేందుకు తటపటాయించింది. అంతమందిలో అలా అడిగేసరికి కోపగించుకుంది.

# బిగ్ బాస్‌లో కొత్త ట్విస్ట్..
## కామన్ మ్యాన్‌కు అగ్ని పరీక్షే



తెలుగు రాష్ట్రాల బుల్లితెర ప్రేక్షకులను అలరించేందుకు రియాలిటీ షో బిగ్ బాస్ సీజన్ 9 సిద్ధం అవుతోంది. గత 8 సీజన్లుగా తెలుగిళ్లలో అత్యంత ఆదరణ దక్కించుకున్న షో గా ప్రసిద్ధి చెందింది బిగ్ బాస్. ఇప్పుడు సరికొత్త హంగులతో ముస్తాబవుతోంది. అయితే ఈసారి కాస్త భిన్నంగా రానుంది. కొత్త రూల్స్, కొత్త ట్విస్ట్ లతో ఉండనుంది.ఇప్పటివరకు బిగ్ బాస్ హౌజ్ లో కంటెస్టెంట్ లు వేర్వేరు గదులు, హాలు, కిచెన్ తో సెటప్ డిఫరెంట్ గా చూశాం. గత 8 సీజన్లలో ఇదే విధంగా నడిచింది. కానీ, తాజా సీజన్ లో మాత్రం ఆట మారనుంది. తాజా సమాచారం ప్రకారం.. రానున్న సీజన్ లో రెండు హౌజ్ లు ఉంటాయని టాక్ వినిపిస్తుంది.ఇటీవల విడుదలైన ప్రోమోలో హోస్ట్ నాగార్జున అక్కినేని దీని గురించి హింట్ ఇచ్చారు. ఈసారి సీజన్ లో ట్విస్ట్ ఉంటుందని ప్రోమో చూస్తే అదే అనిపిస్తుంది. అలాగే తెలుగు ఆడియెన్స్ కు బిగ్ బాస్ ఈసారి డబుల్ డోస్ ఎంటర్టైన్మెంట్ అందించనుంది. అలాగే ఈ సీజన్ ప్రారంభానికి ముందు అగ్ని పరీక్ష పేరతో ఓ ప్రీ షో నిర్వహించను న్నారు. ఇందులో గత 8 సీజన్లో పాల్గొన్న కంటెస్టెంట్లు, విన్నర్లు పాల్గొం టారు.వాళ్లు ఈసారి హౌజ్ లోకి ఎంటర్ అయ్యే కామన్ పీపుల్స్ ను ఎంపిక చేస్తారు. వాళ్లు పెట్టిన టాస్క లు కంప్లీట్ చేసే బెస్ట్ పర్ఫార్మర్ కు సీజన్ 9 బిగ్ బాస్ హౌజ్ లో ఎంటర్ అయ్యే ఛాన్స్ దక్కుకుంది. ఇలా ఆ కామన్ మ్యాన్ ను గత సీజన్ల కంటెస్టెంట్లు డిసైడ్ చేస్తారు. ఈ క్రమంలో అగ్ని పరీక్ష ప్రోగ్రామ్ కు గత కంటెస్టెంట్లు నవదీప్, సీజన్ 4 విన్నర్ అభిజిత్, ఓటీటీ విన్నర్ బింధు మాధవి జడ్జ్ లుగా రానున్నారని బజ్ నడుస్తోంది.అలా తొలిసారి షో ప్రారంభానికి ముందు ఇలా కామన్ మ్యాన్ ను ఎన్నుకోవడం, అనేక రకాల ట్విస్టులతో బిగ్ బాస్ సీజన్ 9 ప్రారంభం కానుంగి. వచ్చే నెలలో ఈ షో షురూ అవ్వనుంది.

# నా మోకాలు నొప్పిగా ఉంది.. ఎవరి భరిస్తారు.. అభిమాని రిక్వెస్ట్‌కు ధోనీ ఫన్నీ రిప్లై..



**న్యూఢిల్లీ-నవభూమి:** టీమిండియా మాజీ లెజెండ్ ఎంఎస్ ధోనీ అంతర్జాతీయ క్రికెట్ నుంచి వైదొలిగి ఐదేళ్లు పూర్తయింది. అయితే ఐపీఎల్ లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు తరఫున మాత్రం ధోనీ ఆడుతున్నాడు. ధోనీని తమిళ అభిమానులు ఎంతగానో అభిమానిస్తారు. ధోనీని పసుపు రంగు జెర్సీలో చూసి మురిసిపోతారు. ధోనీ ఎప్పటికీ ఐపీఎల్ ఆడుతూనే ఉండాలని కోరుకుంటారు. అయితే మోకాలి నొప్పితో బాధపడుతున్న ధోనీ వచ్చే సీజన్ ఆడతాడో, లేదో ఇంకా క్లారిటీ లేదు.తాజాగా ధోనీ ఓ కార్యక్రమంలో పాల్గొన్నాడు. ఆ కార్యక్రమంలో ధోనీకి వచ్చే ఐపీఎల్‌లో ఆడతారా అనే ప్రశ్న ఎదురైంది. వ్యాఖ్యాతల నుంచి వచ్చిన ఆ ప్రశ్నకు ధోనీ స్పందిస్తూ.. 'వచ్చే సీజన్ ఆడతానో లేదో తెలియదు. అయినా అందుకు ఇంకా చాలా సమయం ఉంది. డిసెంబర్‌లో నిర్ణయం తీసుకుంటా. ఇప్పుడే చెప్పడం సరైంది కాదు' అని ధోనీ చెప్పాడు. ఆ సమయంలో ఓ అభిమాని.. 'మీరు తప్పకుండా ఆడాలి సర్' అని అరిచాడు. దానికి ధోనీ స్పందిస్తూ.. 'నా మోకాలు నొప్పిగా ఉంది. దానిని ఎవరు భరిస్తారు' అని సరదాగా ప్రశ్నించాడు.గత సీజన్ అంతా ధోనీ మోకాలి నొప్పితోనే బ్యాటింగ్ చేశాడు. చివర్లో బ్యాటింగ్‌కు వచ్చి రన్స్ తీయకుండా బౌండరీలతో హోరెత్తించాడు. రెగ్యులర్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ గాయం కారణంగా దూరం కావడంతో కెప్టెన్సీ బాధ్యతలు కూడా నిర్వర్తించాడు. అయితే చెన్నై టీమ్ పేలవ ప్రదర్శనతో అసలు పోటీలోనే లేకుండా పోయింది. వచ్చే సీజన్‌లో ధోనీ బ్యాట్ పట్టుకుని మైదానంలోకి దిగకపోయినప్పటికీ కోచింగ్ బాధ్యతలు మాత్రం తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.


# ఆసియా కప్ 2025 టీ20లో శుభ్‌మాన్ గిల్ రీఎంట్రీ.. హార్దిక్ పాండ్యాకు ఛాన్స్ లేదా?



**న్యూఢిల్లీ-నవభూమి:** ఆసియా కప్ 2025 టీ20 టోర్నీ దగ్గర పడుతోంది. ఈ నేపథ్యంలో టీమిండియాలో ఎవరు రాణిస్తారు? ఎవరు కొత్తగా ఎంట్రీ ఇస్తారనే టాక్ ఇప్పుడు ఫుల్ స్వింగ్‌లో ఉంది. ఈ క్రమంలోనే యంగ్ స్టార్ శుభ్‌మాన్ గిల్ గురించి ఒక ఇంట్రెస్టింగ్ న్యూస్ వచ్చింది. గిల్ ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన 5 మ్యాచుల టెస్ట్ సిరీస్‌లో కెప్టెన్‌గా అద్భుతమైన ప్రదర్శన చేశాడు. ఈ ప్రారంభం తర్వాత, అతని కెప్టెన్సీ, అలాగే బ్యాటింగ్‌కి మరింత ఛాన్స్ వచ్చింది.దీంతో రేపటి ఆసియా కప్ 2025లో గిల్, టీ20లో వైస్-కెప్టెన్‌గా ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ఏడాది సూర్యకుమార్ యాదవ్ ఫిట్‌గా ఉంటాడని భావిస్తున్నందున, గిల్ అతని వైస్ కెప్టెన్?గా ఉంటాడని భావిస్తున్నారు. ఇప్పుడు ప్రశ్న ఏంటంటే, గిల్ టీ20లో ఓపెనర్‌గా ఆడతాడా లేక నెంబర్ 3 స్పాట్‌లో దిగతాడా? ఎందుకంటే, ఇటీవల అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ ఓపెనింగ్‌లో ఫుల్ ఫామ్‌లో ఉన్నారు. వీళ్లిద్దరూ టీ20లో బ్యాటింగ్‌తో ఆకట్టుకుంటున్నారు. మరి గిల్‌ని ఎక్కడ ఫిట్ చేస్తారో చూడాలి.

నవక్రీడ

# మురళీ అన్నూలకు స్వర్ణాలు



**భువనేశ్వర్-నవభూమి:** వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ బ్రాంజ్ లెవెల్ ఈవెంట్‌లో భారత అథ్లెట్లు సత్తా చాటారు. ఆదివారం ఒక్క రోజుపాటు జరిగిన ఈ పోటీల్లో ఫేవరెట్లుగా బరిలోకి దిగిన లాంగ్ జంపర్ మురళీ శ్రీశంకర్, స్టార్ స్ప్రింటర్ అనిమేష్ కుజుర్, వెటరన్ జావెలిన్ త్రోయర్ అన్నూ రాణి అంచనాలను నిలబెట్టుకున్నారు. 17 దేశాల నుంచి 150 మంది అథ్లెట్లు పాల్గొనగా, వీరంతా 19 ఈవెంట్స్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. భారత్ నుంచే మొత్తంగా 90 మంది ఆటగాళ్లు ఉండడం విశేషం. అలాగే ఇది ఇన్విటేషనల్ టోర్నీ కావడంతో భారత్ నుంచి పాల్గొన్న అథ్లెట్లంతా వ్యక్తిగత విభాగాల్లో తమ రాష్ట్రాలు, పనిచేసే సంస్థల తరఫున బరిలోకి నిలిచారు. లాంగ్‌జంపలో మురళీ శ్రీశంకర్‌కు కాస్త పోటీ ఎదురైనా చివరిదైన ఆరో రౌండ్‌లో అత్యధికంగా 8.13మీ. దూరం దూకి స్వర్ణం సాధించాడు. మొత్తంగా తను రెండుసార్లు ఫౌల్ అయ్యాడు. అయితే టోక్యో వరల్డ్ చాంపియన్‌షిప్స్‌కు అర్హత దూరాన్ని (8.27మీ) మాత్రం మురళీ అందుకోలేకపోయాడు. యూపీకి చెందిన 17 ఏళ్ల షానవాజ్ ఖాన్ (8.04మీ), కర్ణాటక అథ్లెట్ లోకేష్ సత్యనాథన్ (7.85మీ) రెండు, మూడో స్థానాల్లో నిలిచారు. అలాగే అందరి దృష్టిని ఆకర్షించిన స్టార్ జావెలిన్ త్రోయర్, ఆసియా గేమ్స్ చాంపియన్ అన్నూ రాణి 62.01మీ. దూరం బల్లెం విసిరి టాప్‌లో నిలిచింది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: SHAIK SHAHANAZ, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com RNI No: TEL TEL: 82083